


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com




visit us @ http://epaper.suryaa.com
సంపుటి 17 | సంచిక 125
బుధవారం | 28 ఫిబ్రవరి 2024 | హైదరాబాద్ | పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

ఆనుగ్రహం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయనం - శిశిర ఋతువు, మాఘ మాసం బహుళ చవితి మ.1.12, చిత్త పూర్తి వ్యర్ణం మ.2.07 నుంచి 3.51 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు, దుర్ముహూర్తం ఉ.11.52 నుంచి 12.38 వరకు

# మా పాలన జనాభీష్టం

- ఇందిరమ్మ కమిటీలతో ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు
- సోనియమ్మ హామీలు అమలు చేస్తున్నాం
- చీకట్లో కలిసి, పొద్దునే కొట్లాడుకున్నట్లు మోడీ కేడీ నాటకాలు
- జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పార్లమెంట్ ఎన్నికల్లో ఒక సీటైనా గెలవాలని కేటీఆర్‌కు సవాల్





ప్రతి గ్రామంలో వివిధ సామాజికవర్గాలకు చెందిన అయిదుగురితో కలిపి ఇందిరమ్మ కమిటీలు వేస్తామని, ఇళ్లు, పింఛన్లు, సిలెండర్లు, ఏ పథకమైనా ఆ కమిటీల ద్వారానే పేదలకు చేర్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గెలిచిన తర్వాత నాయకులు కార్యకర్తలను మర్చిపోతారనే ప్రచారం ఉందని.. తాము అలా కాదని పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలను వార్డు సభ్యులుగా, సర్పంచులుగా, ఎమ్పీటీసీ సభ్యులుగా, ఎంపీపీలుగా, జడ్పీటీసీ సభ్యులగా, జడ్పీ అధ్యక్షులుగా గెలిపించుకునే వరకు అండగా నిలబడతామని ఆయన హామీ ఇచ్చారు.

## అంతరిక్షంలోకి వెళ్లే
# వ్యోమగాములు


6లో

- పేర్లు వెల్లడించిన ప్రధాని నరేంద్ర మోడీ
- 'గగన్ యాన్' భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టనున్న ప్రయోగం

అంతరిక్ష రంగంలో ప్రపంచ దేశాల సరసన భారత్ సగర్వంగా తలెత్తుకుని నిలబడుతున్న విషయం తెలిసిందే. అనేక ప్రయోగాల్లో భారత్.. అమెరికా, చైనా సహా పలు దేశాలకు దీటుగా దూసుకుపోతోంది. చంద్రయాన్ . వంటి కీలక ప్రయోగాలతో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది.


5లో

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

- 305 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్
- 76 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- 2.78 శాతం లాభపడ్డ టాటా మోటార్స్ షేర్లు

## వైసీపీ నేతలు ఇంకెంత దిగజారిపోతారో ఊహించలేం

- క్రికెటర్ హనుమ విహారి మనస్థాపంపై ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల స్పందన
- ఇంతకంటే సిగ్గుచేటు విషయం ఇంకేమన్నా ఉంటుందా అని మండిపడ్డారు


2లో


సూర్య వెబ్‌సైట్


సూర్య ఈ - పేపర్

## సంక్షేమ పాలన
# అందించాం

- రాజకీయాల్లో విశ్వసనీయత ముఖ్యం
- చంద్రబాబుకు విశ్వసనీయత లేదు
- మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం పేరుతో కీలక సమావేశం
- సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై వైసీపీ శ్రేణులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం


2లో

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ
# ఎన్‌కౌంటర్



- ప్రాణాలు కోల్పోయిన నలుగురు మావోయిస్టులు
- భద్రతా బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం

వివరాలు-6లో

## ఎల్ఆర్ఎస్ పథకానికి
# రెక్కలు

- సర్కారుకు కాసుల పంట
- రేవంత్ సర్కార్ ద్విముఖ వ్యూహం
- ఇటు వెసులుబాటు- అటు ఆదాయం
- ఫీజు వసూలు నిర్ణయంపై విపక్షం మండిపాటు

2020 భూముల క్రమబ ద్దీకరణ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మధ్య తరగతి కుటుంబాలకు మేలు చేసే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయా లని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


8లో

## అంతా ఇంతే!



మన దుస్తులపై స్వేచ్ఛ ఇచ్చే వాళ్లకే ఓటేద్దాం

## ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా
# సేవా కార్యక్రమాలు

- గిరిజన సోదర,సోదరీమణులకు వైద్యం అందించడం ఆనందంగా ఉంది
- త్వరలో 7 ప్రాంతాల్లో ఎన్టీఆర్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు
- సాలూరు టౌన్‌లో హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవంలో నారా భువనేశ్వరి


2లో

## అమరావతే
# ఏపీ రాజధాని

- బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో రాజ్ నాథ్
- విజయవాడలో బీజేపీ కోర్ కమిటీ సమావేశం
- హాజరైన కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్
- బీజేపీ సమావేశంలో ఏపీ రాజధానిపై చర్చ
- పొత్తులు ఉంటాయని సంకేతాలు ఇచ్చిన రాజ్ నాథ్

విజయవాడలో నిర్వహించిన బీజేపీ కోర్ కమిటీ సమావేశానికి కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏపీ రాజధానిపై చర్చ జరిగింది. రాజధాని అంశంపై ఓ నాయకుడు అడిగిన ప్రశ్నకు రాజ్ నాథ్ స్పందించారు. ఏపీ రాజధాని అమరావతేనని మనం తీర్మానం చేశాం అని స్పష్టం చేశారు.


2లో

## కాళేశ్వరంపై
# సర్కార్ కుట్ర


6లో

- మరమ్మతులపై నోరుమెదపని రేవంత్
- రెండు నెలలలోనే పనులు పూర్తి చేయొచ్చు
- మార్చి ఫస్టన చలో కాళేశ్వరం
- కాంగ్రెస్ విధానాలను తప్పు పట్టిన మాజీ మంత్రి కేటీఆర్

## భక్తుల సేవే..స్వామి సేవ : ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



వెలగపూడి సచివాలయం, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల తిరుపతి దేవస్థానంలో గత నాలుగేళ్ళలో గత టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు కల్పించిన వివిధ సేవలు, పలు అభివృద్ధి పనులపై విశ్రాంత సిపిఆర్ఓ టు సియం డా.విజయకుమార్ రచించిన భక్తుల సేవే..స్వామి సేవ అనే పుస్తకాన్ని మంగళవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ది గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థ్యం కొన్నేళ్ళుగా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని తెలిపారు. దానిలో భాగంగా గత నాలుగేళ్ళ కాలంలో పూర్వపు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి, ఇఓ ధర్మారెడ్డిల ఆధ్వర్యంలో అనేక సౌకర్యాలను కల్పించడం జరుగుతోందని తెలిపారు. భక్తుల సేవే భగవంతుని సేవగా భావించి ఇటీవల కాలంలో టిటిడిలో పెద్దఎత్తున భక్తులకు సౌకర్యాలు కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యుత్ బస్సులు ఏర్పాటు చేయడం,టిటిడిలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించడం, పవిత్ర ఉద్యానవనాలు, శ్రీవారి కోసం పుష్ప తోట, గోసంరక్షణ శాలల అభివృద్ధి,గోఆధారిత ఉత్పత్తులతో శ్రీవారికి నైవేద్యం, రికార్డు సమయంలో ఘాట్ రోడ్డు పునర్నిర్మాణం, మరిన్ని అన్నప్రసాద కేంద్రాలు ఏర్పాటు వంటి అనేక రకాల సేవలను అందించడం ద్వారా దేశ విదేశాల నుండి వచ్చే శ్రీవారి భక్తుల మన్ననలు పొందడం జరుగుతోందన్నారు.

# సంక్షేమ పాలన అందించాం

● రాజకీయాల్లో విశ్వసనీయత ముఖ్యం ● చంద్రబాబుకు విశ్వసనీయత లేదు ● 45 రోజులపాటు కీలకం ● రూ.2 లక్షల 55 వేల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో జమ చేశాం ● మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో మేము సిద్ధం..మా బూత్ సిద్ధం పేరుతో కీలక సమావేశం ● సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు వైయస్సార్సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం



గుంటూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ జనం కంటే క్యాడర్ నే ముందుగా సిద్ధం చేసుకుంటున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి మంగళవారం మరో కీలక సమావేశం నిర్వహించారు. ఇప్పటికే క్యాడర్ తో ప్రాంతాల వారీగా సిద్ధం సభలు నిర్వహిస్తున్న జగన్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదావు 3 వేల మంది కీలక నేతలతో మరో సిద్ధం భేటీ నిర్వహించారు. ఇందులో వచ్చే ఎన్నికల్లో తిరిగి ఎలా గెలవాలన్న దానిపై వారికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో 175కు 175 సీట్లు ఎలా సాధించాలన్న దానిపై మరోసారి ప్రధానంగా సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు.

***45 రోజులపాటు కీలకం :*** అసెంబ్లీ ఎన్నికలకు అధికార వైఎస్సార్‌సీపీ సమాయత్తమైంది. మంగళగిరిలో మంగళవారం పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. 175 నియోజకవర్గాల నుంచి 2,500 మంది నేతల్ని ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. రేపటి నుంచి 45 రోజులపాటు కీలకం. మనం చేసిన మంచి పనులు, చేసే మంచిని ప్రజలకు చెప్పండి. రాజకీయాల్లో విశ్వనీయత ముఖ్యం. చంద్రబాబుకు విశ్వసనీయత లేదు. 2014లో చంద్రబాబు అది చేస్తాం ఇది చేస్తాం అంటూ హామీలిచ్చారు. సాధ్యపడని హామీలను కూడా మేనిఫెస్టోలో పెట్టారు. అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారు. చంద్రబాబు ఇచ్చిన దొంగ హామీలు నాకు ఇంకా గుర్తుంది. రైతు రుణాలు మాఫీ చేస్తానన్నాడు, బంగారం లోన్లు తీరుస్తానన్నాడు. సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేశాడు. అసలు అమలు సాధ్యం కాని హామీలు ఎలా ఇచ్చాడో చంద్రబాబుకే తెలియాలి. ఒక హామీ ఒక నాయకుడు ఇచ్చాడంటే దానికి విశ్వసనీయత ఉండాలి. తప్పుడు హామీలు ఎప్పుడు మనం ఇవ్వలేదు, ఇవ్వం కూడా. మనం ఏది ఇవ్వగలమో.. అది చెబుతున్నా. 99 శాతం హామీలన్నింటిని నెరవేర్చాం. దేశంలో విశ్వసనీయత ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని స్పష్టం చేశారు.

***మోసం ఎప్పుడూ నిలబడదు :*** 2019లో మనం అమలు చేయగలిగే హామీలిచ్చాం. ప్రజలకు గుర్తుండిపోయేలా 2019 మేనిఫెస్టో తెచ్చాం. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయగలరా? అని అడిగారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తీరతామని ఆనాడు చెప్పా. ఇది చెప్పాం .. ఇది చేశాం అని ఇంటింటికి వెళ్లి చెప్పగలుగుతున్నాం. మన పథకాలతో 87 శాతం పైచిలుకు కుటుంబాలకు సంక్షేమం అందిచాం. కుప్పంలో 93 శాతం కుటుంబాలకు మేలు చేశాం. కుప్పంలో 87 వేల ఇళ్లు ఉంటే 83 వేల ఇళ్లకు మంచి జరిగిందన్నారు. కుప్పంలో 83 వేల కుటుంబాలకు రూ.1,400 కోట్లు ఇచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా బటన్ నొక్కడం, ఏకంగా రూ.2 లక్షల 55 వేల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో జమ చేశాం. మనం చేసిన మంచి చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. 57 నెలల్లో పూర్తి ప్రక్షాళన జరిగింది. సంక్షేమ పాలన అందించాం. గతంలో వెయ్యి రూపాయలు ఉన్న ఫించన్ ను 3 వేలకు చేశామని వివరించారు.



***ఓటర్లకు ఎప్పుడూ అందుబాటులో : ఉండాలి :*** ప్రతీ బూత్ లో 60 శాతం ఓట్లు సాధించేలా చేయాల్సిన పనులేంటో వారికి స్పష్టంగా చెప్పేసారు. నేతలు ప్రజలకు, ఓటర్లకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సీఎం జగన్ సూచించారు. ముఖ్యంగా పోలింగ్ బూత్ నిర్వహణ , ప్లానింగ్ పై దృష్టి పెట్టాలన్నారు. రాబోయే 45 రోజులు చాలా కీలకమన్నారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అన్నీ పర్యవేక్షిస్తున్నామని నేతలకు సీఎం జగన్ తెలిపారు. మేము సిద్ధం -మా బూత్ సిద్ధం అనుకుంటూ అందరు దీనిపై దృష్టి పెట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతీ ఎన్నికల బూత్ లోనూ 60 శాతం ఓట్ల సాధనే లక్ష్యంగా పని చేయాలని నేతలకు జగన్ సూచించారు. ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, పార్టీ నుంచి ఆ మేరకు వారికి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

# అమరావతే ఏపీ రాజధాని అని తీర్మానం చేశాం

● బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో రాజ్ నాథ్ ● విజయవాడలో బీజేపీ కోర్ కమిటీ సమావేశం ● హాజరైన కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ ● బీజేపీ సమావేశంలో ఏపీ రాజధానిపై చర్చ ● పొత్తులు ఉంటాయని సంకేతాలు ఇచ్చిన రాజ్ నాథ్



విశాఖపట్నం, సూర్య ప్రత్యేక ప్రతినిధి : విజయవాడలో నిర్వహించిన బీజేపీ కోర్ కమిటీ సమావేశానికి కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏపీ రాజధానిపై చర్చ జరిగింది. రాజధాని అంశంపై ఓ నాయకుడు అడిగిన ప్రశ్నకు రాజ్ నాథ్ స్పందించారు. ఏపీ రాజధాని అమరావతేనని మనం తీర్మానం చేశాం అని స్పష్టం చేశారు. అంతేకాదు, ఏపీలో పొత్తులు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. బీజేపీ మూడోసారి కూడా దేశంలో అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు.

***విపక్షాల విమర్శలు అర్థరహితం :*** ఏలూరులో బీజేపీ బహిరంగ సభలో రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ ఏలూరులో ఏపీ బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో రాజ్ నాథ్ ప్రసంగిస్తూ విపక్షాల విమర్శలు అర్ధరహితమని కొట్టిపారేశారు. మూడో సారే కాదు, ఆ తర్వాత కూడా నరేంద్ర మోడీనే ప్రధాని అని ధీమా వ్యక్తం చేశారు. భారత్ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేయడానికి మోడీ సర్కారు కృషి చేస్తుందని చెప్పారు. ఇప్పటివరకు తమ ట్రాక్ రికార్డు అద్భుతంగా ఉందని రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ పదేళ్లలో దేశంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని అన్నారు. 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడడడం బీజేపీ సర్కారు వల్లే జరిగిందని వివరించారు. బీజేపీ ఏం చెబుతుందో అదే చేస్తుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. జమ్మూ కశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు చేస్తామని చెప్పాం. జమ్మూ కశ్మీర్ ను ఈ దేశంలో భాగం చేస్తాం అని చెప్పాం. ట్రిపుల్ తలాక్ ను రద్దు చేస్తామని చెప్పాం. చేసి చూపించామని రాజ్ నాథ్ వివరించారు. ఈ క్రమంలో రాజ్ నాథ్ సింగ్ అయోధ్య రామ మందిరం గురించి ప్రస్తావించగానే జై శ్రీరామ్ నినాదాలతో సభ నిమిషం పాటు మార్మోగిపోయింది. దాంతో రాజ్ నాథ్ చిరునవ్వుతో ఆ నినాదాలను ఆస్వాదించారు. అనంతరం ఆయన ప్రసంగం కొనసాగిస్తూ కొన్ని ప్రభుత్వాలు అధికారం కోసం రాజకీయాలు చేస్తాయని, మోడీ ప్రభుత్వం మాత్రం ప్రజల కోసం రాజకీయాలు చేస్తుందని వివరించారు. అయోధ్యలో రామ మందిరం నిర్మించి భారతీయుల కలను సాకారం చేశామని అన్నారు. దేశ ప్రజలు మోడీ వెన్నంటే ఉన్నారని స్పష్టం చేశారు. ఆర్థికంగా బలహీన దేశం అనే ముద్ర నుంచి భారత్ ను బయటికి తీసుకువచ్చి ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ను నిలిపిన ఘనత మోదీకే సొంతమని అన్నారు. మోడీ పాలనలో భారత్ 2027లో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.



***ఏపీలో కుటుంబ పార్టీలు ఎక్కువయ్యాయి : ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి***

ఎన్నికల కోసం సన్నాహంగా కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో శ్రీకారం చుట్టామని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి అన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల సన్నాహాల నేపథ్యంలో భారత్ రైజింగ్ అలైట్ మీట్ పేరుతో బీజేపీ సమావేశాలు నిర్వహిస్తోంది. జిల్లాలో జరిగిన సమావేశంలో పురందేశ్వరి మాట్లాడుతూ బీజేపీ రాజకీయ పార్టీ ఇతర రాజకీయ పార్టీల కన్నా భిన్నమన్నారు. అధికారాన్ని సేవ భావం కోసం వినియోగిస్తున్నామన్నారు. వికసిత్ భారత్ 2040 ఆవిష్కరించాలని చూస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కుటుంబ పార్టీలు ఎక్కువయ్యాయని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రైవేటు పరం చేయడం కన్నా దాన్ని ఏ విధంగా లాభాల్లో తీసుకురావాలో ప్రయత్నం చేస్తున్నామన్నారు. రైల్వే జోన్‌కు భూమి కేటాయించకుండా కేంద్ర అధినాయకత్వంపై నిందలు వెయ్యడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏపీని అగ్రగామిగా నిలబెట్టేందుకు బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ప్రజల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీని ఆశీర్వదిస్తే మంచి నిర్ణయాలు వస్తాయన్నారు. ఆంధ్రాలో ఒకసారి కేంద్రంలో మరోసారి అనేది బీజేపీ నినాదమని పురందేశ్వరి పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ఏపీ టెట్ పరీక్షల నిర్వహణ



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష - 2024 మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయని, అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. మొదటిరోజు పేపర్ 1 (ఎ) పరీక్షకు ఉదయం సెషన్ లో 17,136 మందికి 14,801 (86.37 శాతం) మంది, మధ్యాహ్నం సెషన్ లో 17,253 మందికి 15,104 (87.54 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు బయో మెట్రిక్ హాజరు తప్పని సరి చేయడం వల్ల తొలి రోజు రాష్ట్రవ్యాప్తంగా 40 మంది అభ్యర్థులకు మాత్రమే ముఖ హాజరు (ఫేషియల్ అటెండెన్స్) తీసుకోవడంలో సాంకేతిక సమస్యలు ఎదురైనట్లు గుర్తించామన్నారు. ఏ అభ్యర్థికి నష్టం కలగకుండా వెంటనే సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఆ అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. హాల్ టికెట్లో వివరాలు తప్పయితే సవరించుకోవచ్చు. టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల పేరు, వివరాలు హాల్ టికెట్ లో పూర్తిగా తప్పుగా ఉన్నట్లయితే వారికి పరీక్ష రాయడానికి అనుమతి లేదు. అయినప్పటికీ అభ్యర్థికి సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాధికారి క్షుణ్ణంగా పరిశీలించి సదరు అభ్యర్థన సరైనదని భావిస్తే పూర్తి సవరణల వివరాలను రాష్ట్ర స్థాయిలోని కమాండ్ కంట్రోల్ రూం వారికి తెలియచేయాలి. అలాంటి అభ్యర్థులకు తర్వాతి సెషన్లో పరీక్ష రాసేలా బఫర్ హాల్ టికెట్ ఇవ్వనున్నట్లు కమీషనర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు.

# ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు

● గిరిజన సోదర,సోదరీమణులకు వైద్యం అందించడం ఆనందంగా ఉంది ● త్వరలో 7 ప్రాంతాల్లో ఎన్టీఆర్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు ● సాలూరు టౌన్‌లో హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవంలో నారా భువనేశ్వరి




సాలూరు, సూర్య బ్యూరో ప్రతినిధి : గిరిజన సోదర, సోదరీమణులకు వైద్య సేవలు అందించడం చాలా ఆనందంగా ఉందని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. ఉత్తరాంధ్రలో నిజం గెలవాలి పర్యటనకు వెళుతూ మార్గం మధ్యలో సాలూరు పట్టణంలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ ను భువనేశ్వరి మంగళవారం ప్రారంభించారు. అనంతరం క్లినిక్ లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. క్లినిక్ లో ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలను భువనమ్మ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్లినిక్ మొత్తం పరిశీలించి ఏర్పాట్లపై సంతోషం వ్యక్తి చేశారు. సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికి వైద్యసేవలను అందించాలని క్లినిక్ సిబ్బందికి సూచించారు. అనంతరం భువనేశ్వరి విలేకరులతో మాట్లాడుతూ నా గిరిజన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు ఉన్న ఈ సాలూరు ప్రాంతంలో సంజీవనీ క్లీనిక్ ప్రారంభించడం సంతోషంగా ఉంది.ఏజెన్సీ ప్రాంతా ల్లో నేటికీ వైద్యం అందక గిరిజనులు పడుతున్న ఇబ్బందులను మనం చూస్తున్నాం. సాలూరు ప్రజలకు వైద్య సేవలను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతోనే ఈ క్లినిక్ ను ప్రారంభించడానికి కారణం. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా 27ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉచిత విద్య, వైద్యం తెలుగు ప్రజలకు అందిస్తూ సేవలు అందిస్తున్నాం. ఎన్టీఆర్ ట్రస్టు నుండి 3 బ్లడ్ బ్యాంక్ కేంద్రాలు నిర్వహిస్తున్నాం. వీటి నుండి ఇప్పటి వరకు 8లక్షల మంది ప్రజలకు రక్తాన్ని ఇచ్చి కాపాడాం. 81,361 యూనిట్ల రక్తాన్ని నిరుపేదలకు ఉచితంగా అందించాం. 19,956 యూనిట్ల రక్తాన్ని తలాసేమియా బాధితులకు ఉచితంగా అందించాం. 57,652 యూనిట్లు రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు ఉచితంగా అందించాం. సంజీవని క్లినిక్స్ ద్వారా 67,104 కుటుంబాలు లబ్ధి పొందాయి. ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం ద్వారా 33,681 కుటుంబాలు నేటికి వైద్యసేవలు పొం దాయి. పాకాల, పాల కొండ, పోలవరం, కురు పాం, పాడేరు, రంపచో డవరం, అరకు ప్రాంతాల్లో ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఎన్టీఆర్ ట్రస్టు నుండి వికలాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్లు, కృత్రిమ కాళ్లు అందించాం. తిరుపతి, నెల్లూరు, కడపలో వరదలు వచ్చిన సమయంలో ఇళ్లు కూలిపోయిన 175 మంది బాధితులకు ఇంటి మరమ్మతులు కోసం ఒక్కో ఇంటికి రూ.5వేలు ఆర్థికసాయం అందించాం. వరద సమయంలో మృతిచెందిన 48మంది బాధిత కుటుంబాలలో ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థికసాయం అందించాం. కేరళలో వరదలు వచ్చిన సమయంలో రూ.10లక్షలు విలువైన నోట్ బుక్స్, రూ.20లక్షలు విలువైన మెడిసిన్స్ అందించాం. కరోనా కష్టసమయంలో రూ.1.5కోట్ల రూపాయలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో 3 ఆక్సిజన్ ప్లాంట్లు నెలకొల్పాం. రూ.2.75లక్షల విలువైన మాస్కులు అందించాం.

## రెండో సారి విజయంతో ఏపీలో కొత్త అధ్యాయానికి శ్రీకారం



గుంటూరు, సూర్య ప్రత్యేక ప్రతినిధి : రెండు వారాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 14వ సంవత్సరంలోకి అడుగుబెట్టబోతున్న వేళ ఏ.పిలో సాధారణ ఎన్నికల్లో రెండో వరుస విజయంతో త్వరలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టనుందని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2011 మార్చి 12న పురుడుపోసుకున్న యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీకి 2024 అత్యంత కీలక సంవత్సరంగా చరిత్రలో నిలవబోతోందన్నారు. 2019 మే ఆఖరులో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ గడచిన దాదాపు ఐదేళ్లలో మునుపెన్నడూ కనీవినీ ఎరగని సంక్షేమ రాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించి, దాన్ని బలోపేతం చేస్తోందన్నారు. ఏప్రిల్‌మే మాసాల్లో 18వ లోక్ సభతోపాటు జరిగే ఏపీ 16వ శాసనసభ ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం సాధించి తెలుగునాట రాజన్న రాజ్యంలో పేదలు, బలహీనవర్గాలకు ఎలాంటి సాధికారత లభిస్తుందో దేశ ప్రజలకు చూపించడానికి సిద్ధమౌతోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో గత పుష్కరకాలంగా తెలుగు ప్రజల్లో చైతన్యం నింపుతూ, ప్రగతికి కొత్త నిర్వచనం చెబుతోంది వైఎస్సార్ కాంగ్రెస్. ఈ యువ రాజకీయపక్షం తాను పుట్టిన ఏడాదికే అంటే 2012 వేసవిలో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో 90 శాతానికి పైగా సీట్లు కైవసం చేసుకోవడం తెలుగు రాష్ట్రం చరిత్రలో నూతనాధ్యాయానికి తెరలేపిందన్నారు.

## గుండె నిండా విజయపు 'జెండా'



తాడేపల్లిగూడెం, సూర్య బ్యూరో ప్రతినిధి : జనసేన – తెలుగుదేశం ఉమ్మడి సభ తెలుగు జన విజయకేతనం జెండా సభ ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. తాడేపల్లిగూడెం సమీపంలోని పత్తిపాడు వద్ద సభకు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 6 లక్షల మంది సభకు తరలి వచ్చే అవకాశం ఉండడంతో, అందుకు తగినట్లుగా ఏర్పాట్లను పూర్తి చేశారు. జనసేన పార్టీ పూర్తి బాధ్యతను తీసుకొని ఈ సభను నిర్వహిస్తోంది. 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలకు ఉమ్మడిగా సమాయత్తం చేసే సభగా ఇది నిలిచిపోనుంది. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఈ సభకు హాజరు కానున్న నేపథ్యంలో ఇరు పార్టీల నుంచి కార్యకర్తలు, మహిళలు కూడా పెద్ద ఎత్తున సభకు తరలి రానున్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని పూర్తికాగా తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా ఏర్పాట్లకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ప్రత్యేకంగా చూస్తున్నారు. దీని కోసం ఇరుపార్టీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఇప్పటికే కమిటీలను నియమించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సభ మొదలుకానుంది. సభా వేదికపై ఇరు పార్టీల నుంచి 500 మంది నేతలు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉండడంతో దానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఇరు పార్టీలకు సంబంధించిన నియోజకవర్గస్థాయి నాయకులు రవాణా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బస్సులు అలాగే కార్లు జీపులు ఇతర రవాణా మార్గాల ద్వారా తాడేపల్లిగూడెం చేరుకునేందుకు ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. సభా ప్రాంగణంలో విస్తృతంగా మంచినీరు ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. భారీగా జన సందోహం వచ్చే అవకాశం ఉండడంతో పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని ఇప్పటికే ఎంపిక చేశారు. ప్రత్యేక వాలంటీర్ల బృందాన్ని సిద్ధం చేశారు. రెండు పార్టీల నుంచి ఈ వాలంటీర్ల బృందం సభ ప్రాంగణంలో సేవలందిస్తారు. సభా ప్రాంగణంలోని వారందరికీ వేదిక స్పష్టంగా కనిపించేలా మాట్లాడే వ్యక్తులు కూడా సులభంగా గుర్తించేలా సభా వేదికను ఏ మూల నుంచైనా చక్కగా చూసేలా ఏర్పాట్లు చేశారు. సభ పూర్తయ్యే సమయానికి రాత్రి వేళ అయ్యే అవకాశం ఉండడంతో ప్రాంగణం అంతా విద్యుత్ దీప కాంతులతో నింపారు. ప్రత్యేకమైన జోన్లుగా విభజించి ఇప్పటికే పాసులు పంపిణీ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టీవీల్లో ఉండేవారికి కూడా ప్రత్యక్ష ప్రసారం ద్వారా సభ మొత్తం వీక్షించే ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి.

## వైసీపీ నేతలు ఇంకెంత దిగజారిపోతారో ఊహించలేం



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) తీరుతో క్రికెటర్ హనుమ విహారి మనస్తాపంపై ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల స్పందించారు. ఇంతకంటే సిగ్గుచేటు విషయం ఇంకేమన్నా ఉంటుందా అని ఆమె మండిపడ్డారు. అన్నింటిలో నీచ రాజకీయాలు చేస్తున్న వైసీపీ వాళ్లు, ఇప్పుడు క్రీడలపైనా కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర గౌరవాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిన ఈ నేతలు ఇంకా ఎంత దిగజారిపోతారో ఊహించలేమన్నారు. ఆడుదాం ఆంధ్రా అంటూ రెండు నెలలు సినిమా స్టంట్స్ చేయించిన వైసీపీ నేతలు, అసలు ఆడుతున్న ఆటలు ఇవేనా? ఆటగాళ్ల భవితను, ఆత్మవిశ్వాసాన్ని ఇలా నాశనం చేస్తారా? ఇది ఆంధ్రా క్రికెట్ అసోసియేషనా. అధ్వానపు క్రికెట్ అసోసియేషనా? ఈ విషయంపై వెంటనే విచారణ జరగాలని షర్మిల డిమాండ్ చేశారు.

## పార్టీకి సోషల్ మీడియా వెన్నుముక లాంటిది



నరసరావుపేట, సూర్య ప్రధాన ప్రతినిధి : నరసరావుపేట పట్టణంలో పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వైఎస్ఆర్సీపీ నరసరావుపేట పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ పి అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నలుమూలల నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ పార్టీకి సోషల్ మీడియా వెన్నుముక లాంటిది సోషల్ మీడియా ప్రభావం ఈ మధ్యకాలంలో బాగా పెరిగిందని, మీ అందరి కృషితో పల్నాడు జిల్లాలో 7 కి 7 స్థానాలు, పార్లమెంటు స్థానం కూడా గెలిపించుకోవాలన్నారు.



## మోడీతోనే దేశానికి రక్షణ : ఈటల రాజేందర్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: భారత ప్రధాని నరేంద్ర మోడీ తోనే భారతదేశానికి రక్షణ అని బిజెపి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ అన్నారు.విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం మెదక్‌లో ఈటల రాజేందర్ పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ సక్రమంగా అమలు చేయాలి అని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న. అనుకోకుండా వచ్చేది వైద్య ఖర్చు. నరేంద్ర మోడీ తీసుకువచ్చిన 10 లక్షల రూపాయల వరకు అందే ఆయ్మాన్ భారత్ ను వినియోగించుకోండనీ ఉండ బద్దలు కొట్టారు..కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చెయ్యకపోతే కేసీఆర్ కి ఏ గతి పట్టిందో రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుందనీ, బెల్ట్ షాపులు బంద్ చేస్తా అని హామీఇచ్చారు. కానీ ఇంకా ఒక్క షాపు కూడా బంద్ కాలేదు. కెసిఆర్ వందమందికి ఒక బెల్ట్ షాపు పెట్టారు. తాగుడికి బానిసను చేశాడు. రేవంత్ ఒక్క ఆదేశం ఇస్తే బెల్ట్ షాపు బంద్ అవుతుంది. చేస్తావా లేదా అని హెచ్చరిస్తున్నానన్నారు.10,700 కోట్ల నుండి 45 వేల కోట్లకు మద్యం ఆదాయం పెంచినవాడు కెసిఆర్. మనడబ్బు మనకే ఇస్తున్నారు. నంబర్ వన్ అనుకున్న కెసిఆర్ ప్రభుత్వం మట్లో కలిసింది. లక్ష రుణమాఫీ చేస్తా అని ఆయన ఇచ్చిన డబ్బులు వడ్డీల కే సరిపోయింది. రేవంత్ రెడ్డి మీకు 34 వేల కోట్ల రూపాయల రుణమాఫీ ఒకే సారి చేసే దమ్ము ఉందా ? దమ్ముంటే చర్చకు రావాలని డిమాండ్ చేస్తున్నానన్నారు.రకరకాల డిక్లరేషన్ ఇచ్చావు. గ్యాస్ 500 కే ఇస్తా అన్నారు. కానీ ఇప్పుడు మొత్తం కడితే మళ్లీ మనకు రిటర్న్ ఇస్తారట. ఇది ఆమోదయోగ్యం కాదు. ప్రజల ను గోల్ మాల్ చేద్దామని చూస్తున్నారేమో వారు కారు, మిమ్మల్ని చేస్తారు. నరేంద్ర మోడి ప్రధాని అయ్యాక కాశ్మీర్ లో బుల్లెట్ గాయాలతో ఆసుపత్రికి వచ్చే జవాన్ల సంఖ్య తగ్గింది. టెర్రరిస్ట్ లు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదన్నారు. బిజెపి వస్తె మతకల్లోలాలు అన్నారు.

# మా పాలన జనాభీష్టం

● ఇందిరమ్మ కమిటీలతో ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు ● సోనియమ్మ హామీలు అమలు చేస్తున్నాం
● చీకట్లో కలిసి, పొద్దునే కొట్లాడుకున్నట్లు మోడీ కేడీ నాటకాలు ● జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
● పార్లమెంట్ ఎన్నికల్లో ఒక సీటైనా గెలవాలని కేటీఆర్‌కు సవాల్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: ప్రతి గ్రామంలో వివిధ సామాజికవర్గాలకు చెందిన అయిదుగురితో కలిపి ఇందిరమ్మ కమిటీలు వేస్తామని, ఇళ్లు, పింఛన్లు, సిలెండర్లు, ఏ పథకమైనా ఆ కమిటీల ద్వారానే పేదలకు చేర్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గెలిచిన తర్వాత నాయకులు కార్యకర్తలను మర్చిపోతారనే ప్రచారం ఉందని.. తాము అలా కాదని పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలను వార్డు సభ్యులుగా, సర్పంచులుగా, ఎమ్పీటీసీ సభ్యులుగా, ఎంపీపీలుగా, జడ్పీటీసీ సభ్యులగా, జడ్పీ అధ్యక్షులుగా గెలిపించుకునే వరకు అండగా నిలబడతామని ఆయన హామీ ఇచ్చారు. సచివాలయంలో రూ.500కె సిలిండర్ సరఫరా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గ్యారంటీల అమలును మంగళవారం ప్రారంభించిన అనంతరం చేవెళ్లకు ముఖ్యమంత్రి వెళ్లారు. చేవెళ్లలో ఏర్పాటు చేసిన జనజాతర సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 75 రోజులుగా 18 గంటలు పని చేస్తున్నానని, ఒక్క రోజు సెలవు తీసుకోలేదని, సాధ్యమైనంత మేర కార్యకర్తలను కలిశానని ముఖ్యమంత్రి తెలిపారు. వివిధ సమీక్షలు, ఇతర కారణాలతో అందరిని కలవలేకపోవచ్చునని, త్వరలోనే నియోజకవర్గాలు, జిల్లాలు తిరిగి కార్యకర్తలతో కూర్చొంటానని, వారి ఆలోచనలు తీసుకొని రాష్ట్ర అభివృఎద్ధికి వాటిని వినియోగిస్తామన్నారు. గత ప్రభుత్వంలో అణిచివేత, కేసులు ఎదుర్కొన కార్యకర్తలు లేరంటే అతిశయోక్తి కాదన్నారు. గత పదేళ్లో నాటి కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా ఆస్తులు ఆక్రమించుకున్నా, అక్రమ కేసులు పెట్టినా నిటారుగా నిలబడి కొట్లాడి కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి, కార్యకర్తలు తమ రక్తాన్ని చెమటగా మార్చి కష్టపడ్డారని, వారిని గుండెల్లో పెట్టకొని చూసుకుంటానన్నారు. కార్యకర్తలకు తోడుగా ఉంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కార్యకర్తల త్యాగాన్ని మరువమని, పదేళ్లు కాంగ్రెస్ జెండాను భుజాలు కాయలు కాసేలా మోసిన వారి రుణం తీర్చుకునే సమయం వచ్చిందన్నారు. సచివాలయంలో రూ.500కె సిలిండర్ సరఫరా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గ్యారంటీల అమలును మంగళవారం ప్రారంభించిన అనంతరం చేవెళ్లకు ముఖ్యమంత్రి వెళ్లారు. చేవెళ్లలో ఏర్పాటు చేసిన జనజాతర సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలకు ముందు తుక్కుగూడ సభలో సెప్టెంబరు 17న సోనియా గాంధీ తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలను ఇచ్చారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నాడు పది లక్షల మంది సాక్షిగా నాలుగు కోట్ల ప్రజలకు సోనియా హామీ ఇచ్చిందన్నారు. 2004 లో తెలంగాణ ఇస్తానని కరీంనగర్లో మాట ఇచ్చిన సోనియా గాంధీ ఎన్ని కష్టాలు, ఎన్ని నష్టాలు వచ్చినా, ఆంధ్రప్రదేశ్లో పార్టీ నష్టపోయినా తెలంగాణ ఇచ్చిందన్నారు. అలానే తుక్కుగూడ సభలో సోనియమ్మ ఇచ్చిన మాటపై విశ్వాసంతో రాష్ట్రంలో ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తెచ్చారని ముఖ్యమంత్రి అన్నారు. సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డిసెంబరు 7న అధికారం చేపట్టిన తాము 48 గంటల్లోనే ఆడ బిడ్డలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.పది క్షలకు పెంచామని గుర్తు చేశారు. మేడారం జాతరకు మహిళలు ఉచితంగా బస్సుల్లో వెళ్లారని ముఖ్యమంత్రి అన్నారు.

**అల్లాటప్పగాళ్లం కాదు.. :** ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి పేరు చెబితే మూడు సీట్లు రాకపోతుండే అని కేటీఆర్ అంటున్నాడని, తాను ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షునిగా ఉన్నానని, కేటీఆర్కు చేతనయితే తెలంగాణలో ఒక్క ఎంపీ సీటు గెలిచి చూపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. తాము అల్లాటప్పగాళ్లం కాదని, అయ్య పేరు చెప్పుకొని కుర్చీలో కూర్చొలేదని, కింద నుంచి కార్యకర్తగా కష్టపడి జెండాలు మోసి లాఠీ దెబ్బలుతిని, అక్రమ కేసులు ఎదుర్కొని చర్లపల్లి, చంచల్గూడ జైళ్లలో మగ్గి, భయపడకుండా, లొంగిపోకుండా నిటారుగా నిలబడి కేటీఆర్ను, ఆయన అయ్యను, ఆయన బావను బొందపెట్టి ఆ కుర్చీలో కూర్చున్నామని అన్నారు. ముఖ్యమంత్రి కుర్చీ తనకు ఈనాం కింద రాలేదని, అయ్య పేరుతో రాలేదన్నారు. నల్లమల అడవి నుంచి తొక్కుక్కుంటూ తొక్కుకుంటూ వచ్చి కేటీఆర్ వంటి వాడి నెత్తి మీద కాలు పెట్టి తొక్కి ఆ కుర్చీలో తనను కార్యకర్తలు కూర్చొబెట్టారని, ఈ రోజు ముఖ్యమంత్రి కుర్చీలో ఉన్నానంటే అది కాంగ్రెస్ కార్యకర్తల త్యాగం, వారి పోరాట ఫలితమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అండగా నిలిచినంత కాలం, తనను భుజానమోసినంత కాలం కేటీఆర్, ఆయన తండ్రి వచ్చినా ఈ కుర్చీని తాకలేరని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సోషల్ మీడియా ఉంటే గెలిచేవాళ్లమని కేటీఆర్ అంటున్నారని, ఉన్న టీవీలన్నీ ఆయన చుట్టపోళ్లవేనని, తన తండ్రి చూపించడానికి తనకేమైనా టీవీ ఇచ్చాడా..? రాసుకోవడానికి పేపర్, సొల్లు వాగుడు వాగడానికి మైకులు ఇచ్చాడా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. తమ కార్యకర్తలు కష్టపడితే నిలబడి కొట్లాడితే తమకు అధికారం వచ్చిందని, కేటీఆర్ చేసే తప్పులను తమ కార్యకర్తలు యూట్యూబ్లో పెట్టారన్నారు. తమకు ఆ ట్యూబ్, ఈ ట్యూబ్ ఏది అక్కరలేదని, కేటీఆర్ ట్యూబ్లైట్ పగలగొట్టే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. దివాళా చెడిన కేటీఆర్ యూట్యూబ్ ఛానల్ పెట్టుకుంటా అంటున్నాడని, కృాఎష్ణానగర్లో ఏదైనా బ్రోకర్ దందా పెట్టుకుంటే అదీ ఇదీ కలిస్తే ఆయన దందా బాగా నడిస్తుందన్నారు. వాళ్ల కుటుంబం దోచుకుంటే తెలంగాణ ప్రజలు చెప్పుతో కొట్టారనే సంగతి కేటీఆర్కు గుర్తురావడం లేదని, చెరుకు తోటలు, పల్లీ చేలపై అడవిపందులు పడకుండా రైతులు కరెంటు తీగలు పెట్టి కాపాడుకున్నట్లు, తెలంగాణను అడవి పందుల్లా తెగమెక్కుతుంటే తెలంగాణ ప్రజలు కరెంటు తీగలు పెట్టి వారిని బలి ఇచ్చి కాంగ్రెస్ను అధికారంలోకి తెచ్చారని ముఖ్యమంత్రి అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 14 సీట్లు గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**ఏనాడైనా ఉద్యోగాలపై ఆలోచించారా..? :** తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నియామకాలు, నిధులు వస్తాయని కేసీఆర్ ప్రచారం చేశారని, కానీ నీళ్ల పేరుతో నిధుల దోపిడి జరిగిందని, కొడుకు, అల్లుడు, బిడ్డకు ఉద్యోగాలు వచ్చాయి...సడ్డకుని కొడుకుకు రాజ్యసభ సభ్యత్వం వచ్చిందే తప్ప లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తాము ఇచ్చిన మాట ప్రకారం.. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోపే 25 వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని, అది చూసి ఓర్వలేని కేసీఆర్, కేటీఆర్, హరీశ్రావు, కవిత రావు, సంతోష్రావు, దయాకర్రావు, వినోద్రావు అంతా కుట్రలు చేసి కాంగ్రెస్ పార్టీకి శాపనార్థాలు పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదోళ్ల బిడ్డలకు తాము వేలాది ఉద్యోగాలు ఇస్తే వారి కడుపు మండుతుందా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఆయన పిల్లలకు ఉద్యోగాలు లేకుంటే కేసీఆర్కు దుఃఖం వచ్చి కొలువులు ఇచ్చాడని, మరి పేదోళ్ల పిల్లలు ఉద్యోగాలు లేక పెళ్లిళ్లు కాక చెట్లకు ఉరేసుకొని చచ్చిపోతుంటే ఆయనకు పట్టలేదని, ఆయన మనిషా, మానవ రూపంలో ఉన్న మృాఎగమా? ఆ పేదోళ్ల బిడ్డల గురించి ఆలోచించావా అని కేసీఆర్పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికే
## రూ.500కు గ్యాస్ సిలిండర్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెల్లకార్డు ఉన్నవారికే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో గృాఎహజ్యోతి, మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. సగటున ఎవరు ఎన్ని వాడారో చూసుకొని దాని ప్రకారం సిలిండర్లు అందిస్తామన్నారు. దాదావు 40 లక్షల కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతాయన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి గ్యాస్ సిలిండర్ ఇస్తామని, లబ్ధిదారుల జాబితాలో లేని పేర్లను చేర్చుతామని హామీ ఇచ్చారు.కొన్నేళ్లుగా దేశంలో గ్యాస్ సిలిండర్ ధర బాగా పెరిగిందన్నారు. మహిళలకు ఊరట కల్పించాలనే ఉద్దేశ్యంతో రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ మహిళలకు ఊరటనిస్తుందన్నారు. ఈ పథకంలో లోపాలు గుర్తించి మార్పులు చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు. పేదలకు ఎక్కువ ఉపయోగం కలిగేలా అభయ హస్తం గ్యారంటీలు ప్రకటించినట్లు వునరుద్ఘాటించారు.

**ఇందు ప్రాజెక్ట్స్ లిమిటెడ్**
(కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో ఉంది)
**CIN: U45200TG2001PLC038175**

M/s ఇందు ప్రాజెక్ట్స్ లిమిటెడ్, బి సుబ్బా రెడ్డి కన్సార్షియం సమర్పించిన రిజల్యూషన్ ప్లాన్‌ను ఆమోదిస్తూ 05.07.2023 నాటి విచారణలో గౌరవనీయమైన NCLT, హైదరాబాద్ బెంచ్ ఆర్డర్ ప్రకారం కార్పొరేట్ రుణగ్రహీత యొక్క అన్ని వాటాదారులకు నోటీసు ఇవ్వబడింది మరియు సి వెంకటేశ్వర రెడ్డి, కార్పొరేట్ రుణగ్రహీత కోసం మానిటరింగ్ కమిటీ ఆమోదించబడిన రిజల్యూషన్ ప్లాన్ ప్రకారం రిజల్యూషన్ ఫండ్‌ను పంపిణీ చేస్తుంది.
పైన పేర్కొన్న అంశాల దృష్ట్యా, అండర్ సైన్ ద్వారా అంగీకరించబడిన కార్పొరేట్ రుణగ్రహీత యొక్క వాటాదారులందరూ తమ "బ్యాంక్ వివరాలను" KYCతో పాటు అందించవలసిందిగా అభ్యర్థించబడ్డారు మరియు అధీకృత సంతకందారుని సంప్రదింపు వివరాలను ఇందు ప్రాజెక్ట్ లిమిటెడ్ రిజిస్టర్డ్ కార్యాలయానికి, కార్పొరేట్ రుణగ్రహీత లేదా ip.induprojects@gmail.comకి ఇమెయిల్ పంపండి, తద్వారా 17.04.2024లోపు ప్రాధాన్యతపై నిధులను పంపడానికి అండర్‌సైన్‌ని అనుమతిస్తుంది.

సం/
అనూప్ కుమార్ సింగ్
ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ మరియు మోనిటరింగ్ కమిటీ సభ్యుడు
ఇందు ప్రాజెక్ట్స్ లిమిటెడ్
స్థలం : కోల్‌కతా
తేది : 28.02.2024
IBBI Reg. No.: IBBI/IPA-001/IP-P00153/2017-18/10322

**AN INVESTOR EDUCATION AND AWARENESS INITIATIVE**
Do join us to learn more about Mutual Funds.
**Date and Venue:**
Saturday, 2nd March 2024; 4:45 pm. onwards.
at Prasads Multiplex, IMAX Road, NTR Marg, Behind of Khairtabad, Hyderabad - 500 063, Telangana.
For registration, please contact: Shubhadeep Kanjilal, Mobile: 92305 30003.
Registration is compulsory.
The registration time will be from 9:30 am to 4:00 pm.
No walk-ins will be allowed.
Azadi Ka Amrit Mahotsav | HDFC MUTUAL FUND BHAROSA APNO KA
**An Investor Education and Awareness Initiative**
Visit https://www.hdfcfund.com/information/key-know-how to know more about the process to complete a one-time Know Your Customer (KYC) requirement to invest in Mutual Funds. Investors should only deal with registered Mutual Funds, details of which can be verified on the SEBI website (www.sebi.gov.in/intermediaries.html). For any queries, complaints & grievance redressal, investors may reach out to the AMCs and / or Investor Relations Officers. Additionally, investors may also lodge complaints directly with the AMCs, if they are unsatisfied with the resolutions given by AMCs they may raise complaint through the SCORES portal on https://scores.gov.in. SCORES portal facilitates investors to lodge complaint online with SEBI and subsequently view its status. In case the investor is not satisfied with the resolution of the complaints raised directly with the AMCs or through the SCORES portal, they may file any complaint on the Smart ODR on https://smartodr.in/login.
**Mutual Fund investments are subject to market risks, read all scheme related documents carefully.**

**AN INVESTOR EDUCATION AND AWARENESS INITIATIVE**
Do join us to learn more about Mutual Funds.
**Date and Venue:**
Sunday, 3rd March 2024; 10:00 am. onwards.
at Hotel Sree Aaraadya, Above APGVB Bank, Beside Police Station, Balaji Nagar, Jadcherla, Mahabubnagar (Dist) - 509 301, Telangana.
For registration, please contact: Chandra Sekhar AV, Mobile: 98499 96819.
Registration is compulsory.
The registration time will be from 9:30 am to 5:00 pm.
No walk-ins will be allowed.
Azadi Ka Amrit Mahotsav | HDFC MUTUAL FUND BHAROSA APNO KA
**An Investor Education and Awareness Initiative**
Visit https://www.hdfcfund.com/information/key-know-how to know more about the process to complete a one-time Know Your Customer (KYC) requirement to invest in Mutual Funds. Investors should only deal with registered Mutual Funds, details of which can be verified on the SEBI website (www.sebi.gov.in/intermediaries.html). For any queries, complaints & grievance redressal, investors may reach out to the AMCs and / or Investor Relations Officers. Additionally, investors may also lodge complaints directly with the AMCs, if they are unsatisfied with the resolutions given by AMCs they may raise complaint through the SCORES portal on https://scores.gov.in. SCORES portal facilitates investors to lodge complaint online with SEBI and subsequently view its status. In case the investor is not satisfied with the resolution of the complaints raised directly with the AMCs or through the SCORES portal, they may file any complaint on the Smart ODR on https://smartodr.in/login.
**Mutual Fund investments are subject to market risks, read all scheme related documents carefully.**

# ఉపాధి రంగానికి భూతం

● పెట్టుబడుల స్వర్గధామం తెలంగాణ రాష్ట్రం ● 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ రెండవ దశ
● వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు ● రూ. లక్ష కోట్లతో 5 లక్షల మందికి ఉద్యోగాలు ● వైరస్ భయాలన్నింటికీ హైదరాబాద్ ప్రపంచానికి ఆశాదీపం
● బయో ఏసియా సదస్సు 2024లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: ఉపాధి రంగాన్ని తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రం కూడా తెలంగాణ అని స్పష్టం చేశారు .

త్వరలోనే హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రెండవ ఫేజ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. హైటెక్స్ లో హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ బయో ఏషియా 2024 సదస్సును మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ ఏడాది జీనోమ్ వ్యాలీ ఎక్సెలెన్స్ 2024 అవార్డుకు ఎంపికైన నోబెల్ బహుమతి గ్రహిత ప్రొఫెసర్ గ్రెగ్ ఎల్.సెమెంజాను సీఎం అభినందించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సెమెంజాకు అవార్డును అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూడు వందల ఎకరాల్లో రూ.2000 కోట్ల పెట్టుబడులతో జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తామని,లక్ష కోట్ల పెట్టుబడులతో పది ఫార్మా విలేజీలను ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైందన్నారు. దీంతో మౌలిక సదుపాయాలతో పాటు ఔత్సహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. 5 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయని , వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్ లను ఏర్పాటు చేస్తామని ,హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఒక గంట ప్రయాణ దూరంలోని అత్యంత సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఎంతో సదుపాయంగా ఉంటుందని అన్నారు. కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలున్న పరిస్థితుల్లో హైదరాబాద్ వేదికగా జరుగుతోన్న బయోఏషియా సదస్సు కీలకంగా మారిందని ముఖ్యమంత్రి అన్నారు. బయోసైన్స్ రాజధానిగా హైదరాబాద్ నేడు యావత్ మానవాళికి ఒక భరోసాగా నిలిచిందని అన్నారు. వైరస్ భయాలను ధీటుగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని హైదరాబాద్ కలిగించిందని, ఇప్పుడు ప్రపంచంలో వినియోగించే ప్రతి మూడు వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్ లోనే ఉత్పత్తి అవుతోందని గుర్తు చేశారు.

ఆరోగ్య భద్రత విషయంలో ప్రపంచంలోని అందరి సమస్యలు ఒకేలా ఉన్నాయని కోవిడ్ నిరూపించిందని, అయితే సమస్యల పరిష్కారాలను కూడా మనం కలిసికట్టుగానే సాధించాలని సీఎం సూచించారు. ఒక్క బయో సైన్సెస్ లోనే కాదు, ఐటీ–సాఫ్ట్ వేర్, రీసెర్చ్, స్టార్టప్ రంగాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ ను మరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృాఎతనిశ్చయంతో ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

అంతర్జాతీయ, దేశీయ సంస్థలు ఇక్కడ ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన అనుకూల వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. చిన్న స్టార్టప్ లు, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వారధిగా నిలిచే ఎంఎస్ఎంఈ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.

మీరు నింగిలోని తారల వద్దకు చేరాలని కలలు కంటే.. మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లే రాకెట్ లా మా ప్రభుత్వం పనిచేస్తుంది అని సీఎం వ్యాఖ్యానించారు. ఇటీవల దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు భారీ స్థాయిలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. ఏటా 5కోట్ల డోసుల వ్యాక్సిన్ల ఉత్పత్తే లక్ష్యంగా ప్రఖ్యాత టకేడా సంస్థ ఇక్కడి బయోలాజికల్–ఈ సంస్థతో కలిసి హైదరాబాద్ లో తయారీ కేంద్రం నెలకొల్పడాన్ని స్వాగతించారు.

వైరస్‌ల వల్ల ప్రపంచంలో నెలకొన్న భయాలకు హైదరాబాద్ నుంచి నమ్మకాన్ని కల్పిస్తున్నామని సీఎం అన్నారు. జర్మనీకి చెంది న మిల్టేనీ సంస్థ తన రీసెర్చ్ సెంటర్ ను హైదరాబాద్ లో ఏర్పాటు చేసిందని చెప్పారు. మానవాళికి మంచి చేసే చర్చలు, ముందడుగుతో హైదరాబాద్ బయో ఏషియా సదస్సు విజయవంతం కావాలని సీఎం ఆకాంక్షించారు.

**తెలంగాణ ప్రభుత్వం**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**
**నిట్ సంక్షిప్త టెండరు ప్రకటన నెం. EE/R&B/MDCL/28/2023-24/** **తేదీ: 27-02-2024**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వార్షిక నిర్వహణ పనుల కోసం రెండు (02) ఈ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ కింద మొత్తం అంచనా వ్యయం రూ.4.41 లక్షల కోసం దిగువ సంతకందారుచే అత్యవసర ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. బిడ్ అప్‌లోడ్ ప్రారంభ తేదీ: 27.02.2024 @ మ॥ 03.30 గం॥ల నుండి ముగింపు తేదీ: 01.03.2024 మ॥ 03.30 గం॥లకు. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా
DIPR.RO.No.2831-DP/CL/Advt/1/2023-24, Dt : 27-02 -2024

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC
**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం, కాప్రా సర్కిల్ - 1, GHMC**
**'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**
**నిట్ నెం.GHMC/KC/E/1/35/2023-24,** **తేది: 27-02-2024**
**పని పేరు:** Ecil x రోడ్స్, A.S.రావు నగర్, కాప్రా సర్కిల్, G.H.M.C వార్డ్ నం:02లోని అదనపు క్యాచ్‌పిట్‌ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న క్యాచ్‌పిట్‌ల రీమోడలింగ్ మరియు లేయింగ్ లేదా 300mm RCC పైప్‌లైన్ నీటి స్తబ్దతను తొలగించడం. **అంచనా వ్యయం (రూ. లక్షలలో) : 2.50 లక్షలు.** **ప్రారంభ తేదీ:** 28-02-2024 ఉ॥ 11.00 గం॥లకు. **డౌన్‌లోడ్ ముగింపు తేదీ:** 02-03-2024ఉ॥ 11.00 గం॥లకు.. **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం: 02-03-2024** ఉ॥ 11.00 గం॥లకు.ప్రైస్ **బిడ్ తెరచు తేది: 02-03-2024** ఉ॥ 11.00 గం॥లకు.తదుపరి వివరములను www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్ 1, GHMC
DIPR.RO.No.11006-PP/CL/Advt/1/2023-24 , Dt : 27-02-2024

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC
చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్, కూకట్‌పల్లి జోన్
**నిట్ నెం.6/GHMC/KPZ/CTO/2023-24,** **తేది: 27-02-2024**
పని పేరు: కూకట్‌పల్లి జోన్, GHMCలో వీల్డ్ ఇంజెక్షన్ వేస్ట్ డస్ట్‌బిన్ (నీల్‌కమల్ మేక్) సరఫరా మరియు డెలివరీ. **అంచనా వ్యయం (రూ. లక్షలలో) : 47.00 (లక్షలు). బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది మరియు సమయం** : 28-02-2024 మ॥ 2.30 గం॥లకు. **బిడ్స్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం:** 02-03-2024 మ॥ 2.30 గం॥ల వరకు. **అధికారి పేరు మరియు చిరునామా:** శ్రీ గోవర్ధన్ గౌడ్, చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, కూకట్‌పల్లి జోన్, GHMC, సెల్: 7337267270. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.in/ వద్ద చూడవచ్చును
సం/- చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, కూకట్‌పల్లి జోన్, GHMC
DIPR.RO.No.11003-PP/CL/Advt/1/2023-24 , Dt : 27-02-2024

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం, PDSZ-1, GHMC అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, హైదరాబాద్
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
**నిట్ నెం.04/EE/PDSZ-1/GHMC/2023-24,** **తేది: 26-02-2024**
**పని పేరు:** ప్రతిపాదిత 40 అడుగుల వెడల్పు గల రహదారి కోసం హబీబ్ నగర్ నుండి రియాసత్ నగర్ వరకు రోడ్డు విస్తరణలో ప్రభావితమైన 19 ఆస్తులను కూల్చివేయడం.. **అంచనా వ్యయం (రూ. లక్షలలో) : 12.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 28-02-2024 మ॥ 4.00 గం॥లకు. **డౌన్‌లోడ్ ముగింపు తేది:** 16-03-2024 ఉ॥ 11.30 గం॥లకు. **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం: 16-03-2024 మ॥ 12.30 గం॥లకు. ప్రైస్ బిడ్ తెరచు తేది: 16-03-2024 మ॥ 1.00 గం॥కు. అధికారి పేరు మరియు చిరునామా:** ప్రాజెక్ట్ డివిజన్ సౌత్ జోన్-1, 5వ అంతస్తు, GHMC, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.in/ వద్ద చూడవచ్చును
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ప్రాజెక్ట్ డివిజన్ SZ-1, GHMC
DIPR.RO.No.10994-PP/CL/Advt/1/2023-24 , Dt : 27-02-2024

# రెండు గ్యారెంటీలకు శ్రీకారం

● రూ. 500కే గ్యాస్, ఉచిత విద్యుత్ ● పథకాలను ప్రారంభించిన రేవంత్ రెడ్డి
● మరో రెండు త్వరలోనే అమలు చేస్తామని ప్రకటన



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక కష్టాలున్నా ఆరు గ్యారంటీ లను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలు చేస్తున్నా మని, తాజాగా మరో రెండు పథకాలు ప్రారంభించుకున్నామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మిగతా హామీలు కూడా ఒక్కొక్కటిగా తప్పకుండా అమలు చేస్తామని రేవంత్ స్పష్టం చేశారు. కాగా, అభయహస్తం గ్యారంటీల్లో ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంపు పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇక తాజాగా గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి స్కీమ్లో భాగంగా రూ.500కు సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం సచివాలయంలో లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడు తూ.. అభయహస్తం ద్వారా ఆరు గ్యారంటీలు ప్రకటిం చామని తెలిపారు. సోనియా గాంధీ ఇచ్చిన హామీని ఎప్పుడూ విస్మరించలేదని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారన్న సీఎం రేవంత్.. ఆమె స్ఫూర్తితో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 2 హామీలు అమలు చేశామని గుర్తు చేశారు. చేవెళ్లలో లక్ష మంది మహిళల సమక్షంలో పథకాలు ప్రారంభించాలని భావించామని.. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల సచివాలయంలో పథకాలు ప్రారంభించినట్లు సీఎం రేవంత్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1500కే దేశంలోని పేదలందరికి గ్యాస్ కనెక్షన్లను యూపీఏ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. రూ.400 గ్యాస్ సిలిండర్ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.1200కు పెంచిందని రేవంత్ ఆరోపించారు. పేదలకు గ్యాస్ సిలిండర్ భారం తగ్గించాలని రూ.500కే సిలిండర్ ఇస్తున్నామన్నారు. ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని రేవంత్ సూచించారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసిన తెల్ల రేషన్ కార్డుదారులకు ఈ పథకాలను వర్తింపచేయనున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.

Repco Home Finance
**REPCO హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**హబ్సిగూడ బ్రాంచ్ : లిమిటెడ్ ఇం.నెం.7-149, 1వ అంతస్తు, ఐడిబిఐ బ్యాంక్ పైన, నాగేంద్ర నగర్, హబ్సిగూడ, హైదరాబాద్ - 500007**
**స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్థి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 కింద మరియు సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాల వినియోగంలో **రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి** కింద సంతకం చేయబడినవారు భద్రతా ఆసక్తి (అమలు)లోని 9వ నిబంధనతో చదువబడిన రూల్స్, 2002 క్రింద పేర్కొన్న తేదీలలో **డిమాండ్ నోటీసును** జారీ చేసింది, వారు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు తిరిగి చెల్లించవలసి ఉంటుంది.
రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైతే, దిగువ సంతకం చేసినవారు ఇక్కడ వివరించిన అధికారాలను ఉపయోగించడం ద్వారా ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు, హామీదారు మరియు సాధారణంగా ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. ఈ చట్టంలోని సెక్షన్ 13(4) కింద అతనికి ప్రదానం చేయబడింది, **2024 ఫిబ్రవరి 26**వ తేదీన పేర్కొన్న నిబంధనలలోని 9వ నిబంధనతో చదవబడింది.
రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు, హామీదారు మరియు సాధారణంగా ప్రజలు ఆస్తులతో వ్యవహరించవద్దని హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తికి సంబంధించిన ఏదైనా లావాదేవీలు **రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, హబ్సిగూడ బ్రాంచ్‌లలో పేర్కొన్న మొత్తం మరియు ప్రతి ఖాతాకు వ్యతిరేకంగా క్రింద వడ్డీకి లోబడి ఉంటాయి.**
సెక్యూరిటైజేషన్ చట్టంలోని సెక్షన్ 13 (8)కి మేము మీ దృష్టిని ఆకర్షించాము, దాని ప్రకారం, సురక్షితమైన రుణదాత యొక్క బకాయిలు అన్ని ఖర్చులతో కలిపి ఉంటే, సురక్షిత ఆస్తిని బదిలీ చేయడానికి లేదా విక్రయించడానికి తదుపరి చర్యలు తీసుకోబడవు. సురక్షిత రుణదాత ద్వారా విధించబడే ఛార్జీలు మరియు ఖర్చులు మీరు సురక్షిత ఆస్తిని విక్రయించడానికి లేదా బదిలీ చేయడానికి నిర్ణయించిన తేదీకి ముందు ఎప్పుడైనా టెండర్ చేయబడతాయి.

**క్రమ సంఖ్య .1:- రుణగ్రహీత: శ్రీ నాళం కోట రాజు,** S/o. శ్రీ నాళం నారాయణ మూర్తి ఇం.నం.8-3-218/678/1009/55 శివమ్మ పాపి రెడ్డి హిల్స్, యూసుఫ్ గూడ, ఖైరతాబాద్ తెలంగాణ 500 045. **ఇంకా ఇక్కడ: సాయి మహాలక్ష్మి వర్క్స్,** 3-4-109, రామతాపూర్ మెయిన్ రోడ్, మేడ్చల్-మల్కాజిగిరి, 500 013. **ఇంకా ఇక్కడ:** ప్లాట్ నెం.40, స్వగృహ జ్యువెల్స్, వీర్‌పల్లి గ్రామం, నందిగామ మండలం, రంగారెడ్డి 509 216. **సహ రుణగ్రహీత:శ్రీమతి నలం కుమారి** W/o. శ్రీ నాళం కోట రాజు ఇం.నెం.8-3-218/678/1009/55 శివమ్మ పాపి రెడ్డి హిల్స్, యూసుఫ్ గూడ, ఖైరతాబాద్ తెలంగాణ- 500 045. **ఇంకా ఇక్కడ:** ప్లాట్ నెం.40, స్వగృహ జ్యువెల్స్, వీర్‌పల్లి గ్రామం, నందిగామ మండలం, రంగా రెడ్డి 509 216. **హామీదారు : శ్రీ శశికాంత్ V కాకర,** S/o.శ్రీ రత్నం కాకర నం.101-047, అయ్యప్ప గ్రౌండ్ దగ్గర, మాడ్ హెచ్ ఉరా నగర్, హైదరాబాద్ - 500 038.
**డిమాండ్ నోటీసు తేదీ: 09-10-2023** డిమాండ్ నోటీసు **(ఖాతా నం.1671890001482)** ప్రకారం క్లెయిమ్ చేయబడిన మొత్తం వరుసగా **రూ.23,25,072/- 07-10-2023** నుండి తదుపరి వడ్డీతో పాటు దానిపై ఇతర ఖర్చులు **బకాయి మొత్తం: రూ.24,80,898/- 22-02-2024** నుండి తదుపరి వడ్డీ మరియు దానిపై ఇతర ఖర్చులు.
**ఆస్తి వివరణ: ఆస్తి I :** సర్వే నెం.487/P, 493/P, 508/P, 509/Pలో ఉన్న స్వగృహ జ్యువెల్స్‌లో, 259 చదరపు గజాల పరిమాణంలో ఉన్న ప్లాట్‌ని కలిగి ఉన్న నం.40లోని భాగం మరియు పార్సిల్ అంతా వీర్లపల్లి గ్రామం వద్ద, నందిగామ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం మరియు ఉత్తరం: ప్లాట్ నెం.41, దక్షిణం: పొరుగువారి భూమి, తూర్పు: ప్లాట్ నెం.42, పశ్చిమం: 40 అడుగుల వెడల్పు రోడ్డు.

**క్రమ సంఖ్య 2:- రుణగ్రహీత: శ్రీ బండబావి నరేష్ రెడ్డి,** S/o. బండబావి కోటి రెడ్డి ఫ్లాట్ నం. 104, ఇం.నెం. 3-4-526/34, సాయి చక్ర మాన్షన్, నారాయణగూడ, పోస్టాఫీసు లేన్, హైదరాబాద్ - 500 027. **అలాగే ఇక్కడ:** ఫ్లాట్ నెం. 401, 4వ అంతస్తు, ఓర్లీన్ ఛాంబర్స్, గాంధీ నగర్ స్ట్రీట్ నెం 8, బకరం, హైదరాబాద్ - 500048. **అలాగే వద్ద:** ఏరియా సేల్స్ మేనేజర్ M/s PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ 6-1-73, సయ్యద్ ప్లాజా లక్డీ కా పుల్, సైఫాబాద్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ - 500063 **సహ రుణగ్రహీత : శ్రీమతి బండబావి కిరణ్మయి,** W/o. నరేష్ రెడ్డి ఫ్లాట్ నెం. 104, ఇం.నెం. 3-4-526/34, సాయి చక్ర మాన్షన్, నారాయణగూడ, పోస్టాఫీసు లేన్, హైదరాబాద్ - 500 027. **ఇంకా ఇక్కడ:** ఫ్లాట్ నెం. 401, 4వ అంతస్తు, ఓర్లీన్ ఛాంబర్స్, గాంధీ నగర్ స్ట్రీట్ నెం 8, బకరం, హైదరాబాద్ - 500048. **హామీదారు : శ్రీ బి. యుగంధర్,** S/o. బి. కోట రెడ్డి ఫ్లాట్ నం. 404, వెంకటాద్రి బ్లాక్, SVRS బృందావనం, సరూర్ నగర్, రంగారెడ్డి జిల్లా - 500 079. **ఇంకా ఇక్కడ: TSSPOCL,** సదరన్ పేవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ, ఉప్పల్, హైదరాబాద్ - 500 039.
**డిమాండ్ నోటీసు తేదీ: 11-07-2023** డిమాండ్ నోటీసు **(ఖాతా నం.1671870000912)** ప్రకారం క్లెయిమ్ చేయబడిన మొత్తం వరుసగా **రూ.31,10,114/- 11-07-2023** నుండి తదుపరి వడ్డీ మరియు దానిపై ఇతర ఖర్చులు **బకాయి మొత్తం: రూ.30,27,562/- 22-02-2024** నుండి తదుపరి వడ్డీ మరియు దానిపై ఇతర ఖర్చులు.
**ఆస్తి యొక్క వివరణ:** మునిసిపల్ నెం.1-4-881/F-401లోని నాల్గవ అంతస్తులోని ఫ్లాట్ నెం.401 (దాని PTIN నంబర్ 1090108247ను చూడండి) ORLEAN ఛాంబర్స్ అని పిలుస్తారు, ఇది కొలత:1410 చదరపు. బాకారం, హైదరాబాద్, T.S వద్ద ఉన్న మున్సిపల్ నం. 1-4-881ని కలిగి ఉన్న ప్రాంగణంలో 45.00 చదరపు గజాల అవిభక్త వాటాతో పాటుగా సాధారణ ప్రాంతాలతో సహా అడుగులు మరియు సరిహద్దులు: భూమి సరిహద్దులు: ఉత్తరం: H.No. 1-4-881, దక్షిణం: లేన్, తూర్పు: H.No. 1-4-881, పడమర: 30 అడుగుల వెడల్పు రోడ్డు, ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం: లాబీ & ఫ్లాట్ నం.402, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: మెట్లు మరియు ఫ్లాట్ నం.405

**తేది: 26-02-2024**
అధీకృత అధికారి
రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్.,

సూర్య
హైదరాబాద్
బుధవారం
28 ఫిబ్రవరి 2024



# సంపాదకీయం

editpage@suryaa.com

భారతరత్న అందుకున్న సమయంలో సి.వి రామన్ ఇచ్చిన సందేశాత్మక ఉపన్యాసం నేటికీ ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. "విజ్ఞాన శాస్త్ర సారాంశం ప్రయోగశాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన మరియు స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి జ్ఞానశాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి " అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త సర్ సి వి రామన్ నోబెల్ బహుమతిని గెలుచుకోవడానికి దారితీసిన 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరణ జ్ఞాపకార్థం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటారు.
1986లో నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా గుర్తించాలని భారత ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం 1987 ఫిబ్రవరి 28 నుండి ప్రతీ సంవత్సరం జాతీయ స్కైన్స్ దినోత్సవంగా అధికారకంగా జరుపుతుంది. ప్రతీ సంవత్సరం విభిన్న థీమ్ తో జరుపుకుంటున్నారు. ఈ సంవత్సరం థీమ్ "అభివృద్ధి చెందిన భారతదేశం కోసం స్వదేశీ సాంకేతికతలు - ఇండ్జీనియస్ ఫర్ వీక్షిత్ భారత్ ". జాతీయ సైన్స్ డే వేడుకల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలలో పబ్లిక్ స్పీచ్‌లు,ెలివిజన్ టాక్ షోలు, థీమ్‌లు మరియు కాన్సెప్ట్‌ల ఆధారంగా సైన్స్ ఎగ్జిబిషన్‌లు, స్కైవాచింగ్, లైవ్ ప్రాజెక్ట్‌లు, పరిశోధన ప్రదర్శనలు, డిబేట్లు, క్విజ్ పోటీలు, ఉపన్యాసాలు, సైన్స్ మోడల్‌ల ప్రదర్శనలు

## ప్రపంచాన్ని ప్రకాశవంతం చేసిన మార్గదర్శకుడు

మరియు అనేక ఇతర కార్యకలాపాలు జరుగుతాయి.
సైన్స్ యొక్క ప్రాముఖ్యత మరియు దాని అనువర్తనాల గురించి ప్రజలలో అవగాహన పెంచడం జాతీయ సైన్స్ దినోత్సవం యొక్క ప్రాథమిక లక్ష్యం. ప్రజల దైనందిన జీవితంలో శాస్త్రీయ అనువర్తనాల ప్రాముఖ్యత గురించి సందేశాన్ని వ్యాప్తి చేయడం, మానవ సంక్షేమం కోసం భారతీయ శాస్త్రవేత్తల కార్యకలాపాలు, కృషి మరియు విజయాలను ప్రదర్శించడం, శాస్త్రీయ సమస్యల గురించి చర్చించడం, శాస్త్రీయ అభివృద్ధికి కొత్త సాంకేతికతలను అమలు చేయడం,శాస్త్ర సాంకేతికతలను ప్రోత్సహించడం మరియు ప్రాచుర్యం పొందడం వంటి ఇతర లక్ష్యాలు కూడా ఉన్నాయి. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో వెల్లడించిన వ్యక్తుల్లో సర్ సీవి రామన్ మొదటి వ్యక్తి. ఈయన నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో చంద్రశేఖర్ అయ్యర్ మరియు పార్వతి అమ్మాళ్ దంపతులకు జన్మించారు. తండ్రి గణితం మరియు భౌతిక శాస్త్రం లెక్చరర్ గా పనిచేసేవారు. రామన్ తన 13 వ ఏట ప్రెసిడెన్సీ కాలేజీలో 1902 లో ప్రవేశించి 1904 లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై బంగారు పతకం పొందాడు. 1907 లో అదే కాలేజీ నుండి యం.ఏ. డిగ్రీని భౌతికశాస్త్రంలో డిస్టింక్షన్లో ఉత్తీర్ణుడయ్యాడు. 1917 లో , అతను కలకత్తా విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా చేరాడు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాస్కై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్గా చేరారు. విజ్ఞాన పరిశోధన తృష్ణ వలన తను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి కలకత్తా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసరుగా చేరారు. 1924 లో ఇంగ్లండ్ రాయల్ సొస్కెటీ సభ్యుడయ్యాడు. 1926లో ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫిజిక్స్‌ను స్థాపించాడు. ఫిబ్రవరి 28, 1928న రామన్ ఎఫెక్ట్ను కనుగొని ప్రపంచానికి తెలియజేశారు.
ఈ ప్రయోగానికే 1930లో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని పొందుకున్న మొట్టమొదటి భారతీయ శాస్త్రవేత్తగా పేరుగడించారు. ఈయనకు 1928 లో "సర్" బిరుదు, 1929లో బ్రిటీష్ ప్రభుత్వంచే న్కెట్ హుడ్ బిరుదు లభించింది. 1954లో భారత అత్యున్నత పౌర పురస్కారం "భారతరత్న" తో గౌరవింపబడ్డారు.
1957 లో సోవియట్ యూనియన్ 'లెనిన్ బహుమతి'తో సత్కరించింది. విదేశాలలో ఎన్నో అవకాశాలున్నా కాదని మన దేశంలోనే అరకొర సదు-పాయాలతోనే పరిశోధనలు చేసి సివిరామన్ ఎన్నో విజయాలు సాధించారు. ఇది అసామాన్యమ్కెనదని అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమ్కెనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు. సి.వి రామన్ కోల్‌కతాలోని ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్ ప్రయోగశాలలో పనిచేస్తున్నప్పుడు రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. ఇది స్పెక్ట్రోస్కోపీలో ఒక దృగ్విషయం. ద్రవాలపై పడిన కాంతి కిరణాలు ఎలా పరిక్షేపణం చెందుతాయో (చెదురుతాయో) తెలిపే పరిశోధన ఫలితాన్నే రామన్ ఎఫెక్ట్ అంటారు. సముద్రం నీలం రంగులో ఉండడానికి గల కారణం ఈ రామన్ ఎఫెక్టే..!హౌ
రామన్ స్పెక్ట్రోస్కోపీ అనేది బయోమెడికల్ ఇంజనీరింగ్ మరియు లైఫ్ సైన్స్‌లో రోగనిర్ధారణలో ఉపయోగిస్తారు. వైద్య పరిశోధనలో ఒకే కణాల జీవరసాయన వాతావరణాన్ని అధ్యయనం చేయడం లేదా ఔషధాలకు కణాల ప్రతిచర్యను పర్యవేక్షించడం, మందుల తయారీలో ప్రక్రియ మరియు నాణ్యత నియంత్రణ కోసం ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో ఉపయోగించబడుతుంది. వైద్య శాస్త్రంలో కణాల గుర్తింపు మరియు వర్గీకరణ, కణాలలో ప్రోటీన్లు, లిపిడ్లు మరియు న్యూక్లియిక్ ఆమ్లాల తీరును పరిశీలించడంలోను, క్యాన్సర్ , కరోనా వైరస్, డెంగ్యూ జ్వరం మొదలైన అంటువ్యాధులు నిర్ధారించడంలోను, ఆహార కల్తీని గుర్తించడంలోనూ, నేరనిర్ధారణ విభాగంలో తుపాకీ కాల్పులు అవశేషాలు, ఫోర్జరీ పత్రాలను గుర్తించడంలోనూ, అంతరిక్షానాకి సంబంధించి రిమోట్ సెన్సింగ్ మరియు గ్రహాల అన్వేషణలోనూ రామన్ ఎఫెక్ట్ ఉపయోగించబడుతుంది. అంగారక గ్రహంలోని ఖనిజాలను పసిగట్టడానికి రామన్ స్కాటరింగ్ ఉపయోగించబడింది.
1949 లో బెంగుళూరులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ ఆ సంస్థలో పరిశోధనలు జరిపి మన దేశంలో స్కెన్సు అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. అతని పని భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు మరియు పరిశోధకులకు స్ఫూర్తినిస్తూనే ఉంది. కాంతి స్వభావంపై తన మార్గదర్శక పని ద్వారా ప్రపంచాన్ని ప్రకాశవంతం చేసిన మార్గదర్శకుడు.

# బీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారిన ఎంపీ ఎన్నికలు



■ బీఆర్ఎస్ కు ప్రతిష్టాత్మకంగా మారిన ఎంపీ ఎన్నికలు ■ టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి చేరికలు ■ ఎంపీగా పోటీ చేయడానికి జంకుతున్న సిట్టింగ్ ఎంపీలు ■ టిఆర్ఎస్ కు జీవన్మరణ సమస్యగా మారిన ఎంపీ ఎన్నికలు ■ అక్కడక్కడ బిజెపిలో చేరుతున్న బీఆర్ఎస్ నేతలు ■ రాజకీయ భవితవ్యాన్ని మార్చే నైజం ■ ఎంపీలు గెలిపించుకొని అధిష్టానని మెప్పించుకునే ప్రయత్నంలో సీఎం రేవంత్ ■ కాంగ్రెస్‌కు మాకు మధ్య పోటీ అంటున్న బిజెపి ■ కాలేశ్వరం అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ అంటున్న కాంగ్రెస్

విద్య వెంకట్ తెలంగాణ బ్యూరో
9391618181

తెలంగాణ సెంటిమెంట్ తో రాజకీయ పార్టీని స్థాపించిన కేసీఆర్ ఒక్కసారిగా అధికారాన్ని కోల్పోవడంతో అయోమయంలో పడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో బలిదానాలు ఎన్నో అవమానాలు ఎన్నో అవరోధాలు అయినప్పటికీ తెలంగాణ సెంటిమెంటును నమ్ముకొని ప్రజలు ఓటు వేస్తే తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఫక్తు రాజకీయ పార్టీ అంటూ తెలంగాణ ద్రోహులను పంచన చేర్చుకొని తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేసిన కెసిఆర్ ప్రస్తుతం తగిన శాస్తిని అనుభవిస్తున్నారు. అంటే అధికారాన్ని కోల్పోయి గెలిచిన ప్రజాప్రతినిధులను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. చివరకు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయిన కొన్ని రోజుల్లోనే తుంటి విరగొట్టుకొని దవాఖాన పాలైన కేసీఆర్ చింత చచ్చినా పులుపు చచ్చ లేదన్న విధంగా నల్గొండలో సభ పెట్టి సీఎంతో పాటు అధికార పక్షాన్ని విమర్శించిన అసెంబ్లీకి మాత్రం వెళ్లలేదు. దీన్నే అలుసుగా తీసుకున్న అధికార పక్షం అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ ను కేసీఆర్ కుటుంబాన్ని కేసీఆర్ అనుచర వర్గాన్ని కడిగిపారేశారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర మంత్రులు. మేడిగడ్డలో కుంగిన పిల్లర్ల సాక్షిని ఏకంగా ప్రజాప్రతినిధులకు, మీడియా ప్రతినిధులకు ప్రత్యక్షంగా చూపి గత ప్రభుత్వ అవినీతి బంగారాన్ని లోప భూయిష్టతను లోకానికి చూపారు. అయితే అసెంబ్లీ ఎన్నికలు జరిగి అధికార మార్పిడి జరిగిన కొన్ని నెలల్లోనే జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు అధికార విపక్షాలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఈ ఎన్నికలు టిఆర్ఎస్ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పొత్తుల పరిస్థితి తెరపైకి వచ్చింది. గత ప్రభుత్వ హాయంలో మంత్రిగా పనిచేసిన చామకూర మల్లారెడ్డి టిఆర్ఎస్ తో పొత్తు ఉన్నప్పటికీ మల్కాజ్ గిరి ఎంపీ టికెట్ తన కొడుక్కి వస్తుందని ప్రకటించడంతో భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ బిజెపితో బీఆర్ఎస్ పొత్తు అంటే చెప్పుతో కొట్టండి అని ప్రకటించారు. దీంతో టిఆర్ఎస్ పరిస్థితి కూడిదిల పద్ద ఎలుకల తయారైంది. తెలంగాణ రాజకీయాలకు వచ్చే ఆరు నెలలు కీలకమా. పొరుగున ఉన్న కర్ణాటక పరిస్థితి కూడా అంతేనా. నల్లగొండ బహిరంగ సభతో కేసీఆర్ యాక్టివ్ అవుతున్న వేళ సీఎం రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టడం ఖాయమా. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ను గద్దె దించాలని బీజేపీ కంకణం కట్టుకుని బీఆర్ఎస్ తో చేతులు కలిపితే పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. పైగా ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి వలసలను ఆపుకోవాల్సిన అనివార్యత కేసీఆర్ కు ఉందని చెప్పక తప్పదు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి నెలదాటిందో లేదో బీఆర్ఎస్ నేతలంతా హస్తం పార్టీకి క్యూ కడుతున్నారు. మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలతో కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా పక్క చూపులు చూస్తున్నారు. మెదక్ జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డితో విడిగా సమావేశమయ్యారు. అదేమంటే నియోజకవర్గం సమస్యలు చర్చించడానికి వెళ్లామని చెప్పుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య కూడా బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు.కెటీఆర్ కు ఎంతో సన్నిహితుడిగా మెలిగిన హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సైతం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యి సంచలనం సృష్టించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ రంగంలోకి దిగి నల్లగొండ సభ ద్వారా పార్టీ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపేందుకు ప్రయత్నించారు. ఇది ఒక కోణం మాత్రమే. బొటాబొటీ మెజార్టీ ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని టార్గెట్ చేసుకోవడం రెండో కోణం.
తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు కీలక దశలో ఉన్నాయి. అసలు గేమ్ లోక్ సభ ఎన్నికల్లో కనిపిస్తుందని చెప్పుకోవాల్సి ఉంటుంది. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ క్రియాశీలమైతే అప్పుడు పరిస్థితి వేరుగా ఉంటుంది. రేవంత్ రెడ్డి ఎంత అగ్రెసివ్ గా కనిపించినా%ొ%లోక్ సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డిఫెన్స్ ఆడుతున్నారనే చెప్పక తప్పదు. కేసీఆర్ యాక్టివ్ అవుతున్నారు. అవ్వాలి కూడా. బీఆర్ఎస్ ను కాపాడుకోవాలన్నా, పార్టీని బలోపేతం చేయాలన్నా కేసీఆర్ యాక్టివ్ గా ఉండాలి. కేసీఆర్ మార్కు రాజకీయాలతోనే బీఆర్ఎస్ ను నిలబెట్టుకోవడం సాధ్యపడుతుంది. ఈ క్రమంలో మరో రెండు నెలలలోపే జరిగే లోక్ సభ ఎన్నికలు పార్టీకి పరీక్షా సమయం అవుతున్నాయి. తెలంగాణ రాజకీయాలను కూడా ఆ ఎన్నికలు మలుపు తిప్పే అవకాశం ఉంది. రాష్ట్రంలో 17 లోక్ సభా స్థానాలుండగా.. ఎంఐఎం గెలిచే హైదరాబాద్ వదిలేస్తే.. మిలిగిన 16లో ఎవరికెన్ని వస్తాయన్న చర్చ జరుగుతోంది. తాజా సర్వేల ప్రకారం బీఆర్ఎస్ కు నాలుగు నుంచి ఆరు స్థానాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ కు ఆరు నుంచి ఎనిమిది, బీజేపీకి రెండు నుంచి మూడు స్థానాలు వచ్చే వీలుంది. అయితే లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసుకోలేని పక్షంలో రేవంత్ రెడ్డి నాయకత్వానికి గండి పడే ప్రమాదం ఉందని ఒక టాక్. పార్టీలోనూ, బయట ప్రత్యర్థులు బాగా యాక్టివ్ అయిపోయి ముప్పేట దాడి మొదలు పెడతారు. అందులోనూ మళ్లీ కేంద్రంలో బీజేపీ అధికారానికి వస్తుందని తేలిపోయింది. కాస్త బొటాబొటీ మెజార్టీ ఉన్న ప్రభుత్వాలను అస్థిర పరచడం బీజేపీకి మొదటి నుంచి ఉన్న విద్యే. అందులోనూ రేవంత్ మీద కసితో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బీజేపీకి సహకరించే వీలుంటుంది. దక్షిణాదిన బీజేపీకి ఎక్కువ లోక్ సభా స్థానాలు వచ్చేదీ కర్ణాటకలోనేనని సర్వేలు తేల్చాయి. అక్కడ అధికారం కోల్పోయిన బాధ బీజేపీకి ఉంది. లోక్ సభ ఎన్నికల తర్వాత కర్ణాటకపై ఆ పార్టీ ఫోకస్ పెడుతుందని బహిరంగంగా చెప్పుకుంటున్నారు. దానితో పాటు పొరుగున ఉన్న తెలంగాణను కూడా ఒక పట్టుపడితే తప్పేముందని కమలనాథులు ప్రశ్నించుకుంటున్నారు. బీఆర్ఎస్ వేవ్ లెంత్ కూడా అదే కావడంతో శత్రువుకు శత్రువు మన మిత్రుడన్న కాన్సెప్ట్ ఇప్పుడు దక్షిణాది రాజకీయాల్లో బాగా వినిపిస్తోంది. బీజేపీ తలచుకంటే కర్ణాటకలో కొందరు ఎమ్మెల్యేలను బయటకు లాగడం కష్టమేమీ కాదు. మహారాష్ట్రలో ఏక్ నాథ్ షిండేను సీఎం చేసినట్లుగా కాంగ్రెస్ లో ఒకరిని బయటకు తెచ్చి తమ వైపుకు తిప్పుకోవచ్చు. అసలే కర్ణాటక కాంగ్రెస్ లో మంత్రి పదవులు రాని వాళ్లు, సీఎం పదవికి గాలం వేసిన వాళ్లు సిద్దరామయ్య పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ నుంచి ఎమ్మెల్యేల వరకు అందరూ ఛాన్స్ వస్తే ఏదోకటి చేసేయ్యాలనుకుంటున్నారు. అలా ఎదురుచూస్తున్న వారికి బీజేపీ ఆశాకిరణమవుతుంది. బీజేపీకి కావాల్సింది కూడా వారిని కలుపుకుపోవడమేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తెలంగాణ కూడా కర్ణాటకలాగే తయారు కావచ్చు. ఇక్కడి 119 అసెంబ్లీ స్థానాల్లో కనీస మెజార్టీకి 60 సీట్లు రావాల్సి ఉండగా, కాంగ్రెస్ పార్టీకి 64 వచ్చాయి. అంటే కనీస మెజార్టీ కంటే కేవలం నాలుగు స్థానాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రత్యర్థి బీఆర్ఎస్ కు 39 స్థానాలు దక్కాయి.అంటే కాంగ్రెస్ లో చిన్నపాటి తిరుగుబాటు జరిగినా ఆ గ్రూపుకు బీఆర్ఎస్ తో పాటు ఎనిమిది మంది సభ్యులున్న బీజేపీ తోడయ్యే వీలుంటుంది. కాంగ్రెస్ లో మొదటి నుంచి ఉన్న భట్టి విక్రమార్క, జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి లాంటి వాళ్లని కాదని తర్వాత ఎప్పుడో వచ్చిన రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం సీఎం పదవి ఇవ్వడంతో వాళ్లంతా మండిపోతున్నారు. వాళ్లలో ఒకళ్లు గ్రూపు కట్టి బయటకు వస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోవడం ఖాయం.అయితే వాళ్లలో ఎవరూ తక్షణమే ప్రత్యక్ష కార్యాచరణకు దిగే అవకాశం లేదు. లోక్ సభ ఎన్నికల ఫలితాలను చూసుకుని తర్వాత గేమ్ ప్లాన్ అమలు చేసే అవకాశం ఉంది. నాలుగు రోజులు సీఎంగా ఉన్నా చాలనుకునే వాళ్లు చాలా మంది కాంగ్రెస్లో ఉన్నారు. అలాంటి వారిని లాగేసి తర్వాత బురిడీ కొట్టించడం కేసీఆర్, బీజేపీలకు బాగానే తెలుసు. అందులోనూ అధికారాన్ని ఎలా పొందాలో కేసీఆర్ కు బాగానే తెలుసు. ఎమ్మెల్యేలను ఎలా లాక్కోవాలో పదేళ్ల పాటు ఆయన రీసెర్చ్ చేసి ఉన్నారు. ఆ విషయంలో కేసీఆర్ ముందు రేవంత్ రెడ్డిని అనుభవం లేని నాయకుడిగానే పరిగణించాలి. బీఆర్ఎస్ కు నాలుగైదు ఎంపీ సీట్లు వస్తే సీన్ మారిపోతుంది. తెలంగాణ ప్రజల్లో పార్టీ పట్ల మళ్లీ విశ్వాసం కలుగుతోందని కేసీఆర్ కు ధీమా వచ్చేస్తోంది. అప్పుడు ఎలాంటి రిస్క్ అయినా తీసుకునేందుకు ఆయన వెనుకాడరు. పైగా మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు రావాలంటే నాలుగేళ్లకు పైగా టైమ్ ఉంటుంది.అంతవరకు పార్టీని మేనేజ్ చేయాలంటే ఏదోక రాజకీయ కార్యకలాపాలు ఉండాలి కదా. అది ప్రభుత్వాలు మారే కార్యక్రమం అయితే నేతలు, ఎమ్మెల్యేలు బిజీగా ఉంటారు. కేసీఆర్ ప్లాన్ కూడా అదే కావచ్చునని రాజకీయాలు తెలిసిన వారు అనుకుంటున్నరు.
అయితే సెంటిమెంట్ పరంగానే కెసిఆర్ రాజకీయాల్లో సక్సెస్ అయ్యారని పరిపాలనలో మాత్రం ఫెయిల్యూర్ అయ్యారని రాజకీయ మేధావులు భావిస్తున్నారు ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రంలో గల 17 పార్లమెంట్ స్థానాల్లో అత్యధిక సీట్లు సాధించకపోతే టిఆర్ఎస్ రాజకీయ మనుగడ కష్టమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ రాజకీయ పార్టీ రాజకీయ భవితం తేలాలంటే మరికొన్ని నెలలు గడవాల్సిందే.

# ఏమిటి మీ విశ్వసనీయత?

■ విధ్వంసక పాలనపై చర్చకు ఎవరు సిద్ధం? ■ ప్లేస్, టైం. నువ్వే చెప్పాలని, ఎక్కడికైనా వస్తామంటున్న కార్యకర్తలు ■ విశ్వసనీయతకు, వంచనకు మధ్య యుద్ధం ఎందాకా? ■ అంచెలంచెలు గా మద్యనిషేధం విధిస్తానన్న హామీ ఎందాక? ■ ప్రజలకు భేషరతు హామీలు,పథకాలు ప్రకటించి వెనక్క తగ్గిన తీరు ఏలెక్క?

నీరుకొండ ప్రసాద్
9849625610

అరాచక, విధ్వంస పాలన ఎవరిదో,అభివృద్ధి- సంక్షేమ పాలన ఎవరిదో జనం ముందు చర్చిద్దాం దమ్ముంటే నాతో బహిరంగ చర్చకు రావాలని ప్లేస్, టైం. నువ్వే చెప్పాలని, ఎక్కడికైనా వస్తాను దేని మీదైనా సరే,ఎవరి పాలన స్వర్ణ యుగమో,ఎవరి పాలన రాతి యుగమో చర్చిద్దాం నువ్వు సిద్ధమా జగన్ రెడ్డీ? అంటూ ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు , సియం జగన్ రెడ్డికి ఓపెన్ సవాల్ విసిరారు. నిజంగా జగన్ రెడ్డికి ధైర్యం ఉంటే చంద్రబాబు సవాల్‌పై చర్చకు సిద్ధం కావాలి. బూటకపు హామీల తో,మాయమాటలతో, యుద్ధం -సిద్ధం అంటూ సోల్లు మాటలతో జనాన్ని రెచ్చగొట్టడం కాదు.నిజంగా జగన్ చెప్పుకొంటున్నట్లు తాను గొప్ప పరిపాలన అందించి ఉంటే చంద్రబాబుతో బహిరంగ చర్చకు సిద్ధం కావాలి.రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లు అయితే,సంక్షేమ పథకాల ద్వారా ప్రజలను ఉద్దరించినట్లు అయితే,99 శాతం హామీలు అమలు చేసినట్లు అయితే, మీ పాలనలో ప్రజలు సుఖ శాంతులతో ఉన్నట్లు అయితే,పరిశ్రమలు తెచ్చియువతకు ఉద్యోగాలు కల్పించినట్లు అయితే. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి కొత్తగా భూమి సాగులోకి తెచ్చినట్లు అయితే,రోడ్లు బాగుచేసినట్లు అయితే చంద్రబాబుతో బహిరంగ చర్చకు సిద్ధం కావాలి .అట్లాగే రాష్ట్రాన్ని విధ్వంసం చెయ్యకపోతే,అమరావతిని నాశనం చెయ్యక పోతే, పోలవరా న్ని పాడు పెట్టకపోతే,మూడు రాజధానుల పేరుతొ విశాఖలో వేల ఎకరాలు భూములు గుంజుకోకపోతే,ఖనిజ సంపదను దోపిడీ చెయ్యకపోతే,నకిలీ బ్రా%శీ%డ్స్ మద్యంతో జనాన్ని దోపిడీ చెయ్యక పోతే,విద్య,వైద్య రంగాలను నిర్వీర్యం చెయ్యక పోతే చంద్రబాబు తో చర్చకు సిద్ధం కావాలి జగన్ రెడ్డి.వేల మంది పోలీసుల మధ్య లో,పరదాల చాటున ప్రజల్లోకి వచ్చి అబద్దాల ప్రసంగాలు చెయ్యడం కాదు.పేదలు, పెత్తం దారులు అంటూ పెట్రేగి పోవడం కాదు బహిరంగ చర్చకు వచ్చి ఎవరు పేదలు, ఎవరు పెత్తం దారుల్లో తేల్చాలి. బహిరంగ చర్చకు సిద్ధం కాకుండా జగన్ పలాయనం చెందితే చంద్రబాబు చేసిన ఆరోపణలను ,మీడియాలో వస్తున్న వార్తలను జగన్ అంగీకరి ంచినట్లే.
సిద్ధం బహిరంగ సభల్లో సియం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లా డుతూ విశ్వసనీయతకు, వంచనకు మధ్య యుద్ధం జరుగుతోంది అన్నారు. విశ్వసనీయతకు,వంచనకు మధ్య యుద్ధం అనడం చూసి జనం నవ్వుకొంటున్నారు. ప్రజలు తన మోసాలను, అబద్దాలను నమ్మి అధికారం ఇచ్చారని, ఎన్నిప్రవచనాలు వల్లించినా చెల్లుబాటు అవుతుంది అనుకొంటున్నారు.ప్రజల్ని ఎదో విధంగా మోసం చెయ్యడమే జగన్ లక్ష్యం. సిద్ధం అంటూ రాజకీయ డ్రామాలతో రక్తి కట్టిస్తున్నారు. ఏ విధంగా అయినా రెండవ సారి అధికారం జుర్రుకోవడానికి అర్రులు చాస్తున్న జగన్ రెడ్డి జనాన్ని ఉద్దరించినట్లు ప్రజల కళ్ళు గప్పే ప్రయత్నం చేస్తున్నారు,రాష్ట్ర ప్రజల ముందు దోషిగా నిలబడి విశ్వసనీయత అంటూ జగన్ సుద్దులు చెప్పడం అంటే అంతకు మించిన నీతి బాహ్యత ఏముంటుంది? ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజాభ్యుదయానికి ఉపయోగించకుండా
ం ా జ క ీ య ్ ం
ప్రయోజనాలకు,వేధింపులకు,సాధింపులకు,కక్షసాధించడానికి ఉపయోగించడం మీ విశ్వసనీయతనా?ఎన్నికల ముందు వివిద వర్గాల ప్రజలకు భేషరతు హామీలు,పథకాలు ప్రకటించి అధికారంలోకి వచ్చాక అనేక నిబంధనలు విధించి వీలు అయినంత మేర లబ్దిదార్ల సంఖ్యను కుదించి ఆ మేరకు ఖర్చు తగ్గించుకోవడం, మ్యాని పెస్టోలో ఇచ్చిన హామీలను అరకొర అమలు చేసి 99 శాతం హామీలను నెరవేర్చామని ప్రజల్ని మోసం చేయ్యడంమీ విశ్వసనీయతనా? అధికారంలోకి వస్తే అంచెలంచెలు గా మద్యనిషేధం విధిస్తానని, మద్యనిషేధం అమలు చేసి అక్కాచెల్లెళ్ల కన్నీళ్లు తుడుస్తానని,మద్యాన్ని5 స్టార్ హొటల్స్ కే పరిమితం చేస్తానని,మధ్య నిషేధం అమలు చేసిన తరువాతనే ఓట్లు అడుగుతానని అధికారం లోకి వచ్చిన జగన్ ఆదాయం కొరకు నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తూ మద్యం ఆదాయాన్ని రూ 14 వేల కోట్లనుండి రూ వేల 25 కోట్ల పెంచడం. బేవరేజెస్ బాండ్లు తనఖా పెట్టి రూ.25 వేల కోట్ల రుణ సమీకరణ చెయ్యడం మీ విశ్వసనీయతనా? జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిఐదేళ్లు అవుతుంది ఇది సాధించామని చెప్పుకునే పరిస్థితి లేకపోవడం, పరిశ్రమలు, కంపెనీల ఏర్పాటు కోసం వివిధ రాష్ట్రాలు పోటీపడుతున్నా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా కనీస ప్రయత్నాలు చేయక పోవడం,కర్ణాటకకు టెస్లా కంపెనీ, ఉత్తరప్రదేశ్‌కు సాంసంగ్ మొబైల్ తయారీ కేంద్రం, తమిళనాడుకు, తెలంగాణలకు అమెజాన్ కేంద్రాలు వచ్చాయి.మరి ఆంధ్రప్రదేశ్‌ను పరిగణనలోకి తీసుకోవడం మీ విశ్వసనీయతనా? లక్షలాది మంది పార్టీ కార్యకర్తలకు వలంటీర్ ఉద్యోగాలు ఇవ్వడం మినహా ఉపాధి కల్పనకు ఏమి చేయాలన్నదానిపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం, ప్రత్యర్థులను వేధించడం మినహా మేం ఇది సాధించమని చెప్పుకోలేకపోవడం మీ విశ్వసనీయతనా?
వారం రోజుల్లో సి ఫీ ఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులను నమ్మించి అధికారంలోకి వచ్చాక సి పి ఎస్ అవగాహన లేక హామీ ఇచ్చానని మాట మార్చి ఉద్యోగులను దగా చేయ్యడం.ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి కాళీ గా వున్న 2,30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని నిరుద్యోగులను మోసం చేయ్యడం మీ విశ్వసనీయత నా? ఇండియా టుడే సర్వేలో ఒడిసా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దేశంలోనే అత్యుత్తమ సియం గా ఖ్యాతి సంపాదించి ప్రజాధరణ రేటింగ్ లో 52.7 శాతం తో ముందు వరుసలో ఉండగా, తాను అత్యంత జనాదరణ కలిగిన జన నాయకుడని, జనరంజక పాలన అందిస్తున్నానని ,మాట తప్పని, మడమ తిప్పని గొప్ప నాయకుడనని బాకాలూదుకొంటున్నాఇండియా టుడే మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేల్లో జగన్మోహన్ రెడ్డి అడ్రస్ లేక పోవడం మీ విశ్వసనీయతనా?సకల పన్నులు,చార్జీలు పెంచి 10 రూపాయలు ప్రజల చేతిలోపెట్టి వారి నుంచి 100 రూపాయలు గుంజుకొవడం,ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసి రూ12 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్నిఅధోగతి పాలు చేయ్యడం మీ విశ్వసనీయతనా? అధికారాన్ని అడ్డం పెట్టుకొని భూములు, ప్రజలకు చెందాల్సిన ఖనిజ సంపదని స్వాహా చేయ్యడం,సలహా దారుల పేరుతొ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని తమ అనుయాయులకు దోచి పెట్టడం,ప్రకటనల పేరుతొ సొంత మీడియాకు వందల కోట్లు ప్రజాధనం దోచి పెట్టడం,ఇతర మీడియా జర్నలిస్టుల పై దాడులు చెయించడం మీ విశ్వసనీయతనా? అన్ని పదవులు జగన్ సామాజిక వర్గం వారికే ఇచ్చి సామాజిక న్యాయం పేరుతొ ఎస్సీ,ఎస్టీ,బీసీ లను మోసం చెయ్యడం, కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హొదా తెచ్చి పరిశ్రమలు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తానని అధికారంలోకి వచ్చి పరిశ్రమలు తేకపోగా వచ్చిన పరిశ్రమలను వెళ్ళగొట్టి యువతను మోసం చేయ్యడం, రాష్ట్రంలో విచ్చల విడిగా,మద్యం, గంజాయి, మత్తు పదార్థాలు,డ్రగ్స్ స్మగ్లి%శీ%గ్ లో ఆంధ్రప్రదేశ్ నెంబర్ ఒన్ స్థానంలో నిలవడం మీ విశ్వసనీయతనా?రాజకీయ అవసరాలకు తల్లిని,చెల్లిని వాడుకొని వారిని నుండి గెంటి వెయ్యడం,మీ విశ్వసనీయత నా ?జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి.

# ఇక పేర్లు లేవా, మనోభావాలు అందరికీ ఒకటే

ఇది నిజంగా సిగ్గు పడాల్సిన విషయమే. ఈ విశ్వంలో ఏ పేర్లు లేనట్లు సింహాలకు సీత, అక్బర్ పేర్లు పెట్టడం క్షమించ రాని నేరం. నేరం అంటే ఇది ఏ క్రిమినల్ కొ పెట్టిన పేరు కాదు. సాక్షా త్తు యావత్ భారతీయులు దేవతగా కొలుస్తున్న సీత పేరు ఓ క్రూర జంతువుకు పెట్టడం శోచనీయం. అలాగని ఏ సాధు జంతువుకు కూడా అటువంటి పేర్లు పెట్టరాదు. ఇది హైందవులకే కాదు, మైనారిటీలు అయిన ముస్లిమ్స్ కు కూడా నచ్చనిది. ఇటీవల త్రిపుర లోని ఓ జూ పార్క్ నుంచి పశ్చిమ బెంగాల్ శిలిగుడి సపారీ పార్క్ కు ఓ ఆడ సింహం, ఓ మగ సింహం ను తరలించారు. వాటిని సీత, అక్బర్ అని పిలుస్తూ ఓకే చోట ఉంచడంతో వివాదానికి దారి తీసింది. మగ సింహానికి 'రామ ' అని పేరు పెట్టినా కూడా తప్పే. అలాగే ఆడ సింహానికి జోద్ బాయి అని పెట్టినా తప్పే. ఇది అటు హిందువులకు, ఇటు మహమ్మదీయులకు కూడా నచ్చనిది. అక్బర్ అని మగ సింహానికి పేరు పెట్టడం కొంత మంది ముస్లిమ్స్ కు నచ్చిన కోట్ల కొలది హిందువులకు ఆడ సింహానికి సీత అని పేరు పెట్టడం హిందువుల అగ్రహావేషాలకు కారణమయింది. ముఖ్యంగా విశ్వహిందు పరిషత్ అగ్గి మీద గుగ్గిలం అయింది. అక్కడ నిరసన తెలియజేశారు. కలకత్త హై కోర్టు కూడా దీనిపై 'సీరియస్ 'అయింది. వాటికి ' రాజు, రాణి 'అని పేర్లు పెట్టింటే ఏ సమస్య వచ్చి ఉండేది కాదు. సాధారణంగా మనం చెప్పే కథలలో, మన పరిభాషలో అడవికి రాజు సింహం అని సంభోదిస్తూ ఉంటాం. రాజు అనగానే ఆటోమెటిగ్గా రాణి అని చెబుతూవుంటాం. ఈ పేర్లు మన కు ఉన్న అంత పట్టింపు ఉండదు. ఏతా వాత ఒక ఆదర్శ పురుషుడు, కోట్లకొలది ఆరాధ్య దైవం అయిన ఆ శ్రీరామచంద్రుని భార్య అయినా సీత పేరు పెట్టడం తోనే వివాదం రాజకుంది. వివాదానికి కారణమైన 'జూ 'అధికారి కన్జర్వేటర్, అగర్వాల్ ను సస్పెండ్ చేశారు. కేవలం అతన్ని సస్పెండ్ చేసినంత మాత్రాన వివాదం సమసిపోదు.హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇక పెర్లే లేనట్లుగా ఆడ సింహానికి అలా పేరు పెట్టడం నేరమే. ' సీత 'అంటే ఆమె ఓ సాద్వి మణి, భారతీయుల సంస్కృతికి మచ్చుతునక. ఇక అక్బర్ యాభై ఏళ్ళ పాటు భారతా వనిని ఏలిన దీరోదాత్తుడు.అతని పట్టమహీషులు హైందవులే అయినా హిందూ సంప్రదాయం గౌరవించిన వ్యక్తి అక్బర్. హిందువులను ప్రేమగా చూసిన వ్యక్తి. అందుకే 'గ్రేట్ ' అంటారు. గ్రేట్ అనే పదం అందరికీ వర్తించదు.

. కనుమ ఎల్లారెడ్డి,
,93915 23027.

## సరికొత్త కాంపాక్ట్ ఎస్‌యువిని ప్రకటించిన స్కోడా ఆటో




ముంబై స్కోడా ఆటో ఇండియా భారత మార్కెట్‌లోకి వచ్చేసరికి యాక్సిలరేటర్ పెడల్‌పై నుంచి అడుగు పెట్టడం లేదు. కుషాక్, స్లావియా తర్వాత దాని మూడవ ప్రధాన ఉత్పత్తి దాడిలో, కంపెనీ 2025 ప్రథమార్ధంలో భారతదేశంలో ప్రారంభమయ్యే సరికొత్త కాంపాక్ట్ కోసం ప్రణాళికలను ప్రకటించింది. ఈ ప్రకటనపై స్కోడా ఆటో సిఈఓ క్లాస్ జెల్మెర్ మాట్లాడుతూ, స్కోడా ఆటో యొక్క ప్రపంచ వృద్ధికి భారతదేశం కీలకం, దాని స్వంత మార్కెట్ బలం మరియు ఆసియాన్తో సహా కొత్త మార్కెట్లలో మా విస్తరణకు అభివృాఎద్ధి మరియు తయారీ స్థావరం. మధ్యప్రాచ్యం. మేము 2021 నుండి దేశంలో రెండింతల కంటే ఎక్కువ అమ్మకాలను కలిగి ఉన్నాము.

మేము ఇప్పుడు భారతదేశంలో, అంతర్జాతీయంగా కస్టమర్ల కోసం రూపొందించిన మోడల్ల పరిధిని మరింత విస్తరించడం ద్వారా తదుపరి దశను తీసుకుంటున్నాము. 2025లో రానున్న సరికొత్త కాంపాక్ట్ ఎస్‌యువి కస్టమర్ల కోసం ఒక ముఖ్యమైన విభాగాన్ని జోడిస్తుంది. విస్తరిస్తున్న స్కోడా పోర్ట్‌ఫోలియో 2030 నాటికి ఫోక్స్‌వ్యాగన్ ఫ్యామిలీ బ్రాండ్లకు దాదాపు 5 శాతం మార్కెట్ వాటాను సాధించాలనే మా భారత వృద్ధి లక్ష్యానికి దోహదం చేస్తుందని నేను విశ్వసిస్తున్నాన ని అన్నారు.




## మందకొడిగా దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు వీటిపై ప్రభావం చూపుతున్నాయి. ఉదయం 9:27 గంటల సమయంలో సెన్సెక్స్ 27 పాయింట్ల లాభంతో 72,818 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 9 పాయింట్ల స్వల్ప లాభంతో 22,131 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 82.89 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో టీసీఎస్, విప్రో, హె చ్‌సీఎల్ టెక్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, మారుతీ, బజాజ్ ఫిన్సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎల్అండ్‌టీ, ఎన్‌టీపీసీ, హె చ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎంఅండ్ఎం, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టపోతున్న షేర్ల జాబితాలో ఉన్నాయి. అమెరికా మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. నేడు ఆసియా పసిఫిక్ ప్రధాన సూచీలు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 82.50 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు సోమవారం నికరంగా రూ.285.15 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు సైతం రూ.5.33 కోట్ల వాటాలను అమ్మారు.

## జెపి మోర్గాన్ చేజ్ రన్ 2024



ముంబై, జెపి మోర్గాన్ చేజ్ ఇటీవల తన 11వ వార్షిక కార్పొరేట్ ఉద్యోగుల పరుగును బెంగళూరు, హైదరాబాద్, ముంబై, పూణే అంతటా నిర్వహించింది. ఈ పరుగు సుస్థిరత, శూన్య-వ్యర్థాలు, వైవిధ్యం, చేరిక, సమాజ ప్రభావంపై విజయం సాధించింది. ఈ ఈవెంట్లో బృంద స్నేహం యొక్క బలమైన భావం, ఆరోగ్యకరమైన జీవనం కోసం అంకితభావం, స్థిరమైన అభ్యాసాల ప్రచారం, వైవిధ్యం యొక్క వేడుక, సమాజం ఇవ్వడానికి లోతైన నిబద్ధత ఉన్నాయి. 27,000 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఒకచోట చేరారు, సహోద్యోగుల మధ్య సన్నిహిత సంబంధాలను ఏర్పరుచుకున్నారు, భాగస్వామ్య అనుభవాలు, చిరస్మరణీయ క్షణాలను సృష్టించారు. ప్రతి సంవత్సరం, జెపిఎంసి రన్ మరింత మెరుగుపడుతూ, ఉత్సాహవంతంగా వృద్ధి చెందుతుంది. ఈవెంట్ మాకు భాగస్వామ్య అనుభవాలు, జ్ఞాపకాలను అందిస్తుంది, అన్నీ సమిష్టి ఉద్దేశ్యంతో ఆజ్యంపోసాయి. పిల్లల విద్య, సంక్షేమం, స్థిరత్వం కోసం మా ప్రభావ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ఈ వార్షిక టీమ్ కామెరేడీ వేడుకలు మన వ్యక్తిగత, సామూహిక ఆకాంక్షలను బలపరుస్తూ ఆరోగ్యకరమైన జీవన స్ఫూర్తితో మనల్ని ఒకచోటకు చేర్చుతాయి అని దీపక్ మంగ్లా, సిఇఒ, కార్పొరేట్ సెంటర్స్, ఇండియా, ఫిలిప్పీన్స్, జెపి మోర్గాన్ చేజ్ అన్నారు.

## సరికొత్త లెమన్ హనీ ఫ్లేవర్‌ను పరిచయం చేస్తున్న సెంటర్ ఫ్రెష్




న్యూఢిల్లీ .. ఆహ్లాదకరమైన, స్వచ్ఛమైన శ్వాస అనగానే మనకు గుర్తుకు వచ్చేది సెంటర్ ఫ్రెష్. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ ఆనందంగా ఆస్వాదించే ఫ్లాగ్ షిప్ బబుల్ గమ్ సెంటర్ ఫ్రెష్. అలాంటి సెంటర్ ఫ్రెష్ నుంచి మరో సరికొత్త ఫ్లేవర్ వచ్చేసింది. పెర్ఫెట్టి వాన్ మెల్లె ఇండియా యొక్క ఫ్లాగ్‌షిప్ గమ్, మింట్స్ బ్రాండ్ అయినటువంటి సెంటర్ ఫ్రెష్... ఇప్పుడు లేటెస్ట్‌గా సెంటర్ ఫ్రెష్ మింట్స్ హనీ లెమన్ ఫ్లేవర్‌ను పరిచయం చేస్తోంది. ఈ కొత్త ఫ్లేవర్ తీపి, పులుపుల మిశ్రమంతో ఆహ్లాదకరమైన సమ్మేళనాన్ని అందిస్తుందని వాగ్దానం చేస్తుంది. అంతేకాకుండా, 60 నిమిషాల తాజా, ఆహ్లాదకరమైన తాజా శ్వాసను అందిస్తుంది. ఈ సందర్భంగా పీవీఎమ్ఐ మార్కెటింగ్ డైరెక్టర్ గుంజన్ ఖేతన్ మాట్లాడుతూ.. సెంటర్ ఫ్రెష్ అనేది మా ఫ్లాగ్‌షిప్ గమ్, మింట్స్ బ్రాండ్. ఇది తాజా, దీర్ఘకాల శ్వాసకు పర్యాయపదంగా మారింది. ఇప్పుడు తాజాగా లెమన్ హనీ ఫ్లేవర్‌ను ప్రారంభించడంతో, మా వినియోగదారులు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని మరోసారి నిజం చేసేందుకు, వారికి తాజా శ్వాస యొక్క ఆనందాన్ని అందిస్తున్నందుకు మేము చాలా సంతోషిస్తున్నాము. సెంటర్ ఫ్రెష్ మింట్స్ లెమన్ హనీ ఫ్లేవర్ 60 నిమిషాల పాటు శాశ్వతమైన తాజా శ్వాసను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా మా ప్రస్తుత కస్టమర్లను ఆహ్లాదపరచడమే కాకుండా ఫ్రూటీ రుచులను ఇష్టపడే కొత్త వారిని కూడా ఆకర్షిస్తుందని మేము నమ్ముతున్నాము. అని అన్నారు ఆయన.

## వినూత్న లెగసీ ప్లస్‌ను తీసుకువచ్చిన ఎడెల్విస్ టోకియో లైఫ్

ముంబయి, సమగ్ర కుటుంబ ప్రతిపాదన కోసం వినియోగదారుని అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎడెల్విస్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లెగసీ ప్లస్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఇది ఒకే ఉత్పత్తి ద్వారా ఇద్దరి (2)కి లైఫ్ కవర్ మరియు 3 తరాల ఆదాయాన్ని అందించే వినూత్నమైన ప్రొడక్ట్. చైల్డ్ ఫైనాన్షియల్ ప్లానింగ్, లెగసీ ప్లానింగ్, అది కొనసాగే వ్యవధిలో ఏవైనా అత్యవసర అవసరాలతో సహా, వినియోగదారుని వివిధ అవసరాల కోసం ఈ ప్రొడక్ట్ సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తుంది. ఫ్లెక్సిబిలిటీ, లిక్విడిటీని అందించాలనే ఉద్దేశ్యంతో, దీనిలో అక్రూవల్ ఆఫ్ సర్వైవల్ బెనిఫిట్ (ఐచ్ఛికం) ఫీచర్, ముందస్తు ఆదాయం ఉంటాయి. కొత్త ప్రొడక్ట్ గురించి ఎడెల్విస్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుబ్రజిత్ ముఖోపాధ్యాయ మాట్లాడుతూ, ఒక సగటు వ్యక్తికి సాధారణంగా 3-4 ప్రాథమిక ఆందోళనలు ఉంటాయి పిల్లల భవిష్యత్తు, పదవీ విరమణ, వారసత్వంతో పాటు ఏదైనా ఊహించని ఆకస్మిక పరిస్థితులు మొదలైనవి. ప్రతి ఒక్కరూ సరళమైన, సౌకర్యవంతమైన ఆర్థిక వ్యవస్థను కోరుకుంటారు.

ఈ అన్ని అవసరాలకు వియోగదారునికి లెగసీ ప్లస్ ద్వారా పరిష్కారం అందించే లక్ష్యాన్ని మేము కలిగి ఉన్నాము. ఇందులో వారు పలు ఆకాంక్షలను సమర్థవంతంగా నెరవేర్చుకునే పరిష్కారాలను కనుగొంటారు మరియు వారి ఆర్థిక అవసరాలు ఒకే ప్రొడక్ట్ ద్వారా చూసుకునే మొత్తం కుటుంబానికి మనశ్శాంతిని అందించగలరు అని వివరించారు.

## బైక్ ట్యాక్సీలను చట్టబద్ధం చేయాలి
# రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచన




బైక్ ట్యాక్సీల చట్టబద్ధతపై జరుగుతున్న చర్చకు ముగింపు పలికే ప్రయత్నంలో, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ జనవరి 22, 2024న ఒక సూచనను జారీ చేసింది. మోటారు వాహనాల చట్టం, 1988లోని సెక్షన్ 2(7) ప్రకారం కాంట్రాక్ట్ క్యారేజీల నిర్వచనం పరిధిలోకి మోటర్‌సైకిళ్లు వస్తాయని ఈ అడ్వైజరీ స్పష్టం చేసింది. భారతదేశంలోని పలు రాష్ట్రాలలో బైక్ టాక్సీ కార్యకలాపాలకు సంబంధించి నియంత్రణ విధాన సమస్య అనిశ్చితంగా ఉంది. గోవా, తెలంగాణ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లు వీటిని అనుమతించగా, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో నిషేధించారు. ఈ సూచనను, కార్యకలాపాలు ప్రారంభించిన నాటి నుండి నియంత్రణ అనిశ్చితులు, లైసెన్సింగ్ సమస్యలతో పోరాడుతున్న రాపిడో వంటి బైక్ టాక్సీ ఆపరేటర్లు స్వాగతిస్తున్నారు. గత దశాబ్దంలో భారతదేశంలోని టైర్ 2, టైర్ 3 నగరాల్లో ప్రజాదరణ పొందిన అతి తక్కువ ఖర్చుతో కూడుకున్న పరిష్కారం ఇప్పుడు నియంత్రణ అడ్డంకులు లేకుండా అభివృద్ధి చెందుతుంది. రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ, బైక్ టాక్సీ నియంత్రణపై జారీ చేసిన సూచనను మేము హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము, ఎందుకంటే ఇది మొత్తం పరిశ్రమకు చాలా అవసరమైన స్పష్టతను అందిస్తుంది. బైక్ టాక్సీలకు అనుమతులు మంజూరు చేయడానికి అన్ని రాష్ట్రాలు, యుటిలు దరఖాస్తులను స్వీకరించడం, ప్రాసెస్ చేయడం ప్రారంభిస్తాయని మేము ఆశిస్తున్నాము. క్రమబద్ధీకరించబడిన నిబంధనలు ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీ, ఉపాధి కల్పన, స్థిరమైన రవాణా పరంగా గ్రహించగలిగే ప్రభావ పరిధిని విస్తృతం చేస్తాయి. భారతదేశంలోని పలు ప్రాంతాలలో కొనసాగుతూనే ఉన్న క్లిష్టమైన ప్రయాణ సవాళ్లను గుర్తించడానికి, వాటిని పరిష్కరించేందుకు మేము కట్టుబడి ఉన్నాము. నిరంతర అభ్యాసం, ఆవిష్కరణలతో కూడిన ఈ ప్రయాణంలో మాకు సహాయం చేయడంలో ప్రభుత్వ మద్దతుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అని అన్నారు.

## టాలెంట్ డెవలప్‌మెంట్‌లో
# భారతీయ కంపెనీలకు లింక్డ్ ఇన్ ప్రాధాన్యత




టాలెంట్ డెవలప్‌మెంట్‌లో భారతీయ కంపెనీలకు లింక్డ్ ఇన్ ప్రాధాన్యత

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రొఫెషనల్ నెట్‌వర్క్ అయిన లింక్డ్ ఇన్ తన తాజా వర్క్‌ప్లేస్ లెర్నింగ్ రిపోర్ట్‌ను విడుదల చేసింది, ఇది భారతదేశంలోని 94% కంపెనీలు ఈ సంవత్సరం తమ ఉద్యోగుల నైపుణ్యాలు, సామర్థ్యాలను మెరుగుపరచాలని యోచిస్తున్నాయని పేర్కొంది, ఎందుకంటే ఏఐ పని ప్రపంచంను పునర్నిర్మించడం కొనసాగిస్తోంది. ఈ నివేదిక ప్రకారం, 2024లో భారత దేశపు లెర్నింగ్ డెవలప్‌మెంట్ నిపుణుల కోసం ఉద్యోగులకు అదనపు నైపుణ్యాలను అందించటం, వ్యాపార లక్ష్యాలకు అనుగుణంగా లెర్నింగ్ ప్రోగ్రామ్‌లను సమలేఖనం చేయడం, అభ్యాస సంస్కృతిని సృష్టించడం వంటివి దృష్టి సారించిన మూడు కీలక ప్రాంతాలుగా ఉన్నాయి. లింక్డ్ ఇన్ ఇండియాలోని టాలెంట్, లెర్నింగ్, ఎంగేజ్‌మెంట్ సొల్యూషన్స్ సీనియర్ డైరెక్టర్ రుచీ ఆనంద్ మాట్లాడుతూ గత సంవత్సరం, మేము లింక్‌డ్ ఇన్‌లో చాట్‌జిపిటి లేదా జిపిటిని ప్రస్తావిస్తూ జాబ్ పోస్టింగ్‌లలో 21 రెట్లు పెరుగుదలను చూశాము, వ్యాపారాలు ఏఐని అన్వేషించినందున టెక్ నైపుణ్యాల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ఇది ప్రతిబింబిస్తుంది. ఈ సంవత్సరం, ఏఐ యుగంలో నైపుణ్యాల వైపు దృష్టి మళ్లింది. మరీ ముఖ్యంగా సాంకేతిక, సాఫ్ట్ స్కిల్స్ రెండింటి పట్ల స్పష్టమైన మార్పును మేము చూస్తున్నాము. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ నైపుణ్యాలు 2030 నాటికి 68% మారుతాయని అంచనా వేయబడినందున, ఏఐ యుగంలో విజయవంతం కావడానికి సంస్థలకు ఈ బ్యాలెన్స్ కీలకం అని సర్వేలో పాల్గొన్న మెజారిటీ యజమానులు చెప్పడంతో పాటుగా టెక్నికల్ మరియు సాఫ్ట్ స్కిల్స్ రెండింటినీ నేర్చుకోవడంపై ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు... అని అన్నారు.

# డర్ట్ బైక్ రేస్‌లో టొయోటా హిలక్స్ థ్రిల్




బెంగళూరు : ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్ లీగ్‌తో తన అద్భుతమైన భాగస్వామ్యాన్ని టొయోటా కిర్లోస్కర్ మోటర్ కొనసాగిస్తోంది, తమ ప్రతిష్ఠాత్మకమైన హిలక్స్‌ను దాని అధికారిక వాహన భాగస్వామిగా ప్రదర్శిస్తోంది. భారతదేశంలో నిర్వహిస్తున్న ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్ లీగ్ ప్రపంచంలోని మొట్టమొదటి ఫ్రాంఛైజీ-ఆధారిత సూపర్‌క్రాస్ లీగ్ గా గుర్తించబడింది. ప్రతిష్ఠాత్మక హిలక్స్ మరపురాని అనుభవాలను సృష్టిస్తూ, ప్రేక్షకులను ఆకర్షించింది, దేశవ్యాప్తంగా మోటర్‌స్పోర్ట్స్, ఆటోమొబైల్ ఔత్సాహికులకు కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేసింది. వరుసగా పూణే (జనవరి 2024), అహ్మదాబాద్ (ఫిబ్రవరి 2024)లో జరిగిన మొదటి, రెండవ రౌండ్ల తరువాత, ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్ లీగ్ తన మూడవ దశను ఫిబ్రవరి 25, 2024న బెంగుళూరులోని చిక్కజాల ఓపెన్ గ్రౌండ్ (ఎయిర్‌పోర్ట్ రోడ్)లో ముగించింది, ఈ చివరి రౌండ్‌కు 7000+ పైగా అభిమానుల పాల్గొనడంతో అపూర్వ విజయం సాధించింది. భారతదేశంలో ఆఫ్-రోడింగ్‌కు పెరుగుతున్న ప్రజాదరణ వెల్లడించింది. ఈభాగస్వామ్యం గురించి టొయోటా కిర్లోస్కర్ మోటర్ , సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ, టొయోటా కిర్లోస్కర్ మోటర్ మోటర్‌స్పోర్ట్ ఔత్సాహికులకు అసమానమైన అనుభవాన్ని అందిస్తుంది. ఈ డైనమిక్ భాగస్వామ్యం, ఆఫ్-రోడింగ్ కార్యక్రమాలు ద్వారా మా విలువైన కస్టమర్లతో శాశ్వత సంబంధాలను ఏర్పరుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మోటర్‌స్పోర్ట్స్‌లో మా అనుబంధానికి గొప్ప చరిత్ర ఉంది. టొయోటా హిలక్స్‌లో అధికారిక వాహన భాగస్వామిగా ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్ లీగ్‌కు మా మద్దతును అందించడానికి మేము సంతోషిస్తున్నాము. .... కేవలం డర్ట్ ట్రాక్లను సృష్టించడం, బైక్‌లను సమీకరించడం మాత్రమే కాకుండా, రేసింగ్ ఈవెంట్లో దాని ఆనందకరమైన చర్యలతో మరపురాని క్షణాలను కూడా సృష్టించిందన్నారు.

# విశేషమైన వృద్ధిలో గూడీబాగ్



నవంబర్ 2023 నుండి, గూడీబ్యాగ్ దాని కీలక ప్రమాణాలలో స్థిరమైన వృద్ధిని సాధించింది. నవంబర్లో, కంపెనీ 21,835 కిలోగ్రాముల ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేసింది, 2,500 వ్యర్థాలను పికప్లను నిర్వహించింది, 160 మంది కొత్త కస్టమర్లను సంపాదించుకుంది. డిసెంబరులో, రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ల సంఖ్య 22,308 కిలోగ్రాములు, 2,650 వ్యర్థాలను సేకరించడం, 180 కొత్త కస్టమర్లకు పెరిగింది. జనవరి 2024లో, గూడీబ్యాగ్ 20,234 కిలోగ్రాముల ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తూ, 2,550 వ్యర్థ పదార్థాల సేకరణను నిర్వహించి, 140 మంది కొత్త కస్టమర్లను సంపాదించుకుంది. జనవరి నాటికి మొత్తం 3,500 కొత్త కుటుంబాలు దాని నెట్‌వర్క్‌ను జోడించబడ్డాయి, గూడీబాగ్ స్థిరమైన వ్యర్థ పదార్థాల నిర్వహణ పరిష్కారాలలో అగ్రగామిగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ఈ విజయం గురించి మాట్లాడుతూ, వ్యవస్థాపకుడు సిఈఓ అభిషేక్ అగర్వాల్ సంఘం వారి నిరంతర మద్దతు కోసం కృతజ్ఞతలు తెలిపారు. స్థిరమైన వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతుల యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మా కస్టమర్ బేస్, వ్యర్థాల సేకరణ రెండింటిలోనూ ఇటువంటి గణనీయమైన వృద్ధిని చూసి మేము సంతోషిస్తున్నాము. పర్యావరణ సుస్థిరత పట్ల పెరుగుతున్న అవగాహన, నిబద్ధతకు ఇది నిదర్శనం. హైదరాబాద్‌ను క్లీనర్, గ్రీన్‌గా మార్చాలనే మా మిషన్‌కు మేము అంకితభావంతో ఉన్నాము. అని అన్నారు.

# సాలిటైర్ బిజినెస్ స్కూల్‌తో చేతులు కలిపిన పియర్సన్ బిటెక్

ప్రపంచంలోని ప్రముఖ లెర్నింగ్ కంపెనీ అయిన పియర్సన్, బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పియర్సన్ బిటెక్ హయ్యర్ నేషనల్స్ ప్రోగ్రామ్‌లను, క్రీడలు, ఫిట్నెస్ ఇన్‌స్ట్రక్టింగ్, వ్యక్తిగత శిక్షణ, మార్కెటింగ్, బిజినెస్‌లో కోర్సులను అందించడానికి హైదరాబాద్‌లోని ప్రముఖ విద్యా సంస్థ సొలిటైర్ బిజినెస్ స్కూల్‌తో భాగస్వామ్యం చేసుకున్నట్టు వెల్లడించింది. పియర్సన్ బిటెక్‌లు వృత్తి నైపుణ్య అర్హత కార్యక్రమాలు. వీటిని పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలు, యజమానులతో చేసిన సంప్రదింపులతో అభివృద్ధి చేయబడ్డాయి, వివిధ పరిశ్రమలు, రంగాలలో విభిన్నమైన అర్హతలను ఎంప్లాయర్స్ అందిస్తున్నారు. సాలిటైర్ బిజినెస్ స్కూల్ చైర్పర్సన్ మీర్ ముర్తుజా అలీ మాట్లాడుతూ, అర్హత, అభ్యాస పరిష్కారాలలో అపార నైపుణ్యంను పియర్సన్ తెస్తుంది. వారి పాఠ్యాంశాలు, ప్లాట్‌ఫారమ్‌లు, ఎస్సెస్‌మెంట్స్ ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థలచే విస్తృతంగా గౌరవించబడతాయి. ఉపయోగించబడతాయి. పియర్సన్ యొక్క నైపుణ్యం, విద్యార్థుల విజయానికి సాలిటైర్ బిజినెస్ స్కూల్స్ యొక్క తిరుగులేని నిబద్ధతతో, ఈ భాగస్వామ్యం మాకు అద్భుతమైన ప్రపంచ అవకాశాలకు తలుపులు తెరుస్తుందని నేను విశ్వసిస్తున్నాను... అని అన్నారు.



### చెన్నై హైపర్‌స్కేల్ డేటా సెంటర్ పార్క్‌ను ఆవిష్కరించిన క్ట్రిల్స్

ఆసియాలోనే అతిపెద్ద రేటెడ్-4 డేటాసెంటర్ ఆపరేటర్ క్ట్రిల్స్ డేటా సెంటర్స్ లిమిటెడ్, ముంబై, హైదరాబాద్, నోయిడా, బెంగళూరు తర్వాత భారతదేశంలో తమ ఐదవ హైపర్‌స్కేల్ డిసి క్యాంపస్ - చెన్నైలో తమ రాబోయే డేటా సెంటర్ పార్క.... ఆవిష్కరించింది. క్ట్రిల్స్ డేటాసెంటర్లు చెన్నై డేటాసెంటర్ పార్క్‌లో దశలవారీగా రూ. 4,000 కోట్లు పెట్టుబడి పెడతాయి. కంపెనీ దాదాపు 500 ప్రత్యక్ష ఉద్యోగాలు, 9,000 పైగా పరోక్ష ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉంది. అంబత్తూరు పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఈ క్యాంపస్‌లో దాదాపు 1 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణం రెండు డేటాసెంటర్ భవనాలు ఉంటాయి. ఈ సందర్భంగాక్ట్రిల్స్ డేటాసెంటర్స్ వ్యవస్థాపకుడు శ్రీధర్ పిన్నపురెడ్డి మాట్లాడుతూ, మా రాబోయే చెన్నై డిసి పార్కు ఆవిష్కరించడం మాకు ఆనందంగా ఉంది. చెన్నై భారతదేశంలో రెండవ అతిపెద్ద డేటాసెంటర్ మార్కెట్, పెద్ద సంఖ్యలో ఉన్నందున వ్యూహాత్మక ప్రాముఖ్యతను కలిగి ఉంది. సబ్సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు, ఈ ప్రాంతంలో పెరుగుతున్న ఎంటర్‌ప్రైజెస్, క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్ల ఉనికిని కలిగి ఉందన్నారు.

### రామానాయుడు స్టూడియోస్‌లో రెడ్ బుల్ సోప్‌బాక్స్ రేస్




హైదరాబాద్ : దేశంలో అత్యంత ఆకర్షణీయమైన, సృజనాత్మక రేస్ ఈవెంట్ కోసం టిక్కెట్లు ప్రత్యక్ష ప్రసారం చేయబడ్డాయి. రెడ్ బుల్ సోప్‌బాక్స్ రేస్ యొక్క మూడవ ఎడిషన్‌గా ఇండియాలో అద్భుతమైన పున రాగమనం ప్రేక్షకులను వారి కాలి మీద ఉంచు తుంది. రెడ్ బుల్ సోప్‌బాక్స్ రేస్, సృజనాత్మకత, వేగం, ఆవిష్కరణలను పరిమి తులకు నెట్టివేసే ఐకానిక్ ఈవెంట్, హైదరాబాద్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి సిద్ధంగా ఉంది. ఈ లెజెండరీ ఈవెంట్‌లో భాగం కావడానికి మీ అవకాశాన్ని కోల్పోకండి. ఇప్పుడే మీ టిక్కెట్లను భద్రపరచుకోండి, జీవితకాల ప్రయాణం కోసం సిద్ధం చేసుకోండి! భారతదేశంలో రెడ్ బుల్ సోప్‌బాక్స్ రేస్ యొక్క మూడవ ఎడిషన్ మునుపటి కంటే క్రేజీగా ఉంటుందని వాగ్దానం చేయబడినందున గేర్ హెడ్‌లు, ప్రేక్షకులు టిక్కెట్లను పొందవచ్చు . 23 వివిధ రాష్ట్రాల నుండి భారతదేశం అంతటా 3300 రిజిస్ట్రేషన్ల నుండి, 30 షార్ట్‌లిస్ట్ చేసిన టీమ్‌లు, వారి బండ్లు రామానాయుడు స్టూడియోస్, ఫిల్మ్ నగర్ హైదరాబాద్ వాలులలో నడపడానికి సిద్ధంగా ఉన్నాయి, మార్చి 3, 2024న రామానాయుడు స్టూడియోస్, ఫిల్మ్ నగర్, జూబ్లీహిల్స్‌లో సాయంత్రం 5:00 గంటల నుండి జరగాలని షెడ్యూల్ చేయబడింది, ఈ సంవత్సరం ఎడిషన్ మునుపటి కంటే పెద్దగా, మెరుగ్గా ఉంటుందని హామీ ఇచ్చింది. రెడ్ బుల్ సోప్‌బాక్స్ రేస్ యొక్క విచిత్రమైన ప్రపంచంలో, ఆవిష్కరణ కొన్ని హాస్యంతో పాటు డ్రైవర్ సీటును తీసుకుంటుంది. జీవితంలోని అన్ని వర్గాల నుండి పాల్గొనేవారు వారి స్వంత నాన్-మోటరైజ్డ్ సోప్‌బాక్స్ వాహనాలను రూపొందించడం, నిర్మించడం ద్వారా వారి సృజనాత్మకతను ప్రదర్శిస్తారు.

### మారుతీ సుజుకి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల నడుమ భాగస్వామ్యం



న్యూఢిల్లీ : ఇన్‌వెంటరీ ఫండిం గ్ కోసం మారుతీ సుజు కి ఇండియా లిమిటెడ్జు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త కూటమి దేశవ్యాప్తంగా ఉన్న 4000 మారుతి సుజుకి విక్రయ కేంద్రాలకు సమగ్ర ఇన్వెంటరీ నిధుల ఎంపికలను మరింత మెరుగుపరుస్తుంది. సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ, మార్కెటింగ్ సేల్స్, మిస్టర్ నోబుటకా సుజుకి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ -మార్కెటింగ్ సేల్స్, మిస్టర్ భువన్ ధీర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ - సేల్స్ నెట్‌వర్క్ విశాల్ శర్మ సమక్షంలో ఎంఓయుపై సంతకాలు జరిగాయి. జనరల్ మేనేజర్ మారుతీ సుజుకి నుండి అనుబంధ వ్యాపారం, ఏ మణిమేఖలై, మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ రామ సుబ్రమణియన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సంజయ్ రుద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నితేష్ రంజన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిధు సక్సేనా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రెండు సంస్థల నుండి ఇతర సీనియర్ సభ్యులు హాజరయ్యారు.

### టాటా మోటార్స్ నేతృత్వంలో నిశ్శబ్ద 'శ్వేత విప్లవం'



టాటా మోటార్స్ విశేషమైన సహకారంతో,, అహ్మదాబాద్ డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్, గుజరాత్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్, సనంద్, చుట్టుపక్కల ప్రాంతాలలో కొత్త శ్వేత విప్లవంకి తెరలేపాయి. ఈ చొరవ లబ్ధిదారులకు సామాజిక- ఆర్థిక పరివర్తనను ఉత్ప్రేరకపరిచింది, విద్య, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలకు మెరుగైన ప్రాప్యతతో వారి జీవితాలను సుసంపన్నం చేసింది. సమాజంలో వారి స్థాయిని పెంచింది. సాంకేతికత, సహకార సంఘాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా, సనంద్ సుదూర ప్రాంతాలకు చెందిన 1600 మందికి పైగా మహిళలు గుజరాత్ గ్రామీణ సామాజిక, ఆర్థిక పరిస్థితులలో విశేషమైన మార్పును తీసుకొచ్చారు. టాటా మోటార్స్ సిఎస్ఆర్ హెడ్ వినోద్ కులకర్ణి, మాట్లాడుతూ టాటా మోటార్స్‌లో మా మిషన్ కేవలం ప్రాజెక్ట్ ఎగ్జిక్యూషన్ యొక్క పరిమితులను మించిపోయింది. మేము సేవలందించే ప్రత్యేకత కలిగిన కమ్యూనిటీల్లో మార్పు మరియు అభివృద్ధిని కొనసాగించడానికి మేము ఉత్ప్రేరకాలుగా చూస్తాము. మా డైరీ కార్యక్రమాలు ఆశ, పరివర్తనను పెంపొందించడంలో మా అచంచలమైన నిబద్ధతను ఉదాహరణగా చెప్పండి. సమాజాన్ని దాని ప్రధానాంశంగా సాధికారత, సానుకూల ప్రభావాన్ని నిరంతరం పెంపొందించడానికి మేము అంకితభావంతో ఉన్నాము. అహ్మదాబాద్ జిల్లా కో-ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్, గుజరాత్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్‌లో మా వ్యూహాత్మక భాగస్వామ్యం వీటిని ముందుకు తీసుకెళ్లడంలో కీలకమైనది. పరివర్తనాత్మక ప్రయత్నాలు, గణనీయమైన మార్పు చేయడానికి మాకు శక్తినిస్తాయన్నారు.

## వైఎస్సార్ చనిపోతే జగన్‌కు సీఎం పదవి : కాంగ్రెస్ నేత బండ్ల గణేష్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: టాలీవుడ్కు చెందిన ప్రముఖ నిర్మాత, తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేష్ విమర్శలకు కేంద్ర బిందువు అయ్యారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి ఆర్ కే రోజాపై మంగళవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దీన్ని తిప్పికొడుతున్నారు.హైదరాబాద్ గాంధీభవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు బండ్ల గణేష్. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై గతంలో రోజా చేసిన విమర్శల గురించి విలేకరులు ప్రస్తావించగా.. దీనికి ఘాటుగా బదులిచ్చారు. రేవంత్ రెడ్డిని పోరాట యోధుడిగా, రోజాను డైమండ్ రాణిగా, ఐటమ్ రాణిగా అభివర్ణించారు.వచ్చే ఎన్నికల్లో రోజాకు టికెట్ వస్తుందో? రాదో.. అనేది అనుమానమేనంటూ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డిని యాక్సిడెంటల్ సీఎంగా రోజా చెప్పడాన్ని బండ్ల గణేష్ తప్పుపట్టారు. యాక్సిడెంటల్ సీఎం రేవంత్ రెడ్డి కాదని.. ఆమె ఏ ముఖ్యమంత్రి వద్ద మంత్రి పని చేస్తోన్నారో.. ఆయనే యాక్సిడెంటల్ సీఎం అని వైఎస్ జగన్ను ఉద్దేశించి విమర్శించారు.నాన్న గారు చనిపోవడం వల్లో, లేక వాళ్ల వారసత్వంగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి రాలేదని బండ్ల గణేష్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ఓ పోరాట యోధుడంటూ కితాబిచ్చారు. దేశం మొత్తం మీద రేవంత్ రెడ్డి వంటి పోరాట యోధులు చాలా తక్కువ మంది ఉంటారని బండ్ల గణేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకుని రావడానికి ఎంతో పోరాడాడని, కష్టపడ్డాడని ప్రశంసించారు.వులుసు వండి పెట్టడం వల్ల రోజాకు మంత్రి పదవి వచ్చిందంటూ సెటైర్లు వేశారు బండ్ల గణేష్. ఈ ఎన్నికల తరువాత వైఎస్ జగన్, రోజా మాజీ అవుతారని జోస్యం చెప్పారు. హైదరాబాద్కు వచ్చి పగలు జబర్దస్త్ షూటింగ్స్, రాత్ర వులుసు వండిపెట్టే కార్యక్రమాలు పెట్టుకోవాలని అన్నారు. రేవంత్ రెడ్డిని విమర్శించేంత స్థాయి రోజాకు లేదని చెప్పారు.



# 'గగన్ యాన్' ద్వారా
## అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు

● పేర్లు వెల్లడించిన ప్రధాని నరేంద్ర మోడీ
● 'గగన్ యాన్' భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టనున్న ప్రయోగం





న్యూఢిల్లీ... అంతరిక్ష రంగంలో ప్రపంచ దేశాల సరసన భారత్ సగర్వంగా తలెత్తుకుని నిలబడుతున్న విషయం తెలిసిందే. అనేక ప్రయోగాల్లో భారత్.. అమెరికా, చైనా సహా పలు దేశాలకు దీటుగా దూసుకుపోతోంది. చంద్రయాన్ . వంటి కీలక ప్రయోగాలతో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. అయితే.. మానవులను అంతరిక్షంలోకి పంపించడం అనేది మాత్రం ఇప్పటి వరకు భారత్కు సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో గత మూడేళ్లుగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఆ దిశగా దృష్టి పెట్టింది. ఈ క్రమంలో మిషన్ 'గగన్యాన్' ను ప్రకటించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాదిన్నర కిందటే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో యుద్ధ ప్రాతిపదికన ఇస్రో తన వ్యూహాన్ని కార్యాచరణలోకి తీసుకువచ్చింది. ఈ ప్రయోగం వాస్తవానికి ఈ ఏడాది చివరి నాటికే చేపట్టాల్సి ఉంది. అయితే.. కొన్ని కారణాలతో దీన్ని వచ్చే ఏడాదికి వాయిదా వేశారు.

**తాజాగా ఏం జరిగింది?** దేశం సగర్వంగా భావిస్తున్న గగన్యాన్ ప్రయోగం ద్వారా.. అంతరిక్షంలోకి వెళ్లే.. వ్యోమగాములను ఇప్పటికే ఎంపిక చేశారు. తాజాగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారి పేర్లను ప్రకటించారు. కేరళలో పర్యటిస్తున్న ప్రధాని మోడీ.. తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని వారిని పరిచయం చేస్తూ.. స్టాండింగ్ ఒవేషన్తో సత్కరించారు.

**ఆ నలుగురూ వీరే**

1) ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్
2) అంగద్ ప్రతాప్
3) అజిత్ కృష్ణన్
4) వింగ్ కమాండర్ సుభాన్షు శుక్లాలు వ్యోమనౌక()లో అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. వీరంతా కూడా భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు కావడం, సుదీర్ఘ అనుభవం(12 సంవత్సరాల పైబడి) ఉండడంతో వీరిని అన్ని కోణాల్లోనూ పరీక్షించి ఎంపిక చేశారు. వీరి పేర్లను తాజాగా ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారు. కాగా, భారత నేల నుంచి స్వదేశీ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్న మొదటి భారతీయ బృందంగా వీరు ఘనత దక్కించుకోనున్నారు.

**'140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిరూపం'** తిరువనంత పురంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడారు. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ నుంచి మరొక చరిత్రాత్మక ప్రయాణాన్ని వీక్షించనున్నాం. ఈ రోజు నలుగురు వ్యోమగాములు భారత్కు పరిచయమయ్యారు. ఇవి నాలుగు పేర్లు కాదు. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే శక్తులు. 40 ఏళ్ల తర్వాత మరోసారి భారతీయుడు అంతరిక్షంలోకి వెళ్తున్నాడు. అయితే ఈసారి కౌంట్డౌన్ మనదే. రాకెట్ మనదే అంటూ ప్రధాని వారిని కొనియాడారు. ఇక, మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతున్న తరుణంలో.. గగన్యాన్ మన అంతరిక్ష రంగాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చనుందని ప్రధాని తెలిపారు. ఈ రంగంలో భారత 'నారీ శక్తి' కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. మహిళా శాస్త్రవేత్తలు లేకుండా చంద్రయాన్, గగన్యాన్ వంటి మిషన్లను ఊహించుకోలేమన్నారు. ఇదిలావుంటే.. భారత అంతరిక్ష రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఇలాంటి ప్రయోగాలు మరిన్ని పెరిగే అవకాశం ఉందని ప్రధాని పేర్కొన్నారు.

**రష్యా శిక్షణలో..** భారత్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లనున్న నలుగురు వ్యోమగాములకు కొద్దికాలం రష్యాలో శిక్షణ ఇచ్చారు. తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రష్యా అంతరిక్ష సంస్థ రోస్కాస్మోస్ వారిని సుశిక్షితులను చేసింది. ప్రస్తుతం స్వదేశంలో ఇస్రో వారిని మరింతగా తీర్చిదిద్దుతోంది. 2025లో జరిగే ఈ యాత్ర కోసం వారు నిరీక్షిస్తున్నారని గతంలో ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. వారిని రోదసిలోకి పంపి, మూడు రోజుల తర్వాత భూమికి తీసుకురావడం ఈ యాత్రలో కీలకాంశమని తెలిపారు. ఈ మిషన్ సాంతం వారు ఎలాంటి అస్వస్థతకు గురికాకుండా చూసేందుకు శారీరక దృఢత్వం కోసం శిక్షణ ఇచ్చారు.

**గతంలోనూ..** గతంలో కూడా రాకేశ్శర్మ భారత్ తరఫున అంతరిక్షంలోకి వెళ్లారు. క్షేమంగా తిరిగి వచ్చారు.అంతేకాదు.. భారత్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లిన తొలి వ్యోమగామిగా రికార్డు సాధించారు. కానీ, ఆయన భారతీయుడే అయినా.. ఆయన పాల్గొన్న ప్రయోగం.. మాత్రం రష్యా చేపట్టింది. అప్పట్లో భారత్ అనుమతి మేరకు రాకేశ్ శర్మ అంతరిక్షానికి వెళ్లి వచ్చారు. కానీ, ఇప్పుడు తొలిసారి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన యాత్రద్వారా.. భారతీయులు వెళ్తుండడం గమనార్హం.

## ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు

**సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై హరీష్ రావు మండిపాటు**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్:ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదని ప్రజా సంక్షేమంలో లాభ నష్టాలు చూసుకోరని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.ప్రజల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కోసం పెట్టే ఖర్చులో కూడా లాభం తీయాలనుకునేవారు వ్యాపారులు అవుతారు తప్ప పాలకులు కారనీ మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు.మిషన్ భగీరథలో లాభం వెతికేవాడు ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టకరం. ప్రజలకు నిరంతరం సురక్షితమైన మంచినీరు అందించాలనే గొప్ప ఉద్దేశ్యంతో కేసీఆర్ గారి ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని తెచ్చింది.దేశంలో ఎవరికీ సాధ్యం కాని విధంగా వంద శాతం ఇండ్లకు నల్లాల ద్వారా సురక్షితమైన మంచినీటిని సరఫరా చేయడం సాధ్యమయింది.ఇది ప్రభుత్వానికి లాభం తెచ్చే పని కాదు కాబట్టి, ఈ మిషన్ భగీరథ దండుగ అని రేవంత్ రెడ్డి మాట్లాడడం అత్యంత శోచనీయం. మిషన్ భగీరథ కోసం మా ప్రభుత్వం రూ. 35 వేల కోట్లు ఖర్చు చేస్తే, దాన్ని రూ. 50 వేల కోట్లకు పెంచి చెబుతున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి గారికే దక్కుతుంది.మిషన్ భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని, దానికి తెచ్చిన అప్పుకు వడ్డీ ఎలా కడుతారని రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యమైన, భావ దారిద్ర్యమైన ఆరోపణ ఇంకోటి ఉండదు.అసలు మిషన్ భగీరథ పథకం ఎందుకు తేవాల్సి వచ్చింది? దాని లక్ష్యం ఏమిటి? అనే విషయాలపై కనీస అవగాహన కూడా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి లేకపోవడం బాధాకరం.తెలంగాణ రాకముందు తెలంగాణ రాష్ట్రంలో మంచినీటి సౌకర్యం కలిగిన జనావాసాల సంఖ్య కేవలం 5,672 అయితే, 2023 పూర్తయ్యే నాటికి 23,930 ఆవాస ప్రాంతాలకు మంచినీళ్లు అందుతున్నాయి అని హరీష్ రావు గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రం వందకు వందశాతం నల్లాల ద్వారా మంచినీరు ఇచ్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిందని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్ సాక్షిగా వెల్లడించింది. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలి తప్ప, అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని నేను సలహా ఇస్తున్నా.ఇక మాట్లాడితే, కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు పెట్టారు కానీ, ఫలితం లేదని విమర్శిస్తున్నారు. 2014కు ముందు కేవలం 30 శాతం ఇండ్లకు మాత్రమే నల్లాల ద్వారా మంచినీటి సౌకర్యం ఉండేదని,అదిప్పుడు వంద శాతానికి చేరుకుందన్నారు.గిరిజన తండాలు, గోండు గూడాలు, ఆదివాసీ పల్లెలకు మంచినీటి సౌకర్యం లేక ప్రతీ ఏడాది వర్షాకాలంలో విష జ్వరాలు, అంటు రోగాలు, కలుషిత నీటితో అనేక మంది మరణించేవారన్నారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందడం వల్ల నేడు మారుమూల ప్రాంతాల్లో కూడా ప్రజలు సురక్షిత మంచినీరు తాగుతున్నారనీ,సురక్షితమైన మంచినీరు అందుబాటులో లేకపోవడం వల్లనే ప్రజలు ఆనేక వ్యాధుల బారిన పడుతున్నట్లు డబ్ల్యు.హెచ్.వో. ప్రకటించిందన్నారు. ప్రాణహిత– చేవెళ్లను కాదని కాళేశ్వరం కట్టారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని మేము అసెంబ్లీలో చాలా స్పష్టంగా సాక్ష్యాలు, ఆధారాలతో సహా వివరించాం.ఇక పాడిందే పాటరా అన్నట్లు ప్రతీసారి అప్పుల ముచ్చట చెబుతారు.సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వం, ఆర్.బి.ఐ. కూడా తెలంగాణ రాష్ట్రం పరిమితికి లోబడే అప్పులు చేశాయని చాలాసార్లు స్పష్టం చేశాయిఅని హరీష్ రావు పేర్కొన్నారు.

## సుశీలకు భారత రత్న ఇవ్వాలి



తెలంగాణ బ్యూరో ప్రతినిధిహైదరాబాద్ :హైదరాబాద్ పట్టణంలోని రవీంద్రభారతిలో గాన కోకిల పి. సుశీల కు మెలోడీ క్వీన్ ఆఫ్ ది మ్యూజిక్ అవార్డ్ ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు . పి సుశీల ని ఘనంగా సత్కరించి అవార్డును ప్రదానోత్సవం చేశారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పి. సుశీల ఎంతో గొప్ప ఖ్యాతిని పొందారని, ఆమె తెలుగు జాతి సంపదగా అభివర్ణించారు. అన్ని భాషల్లో దాదాపు 50.000 పాటలను పాడిన ఆమె ప్రజల నోట్లో నాలుకగా మారారని అన్నారు. ఆమెకు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్ కు మద్దతును ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా , తదితరులు కూడా పాల్గొన్నారు .

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

● ప్రాణాలు కోల్పోయిన నలుగురు మావోయిస్టులు ● భద్రతా బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం



బీజాపూర్ .. ఛత్తీస్గఢ్లో మరోసారి భారీ ఎన్కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలోని చోటే తుంగాలి అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్కౌంటర్లో నలుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. భారీ ఎన్కౌంటర్ చోటు చేసుకోవడంతో ఆ ప్రాంతంలో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టింది. ఆ ప్రాంతంలో ఇంకా ఎవరైనా మావోయిస్టులు దాగి ఉన్నారా? అనే అనుమానంతో సెర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టారు. ఎలాంటి అనుమానాస్పద కదలికలు కనిపించినా వదలకుండా గాలిస్తున్నారు పోలీసులు. చోటే తుంగాలి అటవీ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్, సిఆర్పిఎఫ్ జవాన్లు ఉదయం 11 గంటలకు జాయింట్ ఆపరేషన్ చేశారు. ఈ క్రమంలోనే జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో పోలీసుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు వారు కాల్పులు చేశారని పోలీసులు మీడియాకు తెలిపారు. దీంతో తాము కూడా ఎదురుకాల్పులు జరిపినట్లు తెలిపారు. ఈ కాల్పుల్లో నలుగురు మావోయిస్టులను మృతి చెందినట్లు పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఘటనాస్థలం నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మృతదేహాలను కూడా గుర్తించినట్లు తెలిపారు.

సోమవారం పోలీసులకు ఓ మావోయిస్టు లొంగిపోయాడు. ఆ మరుసటి రోజే ఈ ఎన్కౌంటర్ జరగడం ఎన్నో అనుమానాలకు దారి తీసింది. లొంగిపోయిన మావోయిస్టుపై రూ.8 లక్షల రివార్డు ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఇక ఇటీవల సుక్మా జిల్లాలో జరిగిన ఎన్కౌంటర్లో ఒకరు చనిపోగా.. ఆ తర్వాత ఆదివారం కాంకేర్ జిల్లాలో జరిగిన మరో ఎన్కౌంటర్లో మరో ముగ్గురు హతమైనట్లు పోలీసులు మీడియాకు వివరించారు. బుర్కలంక అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, డీఆర్జీ జవాన్లకు మధ్య ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్ట్ చనిపోయాడని అన్నారు.ఆదివారం రోజు ఉదయం కాంకేర్ జిల్లాలోలోని కోయలిబేడా అటవీ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ , బీఎస్ఎఫ్ జవాన్లు గాలింపు చర్యలు చేపట్టగా.. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య కాల్పులు జరిగాయి. దీంతో ముగ్గురు మావోయిస్టులు మరణించారని జిల్లా ఎస్పీ ఇందిర కల్యాణ్ తెలిపారు. సంఘటనా స్థలంలో ముగ్గురి మృతదేహాలతోపాటు 2 తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ ముగ్గురు మృతి చెందడంపై వారి కుటుంబ సభ్యులు మాత్రం వేరే వాదనను వినిపిస్తున్నారు. అసలు ఆ ముగ్గురు మావోయిస్టులే కాదని వారి కుటుంబాలు చెప్పడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలీసులు ఫేక్ ఎన్కౌంటర్ చేసి.. సామాన్యులను కాల్చి చంపి.. అది నక్సల్స్ ఏరివేత అని చెబుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. దీంతో అసలు వాళ్లు మావోయిస్టులా లేక సాధారణ పౌరులా అని చర్చకు అక్కడ జోరందుకుంది.

# కాళేశ్వరంపై సర్కార్ కుట్ర

● మరమ్మతులపై నోరుమెదపని రేవంత్ రెడ్డి ● మమ్మల్ని బదనాం చేసేందుకే కాలయాపన
● తక్షణమే కాపర్ డ్యాంతో మరమ్మతులు చేపట్టండి ● రెండు నెలలలోనే పనులు పూర్తి చేయొచ్చు
● మార్చి ఫస్టున చలో కాళేశ్వరం ● తెలంగాణకు ఎత్తిపోతలే శరణ్యం
● కాస్ట్ బెనిఫిట్ చూడడం సరికాదు ● కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను తప్పు పట్టిన మాజీ మంత్రి కేటీఆర్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. మరమ్మతులకు మేడిగడ్డ వద్ద అవకాశం ఉన్నప్పటికీ ఆదేశాలు ఇవ్వకుండా మీనమేషాలు లెక్కిస్తున్నదని ఆరోపించారు.

కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. తెలంగాణ భవన్లో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. ఆయన మాట్లాడుతూ నిన్న ముఖ్యమంత్రి మాట్లాడుతుంటే ఆశ్చర్యం అనిపించిందని,వర్షాలు బాగాపడ్డాయని ఒకాయన,బోర్వెల్స్ పెరిగాయని ఒకాయన అనడం విడ్డూరంగా ఉన్నదని వ్యాఖ్యానించారు.రైతులు బోర్వెల్స్ ఎప్పుడు వేస్తరు? భూగర్భజలాలు పెరిగితేనే కదా? భూగర్భజలాలు పెరుగకపోతే కొత్త బోర్లు వేస్తరా? భూగర్భ జలాలు పెరిగినయ్.. చెరువులు నిండినయ్. వాగులు నిండినయ్ కాబట్టే ఇవాళ ఈ జలవిజయాలు కాళేశ్వరం వుణ్యం అనే మాట నేను రైతులకు చెబుతున్నా. కాళేశ్వరం కింద ఉండే బరాజ్లు, రిజర్వాయర్లు నిండిన ఫలితం.. భూగర్భ జలాలు వుష్కలంగా పెరిగిన ఫలితం అని కేటీఆర్ తెలిపారు.సిరిసిల్లలో ఆరు మీటర్లు భూగర్భ జలాలు పెరిగాయనీ,కాళేశ్వరంలో భాగంగా మిడ్ మానేరు జంక్షన్గా మారిన మా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆరు మీటర్లు భూగర్భ జలాలు పెరిగాయని, ఈ విషయాన్ని లాల్ బహదూర్శాస్త్రి నేషనల్ అకాడమీ తెలిపిందన్నారు. వాటర్ కాన్జర్వేషన్ మీద కాళేశ్వరం ప్రాజెక్టు క్లాసిక్ ఎగ్జాంపుల్ అని పాఠాలుచెప్పే స్థాయికి కాళేశ్వరం ద్వారా సాధించిన విజయం, రిజిస్టర్ అయిన విషయాన్ని గుర్తు చేస్తున్నాం అన్నారు. కాళేశ్వరంతో పాతాళగంగ పైకి వచ్చిందనీ,హైదరాబాద్కు మంచినీళ్ల కరువు అనే లేకుండా భరోసా ఇచ్చిన అమృత వాహిని కాళేశ్వరమని, దీనిపై ఇవాళ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నరు అంటూ మండిపడ్డారు. అసెంబ్లీలో రిపోర్టు పెట్టారు. తెలంగాణలో ప్రత్యామ్నాయం లేదు. కాస్ట్ బెనిఫిట్.. బెనిఫిట్ టూ కాస్ట్, వయోబులిటి అని మాట్లాడితే అర్థం ఉంటుంది. తెలంగాణలో ప్రత్యామ్నాయం లేదు. నీళ్లు కావాలంటే ఎత్తిపోయాల్సిందే తప్ప వేరే మార్గం లేదు. పబ్లిక్ యుటిలిటీ.. లక్షల, కోట్ల మంది ప్రజలకు సంబంధించిన జీవితాలతో ముడిపడి ఉన్న ప్రాజెక్టులకు.. ఇవాళ కొందరు మాట్లాడే మాటలు.. వయోబులిటి ఉందా? లేదా? పాయింట్ ఏంటంటే.. కాళ్లు అడ్డం పెడితే నీళ్లు వచ్చే పరిస్థితి తెలంగాణలో లేదు అన్నారు.

**తెలంగాణకు ఎత్తిపోతలే శరణ్యం :** ప్రాజెక్టులు కట్టి ఎత్తిపోసుకుంటే మన బీళ్లకు నీళ్లు రావు.. ఇది వాస్తవం. మన భౌగోళిక పరిస్థితి అలా ఉంది. అందుకే ఎంత ఖర్చయినా సరే.. ఎత్తిపోతలే శరణ్యం తప్ప.. తెలంగాణకు వేరే మార్గం లేదు. ఉదాహరణకు గల్ఫ్ దేశాలను తీసుకుంటే.. సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యూఏఈలో తాగునీరు లేదు. తాగునీరు లేదని ఊరుకోం కదా? సముద్రం నీళ్లు ఉన్నయ్. వాటిలో ఉప్పును డిసాలినేషన్ చేసి.. ఎంత ఖర్చయినా మంచినీళ్లు తాగాల్సిందే తప్పా.. వేరే మార్గం లేదు కదా? వయోబులిటీ లేదు.. కాస్ట్ బెనిఫిట్ రేషియో చూస్తే డిసాలినేషన్ ప్లాంట్ పనికిరాదు అంటే నీళ్లు లేక సచ్చిపోతరు. తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి. బీళ్లుగా మారిన తెలంగాణ పొలాలు.. దశాబ్దాల పాటు జరిగిన ఉద్యమాలు.. తెలంగాణలో రైతులకు జరిగిన అన్యాయం. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని.. ఎంత ఖర్చయినా సరే ఎత్తిపోతలే శరణ్యమని ఒక కామన్ సెన్స్ ఉండెకాబట్టే.. ఇంజినీర్లు చెప్పారు కాబట్టే మనం ఎత్తిపోతల పథకాలు చేసుకున్నాం. దశాబ్దాల పాటు కరువు కోరల్లో చిక్కుకున్న తెలంగాణకు ఉపశమనం లభిస్తే దాన్ని దేనితో విలువ కడుతరు? ఏ రకంగా లాభంపై అధ్యయనం చేస్తరు? కాకి లెక్కలు వేసి మాట్లాడితే సరిపోదు కదా? దశాబ్దాల పాటు తెలంగాణ జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీచేయాలి? ఒక మూషంపల్లిలో బోర్ల రాంరెడ్డి 54 బోర్లకు పెట్టిన ఖర్చు ఎవరి ఖాతాలో వస్తారు ? దాని వయోబిలిటీ ఏంది? కాస్ట్ బెనిఫిట్ మాటకే వస్తే దేశంలో ప్రభుత్వ హాస్పిటల్స్ కట్టకూడదు.ఐఐఎంలు పెట్టకూడదు. వయోబులిటీ రాదు. ప్రైవేటు కాలేజీలతో ఫర్ ప్రాఫిట్. ప్రభుత్వం ప్రాఫిట్ ఫర్ ఇన్స్టిట్యూషన్అని కేటీఆర్ అన్నారు.

**కాస్ట్ బెనిఫిట్ కొలమానం సరికాదు :** అత్యంత పేదరికంలో ఉన్నరైతాంగానికి సంబంధించిన ప్రాజెక్టులను ఇవాళ కాస్ట్ బెనిఫిట్ అనే కొలమానంతో చూడడం సరికాదు. ఇవాళ ఎవరైతే కాళేశ్వరాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నరో.. కాస్ట్ బెనిఫిట్ అనాలసిస్ అని.. వారందరికీ చేసే విజ్ఞప్తి.. ఆకలికేకల తెలంగాణ ఇవాళ అన్నంగిన్నెగా మారిన మాట వాస్తవం కాదా? దేశానికి అన్నపూర్ణగా మారిన మాట వాస్తవం కాదా? 24 లక్షల టన్నుల ధాన్యం సేకరించే తెలంగాణలో ఇవాళ 3.50కోట్ల టన్నుల ధాన్యం పండుతున్న మాట వాస్తవం కాదా? తెలంగాణ భారత దేశానికే ధాన్య భాండాగారంగా మారిన మాట వాస్తవం కాదా? ఎఫ్సీఐ ప్రొక్యూర్మెంట్ లెక్కల కాళేశ్వరం సాధించిన విజయానికి. ఆనాడు ఎకరం రూ.3లక్షల పలుకని భూముల ధర.. నేడు రూ.30లక్షలు అయ్యింది వాస్తవం కాదా? ఇది మ్యాజిక్తో అయ్యిందా? నీళ్లు రాకుండానే.. పంటలు పండకుండానే భూముల ధరలు పెరిగాయా ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

**కాంగ్రెస్ పాలనపై ధ్వజం :** సన్నాయి నొక్కులు నొక్కుతున్నరు రేవంత.. ఉత్తము. రూ.93వేలకోట్లు ఖర్చు పెట్టి 90వేల ఎకరాలకు అని మాట్లాడుతున్నరు. ఎస్సారెస్పీ కట్టిన తర్వాత 11 సంవత్సరాలకు 25వేల ఎకరాలకు నీరిచ్చింది కాంగ్రెస్. నాగార్జున సాగర్ కట్టిన 12 సంవత్సరాల తర్వాత 98వేల ఎకరాలకు నీరు వచ్చింది. కల్వకుర్తి ప్రాజెక్టులో 30 సంవత్సరాల తర్వాత 13వేల ఎకరాలకు నీరు వచ్చాయి. ఇవాళ కాళేశ్వరంలో మల్లన్న సాగర్లో 50 టీఎంసీలు. కొండపోచమ్మ సాగర్లో 15 టీఎంసీలు. ఈ రెండింటితోనే రెండు పంటలు పంటలు కలువుకుంటే.. 13లక్షల ఎకరాలకు నీరిచ్చే పరిస్థితి ఉంది. మేం రిజర్వాయర్లు కట్టాం.. మీరు ప్రవాహ కాలువ, డిస్ట్రిబ్యూషన్ కాలువలు కడితే బ్రహ్మాండంగా నీళ్లు ఇవ్వొచ్చు అన్నారు. ఏనుగెళ్లింది.. తోక చిక్కింది అన్నటు.. అసలు మేం చేశాం.. దాన్ని చేయకుండా బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారో.. ఆలోచించమని కోరుతున్నా. ఇన్ని తప్పుడు లెక్కలు చెప్పినా.. మొన్న రాష్ట్ర ప్రభుత్వమే శాసనసభలో ఇచ్చిన నివేదిక చూస్తే 20లక్షల ఎకరా లకు నీరు వచ్చాయని చెప్పారు. స్థిరీకరణ, కొత్త ఆయకట్టు చూస్తే 20 లక్షల ఎకరాలకు నీరిచ్చామని ఒప్పుకున్న పరిస్థితి. ఛలో మేడిగడ్డ కార్యక్రమం తీసుకున్నాం.

## చేవెళ్ల టిఆర్ఎస్ అభ్యర్థి బీసీయేనా?



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితి పార్లమెంటు అభ్యర్థులను గెలిపించుకునేందుకు కొత్తదారులు వెతుకుతుందా అన్న అనుమానాలకు బలం చేకూరుతుంది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం లో బలమైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన చేతల్లోనే రాజకీయాలు ఉంటాయి. కొండా వెంకట రంగారెడ్డి నుండి మొదలుపెడితే పట్నం మహేందర్ రెడ్డి వరకు రెడ్డి రాజకీయాలే ఈ జిల్లాలో కొనసాగుతున్నాయి. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి కొండ వెంకట రంగారెడ్డి మనవడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పోటీ చేయగా గెలుపొందారు. తర్వాత రాజకీయాల కారణాలతో కొండా విశ్వేశ్వర్ రెడ్డి గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఆదిత్యంతో రంజిత్ రెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. అయితే రంగారెడ్డి జిల్లాలో ఒకప్పుడు బీసీ నేతలు మాణిక్యరావు పటేల్ నారాయణరావు పటేల్ కాంగ్రెస్ లో మంత్రి పదవులు చేపట్టగా తూళ్ళ దేవేందర్ గౌడ్ ఒక వెలుగు వెలిగారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంతో దేవేందర్ గౌడ్ రాజకీయ పార్టీ స్థాపించినప్పటికీ ఆ తర్వాత ఆరోగ్యం సహకరించక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే తెలుగుదేశం పార్టీలో మండల పరిషత్ అధ్యక్షునిగా కొనసాగిన నాగేందర్ గౌడ్ తెలంగాణ ఉద్యమంలో మొదటి నుండి కేసీఆర్ వెంట ఉన్నారు.అప్పటినుండి పార్టీ అధిష్టానం నాగేందర్ గౌడ్ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉద్యమంలో పని చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన నాగేందర్ గౌడ్ కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కావడం 2014 సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చి ఉద్యమ నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముఖ్యమంత్రి అయ్యారు. కెసిఆర్ సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత నాకు తెలంగాణ విద్యాశాఖ చైర్మన్ పదవిని అప్పగించారు. రాజకీయంగా పదవి బాధ్యతలు నిర్వర్తించిన సొంత గ్రామం వికారాబాద్ నియోజకవర్గంలో ఉండడం ఆ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ కావడంతో నాకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం రాలేదు. సీఎం కేసీఆర్, టిఆర్ఎస్ కార్యనిర్వాక అధ్యక్షులు, ఎమ్మెల్యే కేటీఆర్ నాకు భవిష్యత్తులో రాజకీయ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ గారికి ఆశించినప్పటికీ దివంగత పివి నరసింహారావు కుమార్తె పివి వాణిదేవిని పార్టీ అధిష్టానం అభ్యర్థిగా ప్రకటించింది. అయితే భవిష్యత్తులో రాజకీయ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అభ్యర్థి గెలువుకు కృషి చేశాను. అయితే కెసిఆర్ నాయకత్వంలో పార్టీ అధిష్టానం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు నిరంతరం కృషి చేస్తూ పార్టీ క్రమశిక్షణకు, నియమ నిబంధనలకు లోబడి పని చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నాగేందర్ గౌడ్ పరిగి నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంచార్జిగా పనిచేశారు. అయితే తాజాగా తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో రంగారెడ్డి జిల్లాలో గట్టి పట్టున్న మంత్రిగా పని చేసి ఎమ్మెల్సీగా ఉన్న పట్నం మహేందర్ రెడ్డి ఆయన సతీమణి జిల్లా పరిషత్ చైర్మన్ సునీత రెడ్డిలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా సీనియర్ నేత తీగల కృష్ణారెడ్డి ఆయన కోడలు జిల్లా పరిషత్తు చైర్మన్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గం లో రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. ఇందులో భాగంగా చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా బలమైన బీసీ (గౌడ) సామాజిక వర్గానికి చెందిన నాగేందర్ గౌడ్ ను బరిలోకి దింపేందుకు బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు సమాచారం. అందుకే ఇటీవల వికారాబాద్ కేంద్రంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పూలే విగ్రహ ఏర్పాటు నువ్వు డిమాండ్ చేస్తూ వికారాబాద్ లో సమావేశం ఏర్పాటు చేశారని ఆ సమావేశం సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ నేతలకు కొత్త అస్త్రం దొరికినట్లు అయిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా వ్యూహాలు మార్చే కెసిఆర్ ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనైనా బలమైన వ్యూహంతోనే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులను బరిలోకి దింపుతారు అన్న చర్చ సాగుతోంది.

# చంద్రబాబుతో పలువురు ఆశావహుల భేటీ



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : తెలుగుదేశం అధినేత చంద్రబాబును నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో ఆయన తెదేపాలో చేరనున్నారు. పల్నాడు జిల్లా అభివృద్ధి కోసం మళ్లీ పోటీ చేయబోతున్నట్లు ఇప్పటికే శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా మళ్లీ ప్రజల ముందుకొస్తున్నానని తెలిపారు. ఇదే విషయమై భేటీలో ఎంపీ చర్చించినట్లు సమాచారం. అలాగే వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబును తన నివాసంలో పలువురు ఆశావహులు కలుస్తున్నారు. వీరిలో తొలి జాబితాతో సీటు కోల్పోయిన వారితో పాటు ప్రకటించని స్థానాల ఆశావహులు ఉన్నారు. స్థానాలు కోల్పోయిన నేతలను బుజ్జగించి రాజకీయ భవిష్యత్తుకు చంద్రబాబు హామీ ఇస్తున్నారు.

కడప పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అధినేత నివాసానికి వచ్చారు. వచ్చే ఎన్నికల్లో కడప లోక్సభ టికెట్ను శ్రీనివాసులు ఆశిస్తున్నారు. తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ చంద్రబాబుతో భేటీ అయ్యారు. తంబళ్లపల్లి నియోజకవర్గాన్ని ఈసారి జయ చంద్రారెడ్డికి కేటాయించారు. అలాగే అనంతపురం లోక్సభ స్థానం ఆశిస్తున్న జేసీ పవన్ రెడ్డి చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు.

అనంతపురం నుంచి పోటీ చేయాల్సిందిగా ఇప్పటికే బీకే పార్థసారథికి చంద్రబాబు సూచించిన సంగతి తెలిసిందే. తొలి జాబితాలో చోటు దక్కని ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి సైతం చంద్రబాబుతో సమావేశమయ్యారు.

# గుండె నిండా విజయపు 'జెండా'

● జనసేన - తెలుగుదేశం పార్టీల ఉమ్మడి సభకు ఏర్పాట్లు పూర్తి ● సభకు వచ్చే లక్షల మందికి సరిపడా ఏర్పాట్లు ● మహిళల కోసం ప్రత్యేక గ్యాలరీలు ● సభా ప్రాంగణం వద్ద అత్యవసర మెడికల్ సదుపాయంతోపాటు మెండుగా మంచినీళ్ల సదుపాయం ● సభా ప్రాంగణాన్ని పరిశీలించిన జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ● సభా ప్రాంగణానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, పత్తిపాటి పుల్లారావు



తాడేపల్లిగూడెం, సూర్య బ్యూరో ప్రతినిధి : జనసేన – తెలుగుదేశం ఉమ్మడి సభ తెలుగు జన విజయకేతనం జెండా సభ ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. తాడేపల్లిగూడెం సమీపంలోని పత్తిపాడు వద్ద సభకు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 6 లక్షల మంది సభకు తరలి వచ్చే అవకాశం ఉండడంతో, అందుకు తగినట్లుగా ఏర్పాట్లను పూర్తి చేశారు. జనసేన పార్టీ పూర్తి బాధ్యతను తీసుకొని ఈ సభను నిర్వహిస్తోంది. 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలకు ఉమ్మడిగా సమాయత్తం చేసే సభగా ఇది నిలిచిపోనుంది. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఈ సభకు హాజరు కానున్న నేపథ్యంలో ఇరు పార్టీల నుంచి కార్యకర్తలు, మహిళలు కూడా పెద్ద ఎత్తున సభకు తరలి రానున్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని పూర్తికాగా తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా ఏర్పాట్లకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ప్రత్యేకంగా చూస్తున్నారు. దీని కోసం ఇరుపార్టీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఇప్పటికే కమిటీలను నియమించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సభ మొదలుకానుంది.

సభా వేదికపై ఇరు పార్టీల నుంచి 500 మంది నేతలు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉండడంతో దానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఇరు పార్టీలకు సంబంధించిన నియోజకవర్గస్థాయి నాయకులు రవాణా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బస్సులు అలాగే కార్లు జీపులు ఇతర రవాణా మార్గాల ద్వారా తాడేపల్లిగూడెం చేరుకునేందుకు ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. సభ ప్రాంగణంలో విస్తృతంగా మంచినీరు ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు.

భారీగా జన సందోహం వచ్చే అవకాశం ఉండడంతో పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని ఇప్పటికే ఎంపిక చేశారు. ప్రత్యేక వాలంటీర్ల బృందాన్ని సిద్ధం చేశారు. రెండు పార్టీల నుంచి ఈ వాలంటీర్ల బృందం సభ ప్రాంగణంలో సేవలందిస్తారు. సభా ప్రాంగణంలోని వారందరికీ వేదిక స్పష్టంగా కనిపించేలా మాట్లాడే వ్యక్తులు కూడా సులభంగా గుర్తించేలా సభా వేదికను ఏ మూల నుంచైనా చక్కగా చూసేలా ఏర్పాట్లు చేశారు. సభ పూర్తయ్యే సమయానికి రాత్రి వేళ అయ్యే అవకాశం ఉండడంతో ప్రాంగణం అంతా విద్యుత్ దీప కాంతులతో నింపారు. ప్రత్యేకమైన జోన్లుగా విభజించి ఇప్పటికే పాసులు పంపిణీ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టీవీల్లో ఉండేవారికి కూడా ప్రత్యక్ష ప్రసారం ద్వారా సభ మొత్తం వీక్షించే ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇరు పార్టీల అధినేతలు ప్రత్యేక హెలికాప్టర్ల ద్వారా సభకు రానున్నారు. దీంతో ఇప్పటికే హెలిపాడ్ల నిర్మాణం కూడా పూర్తయి అన్ని అనుమతులు తీసుకున్నారు. సభ ప్రాంగణం సమీపంలోనే ఒక హెలిపాడ్ ఏర్పాటు



చేశారు. సభ నిర్వహణకు ప్రత్యేక వాలంటరీ కమిటీలను ఏర్పాటు చేశారు. పోలీసులు సైతం సభ కోసం ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ మంగళవారం సాయంత్రం సభా ప్రాంగణాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించి జనసేన పార్టీ కార్యక్రమాలు నిర్వహణ కమిటీ కన్వీనర్ కళ్యాణం శివ శ్రీనివాస్ తో ప్రత్యేకంగా మాట్లాడారు. జరుగుతున్న ఏర్పాట్లు గురించి ఆరా తీశారు. వీవీఐపీలు గ్యాలరీలు, అలాగే సభ కోసం చేసిన ఏర్పాట్లు గురించి ప్రత్యేకంగా ఆరా తీశారు. ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 500 మందికి పైగా పోలీస్ బందోబస్తు సభ కోసం వెచ్చించేలా ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం సభ ఏర్పాట్లను జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. తెలుగుదేశం పార్టీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే రామానాయుడు సభ ఏర్పాట్లను పరిశీలించారు.

# అర్హులైన ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్



● సాధికారిత కమిటీ వల్లే ఆక్వా ధరల్లో స్థిరీకరణ ● దేశీయంగా ఆక్వా వినియోగంకు ప్రోత్సాహం ● 1962 ఆక్వా హబ్‌ల ద్వారా 657 మెట్రిక్ టన్నుల ఉత్పత్తుల విక్రయం ● ఇతర రాష్ట్రాల కన్నా ఏపీలోనే ఆక్వా ఉత్పత్తులకు ఎక్కువ ధర ● 9వ ఆక్వా సాధికారిత కమిటీ సమావేశం ● పాల్గొన్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, బొత్స సత్యనారాయణ, డాక్టర్ సీదిరి అప్పలరాజు, అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని ఆక్వా సాధికారిత కమిటీ పేర్కొంది. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి అధ్యక్షతన 9వ ఆక్వా సాధికారిత కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆక్వా రైతాంగానికి అండగా నిలిచేందుకు సీఎం వైయస్ జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆక్వా సాధికారిత కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు ఆక్వారంగంలో సమస్యలను సమీక్షించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులు సైతం మార్కెట్ రేట్లను, అంతర్జాతీయంగా ఆక్వారంగంలో ఏర్పడే ఒడిదొడుగులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ ధరల స్థిరీకరణ కోసం కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పరంగా ఎటువంటి సహకారం కావాలన్నా అందించేందుకు సిద్దంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ సీడ్, ఫీడ్ ధరలు, ఆక్వా ఉత్పత్తులకు సరైన రేటు, దేశీయంగా ఆక్వా ఉత్పత్తుల వినియోగంను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను కమిటీకి వివరించారు. ఆక్వా సాధికారిత కమిటీ ఏర్పాటైన తరువాత ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అటు ఆక్వా రైతులను, ఇటు సీడ్, ఫీడ్ తయారీ సంస్థలు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులను సమన్వయం చేసుకుంటూ మార్కెట్ లో రైతులకు నష్టం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనిఫలితంగా ప్రస్తుతం మార్కెట్ లో ఆక్వా రేట్లు స్థిరంగా కొనసాగుతున్నాయన్నారు. అలాగే ఇష్టారాజ్యంగా సీడ్, ఫీడ్ రేట్లను పెంచకుండా శాస్త్రీయంగా వాటిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఆక్వా ఉత్పత్తుల రేట్లను ఆర్బీకేల ద్వారా ప్రకటిస్తూ, రైతులు దళారీల చేతుల్లో మోసపోకుండా తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని అధికారులు వివరించారు.

వంద కౌంట్ రొయ్యలకు కేజీకి రూ.245 ధర ప్రస్తుతం మార్కెట్ లో లభిస్తోందని అన్నారు. గుజరాత్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే ఎక్కువ రేటు రైతుకు దక్కుతోందని, సాధికారిత కమిటీ కృషి వల్లే ఇది సాధ్యపడిందని తెలిపారు. ష్రింప్ రేట్లకు సంబంధించి ఎటువంటి సమస్య ఎదురైనా సరే ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేసి, ఎక్కడ సమస్య ఎదురైనా వాటిని తక్షణం పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ-ఫిష్ సర్వే ద్వారా పది ఎకరాలలోపు 3,57,863 ఎకరాలు, అంతకంటే ఎక్కువ పరిధిలో 1,10,594 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందని వివరించారు. ఉన్న రైతులకు సీఎం వైయస్ జగన్ సబ్సిడీపై విద్యుత్ ను అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ఆక్వా రైతులకు సబ్సిడీ కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఆక్వా సాగుకు సంబంధించి 43,548 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వీటికి సబ్సిడీ రూపంలో ప్రభుత్వం రూ.513 కోట్లు భరిస్తోందని తెలిపారు. ఆక్వా ఎగుమతులతో పాటు దేశీయంగా ఆక్వా ఉత్పత్తుల వినియోగంను ప్రోత్సహించేందుకు తీసుకున్న చర్యలను వివరిస్తూ రాష్ట్రంలో మొత్తం 2259 ఆక్వా హబ్ లను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

దీనిలో 1962 హబ్ లు ఇప్పటికే పనిచేస్తున్నాయని, వీటి ద్వారా 657 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను విక్రయించడం జరిగిందని తెలిపారు. దీనిని మరింతగా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ (ఇఎస్ఎఫ్ టి), కె.విజయానంద్ (ఎనర్జీ), గోపాలకృష్ణ ద్వివేది (ఫిషరీస్) జెన్కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అదనంగా 100 పడకల బ్లాక్ నిర్మాణం

● నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు 120 పోస్టుల్ని మంజూరు చేశాం
● వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సియస్ ఎం టీ కృష్ణ బాబు
● రూ.60 లక్షల విలువైన ఉచిత మందుల్ని అంజేసిన నాట్కో ప్రతినిధులు

గుంటూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల(జిజిహెచ్) లోని నాట్కో సెంటర్ ను ఇటీవల లెవెల్ -1 క్యాన్సర్ సెంటర్ గా ప్రభుత్వం ప్రకటించింది. ఇందు కోసం క్యాన్సర్ సెంటర్ లో ఇప్పుడున్న వంద పడకలకు అదనంగా మరో వంద పడకలతో మరిన్ని వసతుల్ని ఏర్పాటు చేసేందుకు ఈ సెంటర్ ను ఆనుకుని ఉన్న 1500 గజాల స్థలాన్ని నాట్కో ట్రస్ట్ కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇందుకు సంబంధించిన అవగాహనా ఒప్పంద పత్రాల్ని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణ బాబు సమక్షంలో నాట్కో ఫార్మా వ్యవస్థాపకులు , నాట్కో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వి.సి.నన్నపనేని, డిఎంఇ డాక్టర్ నరసింహం మంగళవారం మంగళగిరి ఎపిఐఐసి టవర్స్ ఆరో ఫ్లోర్ లోని స్పెషల్ సిఎస్ ఛాంబర్లో మార్పిడి చేసుకున్నారు.

ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఈ క్యాన్సర్ సెంటర్ లో రేడియేషన్ , మెడికల్, సర్జికల్ విభాగాల్ని ఏర్పాటు చేయడం వల్ల క్యాన్సర్ రోగులకు సమగ్ర చికిత్స అందుతుందని , అలాగే అన్ని విభాగాలలో వైద్యులు ఉండేట్లు చర్యలు తీసుకున్నామన్నారు.

క్యాన్సర్ చికిత్స నిర్ధారణ కోసం అవసరమైన పెట్ సిటి మెషిన్ కొనుగోలుకు కూడా టెండర్లు పిలిచామన్నారు. ఈ సెంటర్లో శిక్షణ పొందిన నర్సులు మాత్రమే పని చేసే విధంగా 30 ప్రత్యేక పోస్టుల్ని కూడా మంజూరు చేశామని, ఇక్కడ అవసరమైన మొత్తం 120 పోస్టుల్ని మంజూరు చేశామన్నారు. వి. సి. నన్నపనేని మాట్లాడుతూ ఈ స్థలంలో సుమారు 35,000 చదరపు అడుగుల్లో అదనంగా 100 పడకల క్యాన్సర్ బ్లాక్ నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం తో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో నాట్కో ఫార్మా ఎక్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివ రావు, క్యాన్సర్ సెంటర్ సమన్వయ కర్త యడ్లపాటి అశోక్ కుమార్, గుంటూరు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ లు పాల్గొన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ లో రోగులకు ఉచిత మందుల పంపిణీ లో భాగంగా ఈ త్రైమాసికానికి గాను 60 లక్షల రూపాయల విలువైన మందుల్ని స్పెషల్ సియస్ కృష్ణ బాబుకు వి.సి. నన్నపనేని ఈ సందర్భంగా అందజేశారు.

## భారత క్రికెటర్ కంటే ఏసీఏకు వైసీపీ నాయకుడే ముఖ్యమా?

**జనసేన అధినేత పవన్ కల్యాణ్**



గుంటూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)కు భారత క్రికెటర్ కంటే వైసీపీ నాయకుడే ముఖ్యమా అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిలదీశారు. గాయాలను లెక్కచేయకుండా భారత జట్టు కోసం, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ జట్టు కోసం హనుమ విహారి తన క్రీడా శక్తినంతటినీ ధారపోశారని పవన్ కొనియాడారు. ఏపీ రంజీ జట్టు నాకౌట్ చేరడంలో అతడిది కీలక పాత్ర అని పేర్కొన్నారు. వైసీపీ నేత కారణంగానే అతడు కెప్టెన్సీకి రాజీనామా చేశాడు. విహారి పట్ల ఏసీఏ చూపించిన తీరుకు చింతిస్తున్నా. మన ఆంధ్రా క్రికెట్ టీమ్ కెప్టెన్ను రాష్ట్ర క్రికెట్ సంఘం దారుణంగా అవమానించినప్పుడు ఆడుదాం ఆంధ్రా లాంటి కార్యక్రమాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి లాభమేంటి? అని జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హనుమ విహారికి భవిష్యత్తులో మంచి జరగాలని పవన్ ఆకాంక్షించారు. ఆటగాళ్లను గౌరవించడం తెలిసిన స్టేట్ క్రికెట్ అసోసియేషన్తో అతడు వచ్చే ఏడాది మళ్లీ ఆంధ్రా తరపున ఆడతాడని విశ్వాసం వ్యక్తం చేశారు.

## జాతీయ ఫ్లారెన్స్ నైటింగేల్ నర్సుల అవార్డులకు దరఖాస్తులు




విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : వృత్తే దైవంగా సేవే పరమార్థంగా భావించే అత్యుత్తమ సేవలు అందించే నర్సులకు జాతీయ ఫ్లారెన్స్ నైటింగేల్ నర్సుల అవార్డు - 2024 లకు గాను అర్హత కలిగిన వారి నుండి నామినేషన్లు స్వీకరిస్తున్నామని వైద్య విద్యా సంచాలకులు డిఎస్ వి ఎల్. నరసింహం తెలిపారు. ఫ్లారెన్స్ నైటింగేల్ జన్మదినం సందర్భంగా దేశంలోని నర్సులు, నర్సింగ్ నిపుణులు ఆగ్జి లరీ నర్సులు, మిడ్ వైఫ్, రిజిస్టర్డ్ నర్సులు, మిడ్ వైఫ్ రిజిస్టర్డ్ లేడీ హెల్త్ విజిటర్స్ అందించిన విశేష సేవలకు గుర్తింపుగా జాతీయ ఫ్లారెన్స్ నైటింగేల్ నర్సుల అవార్డులు ఇస్తున్నట్లు నరసింహం తెలిపారు.

ఈ అవార్డుకు గాను నగదు రూపంలో రూ. 50 వేలు మరియు సర్టిఫికెట్ తో పాటు పతకాన్ని కూడా అందిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు దారుని పూర్తి వివరాలు నమోదు కొరకు రాష్ట్ర కమిటీకి సంబందించిన ప్రత్యేక ఎంపిక ప్రమాణాలు ప్రక్రియ కొరకు నామినేషన్లు స్వీకరణకు చివరి తేదీ 01-03-2024 సాయంత్రం 5 గంటల లోగా ఈ క్రింది చిరునామాకు పంపించాలని కోరారు.

సంచాలకుల వారి కార్యాలయం, వైద్య విద్యా విభాగం, పాత ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణ, హనుమాన్ పేట, విజయవాడ చిరునామాకు పంపాలని కోరారు.

# సర్కారు మెలిక

● రూ.500 కే గ్యాస్ సిలెండర్‌పై జీవో జారీ
● రేషన్ కార్డు తప్పనిసరి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మరో గ్యారంటీ అమలుకు సిద్ధమైంది. ఆరు గ్యారంటీల్లో భాగమైన మహాలక్ష్మి పథకంలోని రూ.500 కే గ్యాస్ సిలెండర్ హామీని అమలు చేసేందుకు మంగళవారం రేవంత్ రెడ్డి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం అమలుకు అర్హత, షరతులు ఇతర వివరాలతో జీవో విడుదల చేసింది. దీని ప్రకారం రూ.500 కే గ్యాస్ సిలెండర్ పొందాలంటే రేషన్ కార్డును తప్పనిసరి చేశారు. తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రూ.500 కే పేదలకు గ్యాస్ సిలెండర్ హామీ ఇచ్చింది. దీని అమలుపై విపక్షాల నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రూ.500కే సబ్సిడీపై గ్యాస్ సిలెండర్ ఇచ్చేందుకు వీలుగా మార్గదర్శకాలతో ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. ఇందులో రాష్ట్రంలోని బీపీఎల్ కుటుంబాలకు అంటే రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు మాత్రమే దీన్ని పరిమితం చేసి అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ లెక్కన రాష్ట్రంలో ఉన్న 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లలో 89.99 లక్షల మంది రేషన్ కార్డు దారులకు మాత్రమే ఈ రూ.500 గ్యాస్ సిలెండర్ పథకం వర్తించబోతోంది. ఇప్పటికే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఈ పథకం వర్తింపచేస్తారు. రూ.500 కే గ్యాస్ సిలెండర్ ఇవ్వడం వల్ల గ్యాస్ కంపెనీలపై పడుతున్న అదనపు భారాన్ని నెలవారీగా రీయింబర్స్ మెంట్ చేస్తామని ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో తెలిపింది. ఇక్కడే ఓ మెలిక ఉంది. రేషన్ కార్డు ఉండి ప్రజాపాలనలో రూ.500 గ్యాస్ సిలెండర్ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారు సాధారణ రేటుకు సిలెండర్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సిలెండర్ డెలివరీ తర్వాత గ్యాస్ కంపెనీలు ఇందులో రూ.500 కంటే ఎక్కువగా ఉన్న రాయితీ మొత్తాన్ని వినియోగదారుల ఖాతాల్లోకి బదిలీ చేస్తాయి. అలాగే మూడేళ్ల సగటు వినియోగం ఆధారంగానే ఈ సిలెండర్లను వినియోగదారులకు పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం జీవోలో వెల్లడించింది.

## ఉండిలో రామరాజుకు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదు

**ఎమ్మెల్యే కలవపూడి శివ**



పశ్చిమగోదావరి జిల్లా: తెలుగుదేశం పార్టీ టికెట్ ప్రకటించిందని తనపైనే రాజకీయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు (కలవపూడి శివ) హెచ్చరించారు. మూడు రోజుల్లో క్రితం తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ లో విద్యార్థులను ప్రకటించిన నేపథ్యంలో ఉండి నియోజకవర్గ అభ్యర్థిగా రామరాజు ను ప్రకటించారు. దీంతో మంతెన రామరాజు ఇప్పుడే తాను ఎన్నికల్లో గెలిచాను అన్నా రీతిలో అహంకారంతో ఊగిపోతున్నారని కలవపూడి శివ అన్నారు. నియోజకవర్గంలో తన పేరు ఉచ్చరిస్తున్న నా అభిమానులకు ఎమ్మెల్యే రామరాజు వార్నింగ్ ఇస్తున్నాడనీ, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పునాది వేసిన నా ఫేక్సీలనే తొలగించే కార్యక్రమంలో రామరాజు ఉన్నాడనీ అన్నారు. నియోజకవర్గంలో జరిగిన టిడిపి జనసేన ఆత్మీయ సమావేశానికి నాకు పిలువు లేదని, బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగే సభకు కూడా నాకు పిలువు రాలేదన్నారు. ఎమ్మెల్యే రామరాజు నిత్యం తనను అవమానిస్తూనే ఉన్నాడనీ, రామరాజుకు నేను ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఉండి నియోజకవర్గం లో కచ్చితంగా ప్రజాక్షేత్రంలో ఉంటాననీ ప్రకటించారు.

## కాంగ్రెస్ రాష్ట్ర ఓబిసి వర్కింగ్ ఛైర్మన్‌గా తూము వినయ్ కుమార్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఓబిసి వర్కింగ్ ఛైర్మన్ గా తూము వినయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్ మున్షీ, జాతీయ ఓబీసీ సెల్ కన్వీనర్ అజయ్ సింగ్ యాదవ్ తూము వినాయ్ కుమార్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్ని అవాంతరాలు ఎదురైనా తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషి నిశ్చయంతో ఉన్నారని తెలంగాణ రాష్ట్ర ఓబిసి వర్కింగ్ ఛైర్మన్ తూము వినయ్ కుమార్ స్పష్టం చేశారు. గాంధీభవన్ లో సోమవారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ శ్రీమతి దీప దాస్ మున్షిని కలిసి రాష్ట్రంలో ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్న తీరుతెనులను ఆమెకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు ఓబీసీలు ఎస్సీలు ఎస్టీలు మైనారిటీలు టిఆర్ఎస్ కు వ్యతిరేకంగా సంఘటితమై పోరాడిన విషయాన్ని కూడా ఆమె దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో వెనుకబడిన కులస్తులకు ప్రయోజనం చేకూర్చే విధంగా శాసనసభలో బీసీ కుల గణన బిల్లును ప్రవేశపెట్టి న విషయాలలో రాష్ట్రవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతున్న విషయాలను దీపా దాస్ మున్షికి వివరించారు. రానున్న లోక సభ ఎన్నికలలో విజయం సాధించే దిశగా కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలే తార్కణమని ఆయన అన్నారు పార్టీ అగ్రనేతలు సోనియా రాహుల్ గాంధీ మల్లి కార్జున ఖరిగే నాయకత్వాలను ప్రజలు కోరుకుంటున్నారని తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేందుకు దోహదపడుతుందన్నారు.

## హామీలు అమలు చేయకుంటే కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుంది

● రూ.34 వేల కోట్ల రుణమాఫీ ఎలా చేస్తారో చెప్పాలని ఈటల రాజేందర్ నిలదీత ● మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉండాలి ● మోదీ ప్రభుత్వం ఇస్తోన్న ఆయుష్మాన్ భారత్‌ను వినియోగించుకోవాలని ఈటల రాజేందర్ సూచన



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కేసీఆర్కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ హెచ్చరించారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర మంగళవారం మెదక్కు చేరుకుంది. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి రూ.34 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పారని... కానీ అది ఎలా సాధ్యమో చెప్పాలని నిలదీశారు. ఈ అంశంపై రేవంత్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉండాల్సిందేనని... కానీ ఆటో డ్రైవర్లకు రేవంత్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.12 వేల సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆయుష్మాన్ భారత్లో భాగంగా రూ.10 లక్షల వైద్య బీమా ఇస్తోందని... దీనిని వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ వచ్చినప్పుడు మద్యం ఆదాయం రూ.10,700 కోట్లుగా ఉండేదని, కానీ ఇప్పుడు రూ.45వేల కోట్లకు చేరుకుందన్నారు. మహిళల బాగు కోసం బెల్ట్ దుకాణాలను మూసివేయాలని సూచించారు. కేసీఆర్ లక్ష కోట్ల రుణమాఫీ చేయలేకపోయారని, ఇక రేవంత్ లక్షన్నర ఎలా చేస్తారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గోల్ మాల్ చేస్తారన్నారు. లోక్ సభ ఎన్నికల్లో ప్రధాని మోదీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. మోదీ ప్రభుత్వం వచ్చాక సరిహద్దుల్లో ఆర్మీ ప్రశాంతంగా ఉంటోందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మతకల్లోలాలు జరుగుతాయని ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటిదాకా కాళేశ్వరం ప్రాజెక్టుపై పెద్ద ఎత్తున రాద్ధాంతం జరుగుతున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం మరొక కీలకమైన నిర్ణయానికి తెరలేపింది. భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నాలుగు సంవత్సరాల క్రితం లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీంను ప్రారంభించింది. అయితే దాదాపు 25 లక్షలపైగా దరఖాస్తులు వచ్చినప్పటికీ మరింత ముందుకు సాగకుండా, ఎల్ఆర్ఎస్ పథకాన్ని అమలు చేయకుండా పెండింగ్‌లో పెట్టడం జరిగింది. అయితే దరఖాస్తుదారులు అనేకమార్లు ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఆ విషయాన్ని గత సర్కారు వివిధ కారణాలతో పట్టించుకోలేదు. ఈలోగా అనూహ్యమైన రీతిలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో లే అవుట్ల క్రమబద్ధీకరణ అంశం తెరపైకి వచ్చింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్ఆర్ఎస్ అంశాన్ని కూడా ప్రముఖంగా ప్రస్థావించింది. తాజాగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో లేఔట్ల క్రమబద్ధీకరణపై దృష్టి సారించారు. పాత అప్లికేషన్లను పరిష్కరించడంతోపాటు ఫీజు విధించి కొత్త అప్లికేషన్లు కూడా స్వీకరించాలని విధానపరమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఫీజు వసూలు అనే నిర్ణయంపై విపక్షాలు మండిపడుతున్నాయి. తమ ప్రభుత్వం ఫీజు వసూలు చేయకుండా ఆ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని, కోర్టు కేసు, వివిధ అంశాల ఫలితంగా అమలులో జాప్యం జరిగిందని ప్రధాన ప్రతిపక్షం పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో మరోసారి అధికార పక్షం వర్సెస్ ప్రధాన ప్రతిపక్షం తరహాలో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రజలకు లేఅవుట్ల క్రమబద్ధీకరణతో మంచి వెసులుబాటు కలుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు.



# సర్కారుకు కాసుల పంట

## ఎల్. ఆర్. ఎస్ పథకానికి రెక్కలు

- రేవంత్ సర్కార్ ద్విముఖ వ్యూహం
- ఇటు వెసులుబాటు- అటు ఆదాయం
- కసరత్తు ప్రారంభించిన మున్సిపల్,
- రిజిస్ట్రేషన్ల శాఖలు ఎల్ .ఆర్ .ఎస్‌పై భిన్నవాదనలు
- ఫీజు వసూలుపై విమర్శలపాలు
- జనం మేలు కోసమే అంటున్న ముఖ్యమంత్రి
- 25.44 లక్షల మందికి ప్రయోజనం
- కార్పొరేషన్లలో 4.13 లక్షలు, మున్సిపాలిటీల్లో 10.54 లక్షలు
- పంచాయతీల్లో 10.76 లక్షల దరఖాస్తులు
- లేఔట్‌ల పథకానికి రాజకీయ రంగు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: 2020 భూముల క్రమబద్ధీకరణ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లక్షలాది మంది దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు మేలు చేసే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2020లో ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలల పాటు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. రాష్ట్రంలో అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.44 లక్షల మంది అప్లికేషన్లు సమర్పించారు. కార్పొరేషన్లలో 4.13 లక్షలు, మున్సిపాలిటీల్లో 10.54 లక్షలు, పంచాయతీల్లో 10.76 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఓపెన్ ప్లాట్లు, నాన్ లే అవుట్ కు సంబంధించిన వాటికి దరఖాస్తుదారులు వెయ్యి రూపాయల ఫీజు చెల్లించి, తమ డాక్యుమెంట్ కాపీని సమర్పించారు. పెద్ద లే అవుట్ స్థలాలకు సంబంధించి రూ.10 వేలు దరఖాస్తు ఫీజుగా చెల్లించారు. అంతటితోనే ఈ ప్రక్రియ నిలిచిపోయింది. అప్పుడు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలన్నీ ప్రభుత్వ నిర్ణయం కోసం నాలుగేండ్లుగా నిరీక్షిస్తున్నాయి. వివిధ కోర్టు కేసులతో ఈ ప్రక్రియ ఆలస్యమైందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. లక్షలాది కుటుంబాలకు మేలు చేసే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నిబంధనల ప్రకారమే లే అవుట్ క్రమబద్ధీకరణ చేపట్టాలని సూచించారు. దరఖాస్తుదారులు పూర్తి రుసుము చెల్లించి మార్చి 31లోగా లే-అవుట్‌ల క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప ఇతర లే-అవుట్ లను క్రమబద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయంతో దిగువ, మధ్యతరగతికి చెందిన దరఖాస్తుదారులకు మేలు జరుగుతుందని సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. తమ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవటం ద్వారా ఆయా స్థలాలపై అధికారిక హక్కులన్నీ వారి సొంతమవుతాయి.

దీంతో నిర్మాణాలకు అనుమతులు లభించటంతో పాటు, బ్యాంకు రుణాలు పొందేందుకు, స్థలాల క్రయ విక్రయాలకు ఉన్న అడ్డంకులన్నీ తొలిగిపోతాయి. వాస్తవానికి తెలంగాణ ఎల్ ఆర్ ఎస్ పథకంకు సంబంధించి అప్పటి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ 2020లోనే ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది, తద్వారా సెప్టెంబర్ 16 నాటి ప్రభుత్వ ఉత్తర్వు నం. 135 ప్రకారం నిబంధనలలోని కొన్ని నిబంధనలను తాజాగా మార్పులు చేర్పులు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ పథకంలో కొత్త నిబంధనల కారణంగా, ప్రభుత్వం ఎల్ ఆర్ ఎస్ సేవలను అందించనుంది. 2015 పాత ఎల్ఆర్ఎస్ స్కీమ్లో లాగా ఆగస్టు 31 నాటి జిఓ నెం. 131లో గతంలో ప్రారంభించిన నాలుగు స్లాబ్లకు బదులుగా 7 స్లాబ్లు. ఆగస్టు 26 తేదీ ప్రకారం ప్లాట్ యొక్క ప్రస్తుత మార్కెట్ విలువతో ప్రభుత్వం కొత్త క్రమబద్ధీకరణ ఛార్జీలను కూడా ప్రారంభించింది. సంబంధిత అధికారుల ద్వారా ఈ ప్రక్రియ జరిగింది. ఈ నవీకరణ కారణంగా, రాష్ట్ర క్రమబద్ధీకరణ నియమాలలో చాలా కొత్త మార్పులు చోటు చేసుకోవడం జరిగింది. ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్-2020) దరఖాస్తులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకుంది . మార్చి 31లోపు వచ్చే అభ్యర్థనలకు లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించడంతో దీనికి సంబంధించి మళ్లీ కదలిక ఏర్పడింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ ఆస్తులు, కోర్టు ఆదేశాలకు లోబడి ఉన్న ప్రాంతాలు మినహా మిగిలిన అన్ని లేఅవుట్లు ఇప్పుడు క్రమబద్ధీకరించబడతాయి.

రెగ్యులరైజేషన్ ఛార్జీలకు సంబంధించి కొత్త మార్పు లను చీఫ్ సెక్రటరీ జారీ చేసినప్పుడు, రాష్ట్రంలోని సంబంధిత నివాసితుల నుండి రోజు రోజుకు తమకు అందుతున్న అభ్యర్థనల సంఖ్యను దృూఎష్టిలో ఉంచుకుని మార్పులు చేసినట్లు చెప్పారు. క్రమబద్ధీకరణ ఛార్జీలు చాలా ఎక్కువగా ఉన్నందున రాష్ట్ర ప్రజలు అందరూ చాలా నిరాశకు గురయ్యారు. 2015 సంవత్సరంలో ప్రారంభించబడిన ఎల్ఆర్ఎస్ పథకం కొన్ని సంవత్సరాల ముందు చేసిన కొత్త మార్పులతో పోలిస్తే చాలా తక్కువ క్రమబద్ధీకరణ ఛార్జీలను కలిగి ఉంది. అలాగే, ఇవే అంశాలను పలువురు ఎమ్మెల్యేలు ఎన్నికలకు ముందు అసెంబ్లీలో ప్రస్తావించారు. గత అసెంబ్లీలో అప్పటి మంత్రి కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. 2015 సంవత్సరానికి సంబంధించి స్కీమ్లో ఉన్న విధంగానే క్రమబద్ధీకరణ ఛార్జీలు పెంచుతామని చెప్పారు.



### ఎల్.ఆర్.ఎస్. స్కీంను రాజ్యాంగ బద్ధంగా ఉండాలి

**రచనా రెడ్డి, న్యాయవాది**



ప్రభుత్వం నిజంగా న్యాయబద్ధంగా వారి స్థలాల్లో లేఔట్ లు చేసుకున్న వెంచర్లకు మాత్రమే ఎల్లారీ స్కీమ్ వర్తింపజేయాలని ప్రముఖ న్యాయవాది భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి రచనా రెడ్డి స్పష్టం చేశారు. అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు అసంబద్ధమైన హామీలను నెరవేర్చడానికి పలు స్కీములు ప్రకటిస్తున్నారని స్పష్టం చేశారు. అయితే న్యాయబద్ధంగా వారి అవసరాల నిమిత్తం ఎల్ ఆర్ ఎస్ లాంటి స్కీములు అవసరమని ఆమె అన్నారు. అయితే రాజకీయ కారణాలతో గతంలో కాంగ్రెస్ పార్టీ ఆ తర్వాత టిఆర్ఎస్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్.ఆర్.ఎస్. స్కీమును రాజకీయ ప్రకటనల విధంగా ప్రకటిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ బద్ధంగా ఏ స్కీములను ప్రకటించిన రాజకీయ పార్టీలకు ఎలాంటి అభ్యంతరం ఉండదని భావిస్తున్నాను.

### సర్కార్ నిర్ణయం సముచితం

**-టిపిసిసి అధికార ప్రతినిధి ప్యాట రమేష్**



గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కీలకమైన లేఅవుట్ల క్రమబద్దీకరణ విషయంపై తమ కాంగ్రెస్ ప్రభుత్వం సముచితమైన నిర్ణయం తీసుకుందని టిపిసిసి అధికార ప్రతినిధి ప్యాట రమేష్ పేర్కొన్నారు. ఎల్ ఆర్ ఎస్ అంటేనే శిస్తు కట్టడం లాంటిదని, అప్పుడే క్రమబద్ధీకరణ జరుగుతుందని ఆయన చెప్పారు. దీనివల్ల ప్రజలకు కూడా ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం దీనిని పెండింగ్లో పెట్టడం వల్ల ప్రజలు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. దీనిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని పరిష్కరించడం పట్ల ఆయన హర్షం ప్రకటించారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు సమస్యను పరిష్కరించకుండా నానబెట్టి ఇప్పుడు రాద్ధాంతం చేయడాన్ని ఆయన హరీష్ రావు తీరును ఖండించారు.

### సర్కార్‌కు కోట్లల్లో ఆదాయం

ఇదిలా ఉండగా ఎల్.ఆర్.ఎస్ పథకంతో రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయంగా సమకూరనుంది. దీనికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఎంత ఆదాయం సమకూర్తుంది అనే దిశగా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. టిఆర్ఎస్ ప్రభుత్వం భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ఫీజును వసూలు చేయరాదని నిర్ణయించింది. అయితే అనూహ్యమైన రీతి లో మూడున్నర సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఈ అంశాన్ని తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెరపైకి తెచ్చారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూరాలని ఈ స్కీమును అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా స్థలాలు కొని ఇబ్బందులు పడుతున్న వారికి ఉపశమనం కల్పించాలని కూడా సంకల్పించడం జరిగింది. దీనికి సంబంధించి కనీసం 500 కోట్లకు రూపాయలకు పైగా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్తుందని అంచనా వేస్తున్నారు.

### దరఖాస్తులు తీసుకున్నారు- అమలు మరిచారు

తెలంగాణ ఎల్ ఆర్ ఎస్ పథకంకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ 2020లోనే ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది, తద్వారా సెప్టెంబర్ 16 నాటి ప్రభుత్వ ఉత్తర్వు నం. 135 ప్రకారం నిబంధనలలోని కొన్ని నిబంధనలను తాజాగా మార్పులు చేర్పులు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ పథకంలో కొత్త నిబంధనల కారణంగా, ప్రభుత్వం ఎల్ ఆర్ ఎస్ సేవలను అందించనుంది. 2015 పాత ఎల్ఆర్ఎస్ స్కీమ్లో లాగా ఆగస్టు 31 నాటి జిఓ నెం. 131లో గతంలో ప్రారంభించిన నాలుగు స్లాబ్లకు బదులుగా 7 స్లాబ్లు. ఆగస్టు 26 తేదీ ప్రకారం ప్లాట్ యొక్క ప్రస్తుత మార్కెట్ విలువతో ప్రభుత్వం కొత్త క్రమబద్ధీకరణ ఛార్జీలను కూడా ప్రారంభించింది. సంబంధిత అధికారుల ద్వారా ఈ ప్రక్రియ జరిగింది. ఈ నవీకరణ కారణంగా, రాష్ట్ర క్రమబద్ధీకరణ నియమాలలో చాలా కొత్త మార్పులు చోటు చేసుకోవడం జరిగింది.ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్-2020) దరఖాస్తులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకుంది . మార్చి 31లోవు వచ్చే అభ్యర్థనలకు లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించడంతో దీనికి సంబంధించి మళ్లీ కదలిక ఏర్పడింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ ఆస్తులు, కోర్టు ఆదేశాలకు లోబడి ఉన్న ప్రాంతాలు మినహా మిగిలిన అన్ని లేఅవుట్లు ఇప్పుడు క్రమబద్ధీకరించబడతాయి. రెగ్యులరైజేషన్ ఛార్జీలకు సంబంధించి కొత్త మార్పు లను చీఫ్ సెక్రటరీ జారీ చేసినప్పుడు, రాష్ట్రంలోని సంబంధిత నివాసితుల నుండి రోజురోజుకు తమకు అందుతున్న అభ్యర్థనల సంఖ్యను దృూఎష్టిలో ఉంచుకుని మార్పులు చేసినట్లు చెప్పారు. క్రమబద్ధీకరణ ఛార్జీలు చాలా ఎక్కువగా ఉన్నందున రాష్ట్ర ప్రజలు అందరూ చాలా నిరాశకు గురయ్యారు. 2015 సంవత్సరంలో ప్రారంభించబడిన ఎల్ఆర్ఎస్ పథకం కొన్ని సంవత్సరాల ముందు చేసిన కొత్త మార్పులతో పోలిస్తే చాలా తక్కువ క్రమబద్ధీకరణ ఛార్జీలను కలిగి ఉంది. అలాగే, ఇవే అంశాలను పలువురు ఎమ్మెల్యేలు ఎన్నికలకు ముందు అసెంబ్లీలో ప్రస్తావించారు. గత అసెంబ్లీలో అప్పటి మంత్రి కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. 2015 సంవత్సరానికి సంబంధించి స్కీమ్లో ఉన్న విధంగానే క్రమబద్ధీకరణ ఛార్జీలు పెంచుతామని చెప్పారు.

### ఫీజులు వద్దు

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**



హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్ కు అలవాటుగా మారింది అని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. అధికా రంలోకి రాగానే, ఎల్ఆర్ ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్దీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు మాట తప్పిందన్నారు. ఎల్ ఆర్ ఎస్ పేరిట ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైంది. నో ఎల్.ఆర్.ఎస్ - నో బీ.ఆర్.ఎస్ అంటూ గతంలో ప్రజలను రెచ్చగొట్టి ఇవుడు ఎల్.ఆర్.ఎస్‌కు ఫీజులు వసూలు చేస్తామనడం కాంగ్రెస్ నేతల మోసపూరిత మాటలకు నిదర్శనం. కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, గతంలో తాము చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్.ఆర్.ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలి. లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నా అని హరీష్ రావు అన్నారు.

### ఆయా సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో...

స్థలాలకు సంబంధించిన అంశాన్ని పరిశీలించిన పక్షంలో చదరవు గజం రూ. 3,000 కంటే తక్కువ ఉన్న సబ్-రిజిస్ట్రార్ విలువ 20 శాతం ఉంటుంది. అదేవిధంగా

రూ. 3,001 మరియు రూ. 5,000 మధ్య 30 శాతం
రూ. 5,001 మరియు రూ. 10,000 మధ్య 40 శాతం
రూ. 10,001 మరియు రూ. 20,000 50 శాతం
రూ. 20,001 మరియు రూ. 30,000 మధ్య 60 శాతం
రూ. 30,001 మరియు రూ. 50,000 మధ్య 80 శాతం

చదరవు గజం సబ్-రిజిస్ట్రార్ విలువ రూ. 50,000 పైన 100 శాతం ఉంటుంది. ఆమోదం పొందని లేఅవుట్లో 10 శాతం ఖాళీ స్థలం అందుబాటులో లేకుంటే, ఆగస్టు 26 నాటికి ఉన్న ధరకు బదులుగా, ప్లాట్ రిజిస్ట్రేషన్ తేదీ నాటికి ఉన్న ప్లాట్ విలువలో 14 శాతం చొప్పున ప్రో-రేటా ఓపెన్ స్పేస్ ఛార్జీలు వసూలు చేయబడతాయి. 2020. ఎల్ ఆర్ ఎస్ క్రమబద్ధీకరణ ఛార్జీలలోనాలా రుసుము (వ్యవసాయ భూమిని వ్యవసాయేతర వినియోగానికి మార్చడానికి) ఉంటుంది. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుదారులు ప్రత్యేక నాలా రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు అని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

**వి .వీరాంజనేయులు, తెలంగాణ బ్యూరో ప్రతినిధి, హైదరాబాద్**



సూర్య
హైదరాబాద్
బుధవారం
28 ఫిబ్రవరి 2024





## రోహిత్.. ఆ విషయంలో నువ్వేం చేయలేవు : గవాస్కర్

రాంచీ వేదికగా జరిగిన నాలుగో టెస్టు విజయానంతరం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. టెస్టు క్రికెట్ ఆడాలనే కసి ఉన్న ఆటగాళ్లకే భారత జట్టులో అవకాశాలు వస్తాయని రోహిత్ పేర్కొన్న విషయం తెలిసిందే. టెస్టుల కంటే ఐపీఎల్పైనే ఆసక్తి చూపించే ఆటగాళ్లను రోహిత్ పరోక్షంగా హెచ్చరించాడు."టెస్టు ఫార్మాట్ అత్యంత కఠినమైంది. టెస్టు క్రికెట్ ఆడాలంటే ఆటగాళ్లలో కసి ఉండాలి. అలా ఆకలితో ఉన్న వారికే అవకాశాలు వస్తాయి. లేని వాళ్లకు అవకాశాలు ఇవ్వడంలో అసలు అర్థమే లేదు. ప్రస్తుత భారత జట్టులోని ఆటగాళ్లలో సుదీర్ఘ ఫార్మాట్ పట్ల తపన కనిపిస్తోంది. అయితే టెస్టుల్లో అవకాశాలు తక్కువగానే వస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. విఫలమైన వాళ్లు బయటికి వెళ్లిపోవాల్సిందే" అని రోహిత్ చెప్పాడు. రోహిత్ వ్యాఖ్యలతో దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఏకీభవించాడు. గత కొన్నేళ్లుగా తాను కూడా ఇదే చెబుతున్నాని గవాస్కర్ పేర్కొన్నాడు. "రోహిత్ చెప్పింది కచ్చితంగా కరెక్టే. టెస్టు క్రికెట్ ఆడాలనుకునే వారికి అవకాశం ఇవ్వాలి. ఈ విషయం గత కొన్ని సంవత్సరాలుగా చెబుతున్నా. భారత క్రికెట్ వల్లే ఆటగాళ్లు ఈ స్థితిలో ఉన్నారు. కాబట్టి భారత క్రికెట్కు కొంచెం అయిన విధేయత చూపించాలి. అయితే కొందరు ఇండియా తరవున టెస్టు క్రికెట్ ఆడాలని భావించట్లేదనకుంటా. ఆ విషయంలో ఇక మీరు ఏం చేయలేరు" అని గవాస్కర్ తెలిపాడు.మానసిక అలసట కారణంగా జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్ను, అలాగే రంజీ ట్రోఫీలో పాల్గొనని సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్లను ఉద్దేశించి రోహిత్, గవాస్కర్ ఈ వ్యాఖ్యలు చేశారని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. అతడు తిరిగి భారత జట్టులోకి రావాలంటే దేశవాళీ క్రికెట్ ఆడాలని చెప్పినప్పటికీ ఇషాన్ లెక్కచేయలేదు. అంతేగాక టీమిండియాకు దూరంగా ఉన్న సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్లంతా రంజీ ట్రోఫీలో పాల్గొనాలని బీసీసీఐ ఆదేశాలు జారీచేసింది.

# విరాట్ కోహ్లీ బహుశా
# ఐపీఎల్ ఆడకపోవచ్చు

- సునీల్ గవాస్కర్
- ఇంగ్లండ్‌పై టెస్ట్ సిరీస్‌కు అందుబాటులో లేకపోవడంపై మాజీ దిగ్గజం వ్యంగ్యాస్త్రాలు
- రాంచీలో స్టార్ స్పోర్ట్స్ ఈవెంట్‌లో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసిన గవాస్కర్
- ధ్రువ్ జురెల్ ఐపీఎల్‌లో సూపర్ స్టార్‌గా మారే అవకాశం ఉందని ప్రశంసలు
- ఆర్సీబీకి ఆడబోతున్న ఆకాశ్ దీప్ కూడా మెరిసిపోవచ్చని విశ్లేషణ



టీమిండియా స్టార్ బ్యాట్స్మెన్ విరాట్ కోహ్లీ వ్యక్తిగత కారణాలతో ఇంగ్లండ్తో స్వదేశంలో జరుగుతున్న టెస్ట్ సిరీస్కు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే అతడి భార్య అనుష్క శర్మ ఇటీవలే మగబిడ్డకు జన్మనిచ్చిన నేపథ్యంలో విరాట్ తిరిగి జట్టుకి అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే స్వదేశంలో ఇంగ్లండ్పై టెస్ట్ సిరీస్లో ఆడకపోవడంపై భారత్ క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం విరాట్పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

సుదీర్ఘ విరామం తర్వాత క్రికెట్ ఆడబోతున్న విరాట్ పరుగుల దాహం తీర్చుకోబోతున్నాడా? అని ప్రశ్నించగా.. అతడు ఐపీఎల్ ఆడతాడా? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విరాట్ కోహ్లీ బహుశా ఐపీఎల్కు కూడా దూరమయ్యే అవకాశం ఉంది. ఏదో కారణం వల్ల అతను ఆడకపోవచ్చు.. అన్నారు గవాస్కర్. స్టార్ స్పోర్ట్స్ స్టార్ ఈవెంట్లో భాగంగా రాంచీలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ విద్యార్థులతో గవాస్కర్ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కాగా ఐపీఎల్2024 ఎడిషన్ మార్చి 22న ఆరంభం కానుంది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి. ఇక, రాంచీ టెస్టులో టీమిండియా విజయానికి ప్రధాన కారణమైన యువ బ్యాటర్ ధ్రువ్ జురెల్పై గవాస్కర్ ప్రశంసల జల్లు కురిపించారు.

ఐపీఎల్లో రాజస్థాన్ రాయల్స్ తరవున ఆడుతున్న వికెట్ కీపర్-బ్యాటర్ ధ్రువ్ జురెల్ ఈ ఏడాది ఐపీఎల్లో సూపర్స్టార్ కావచ్చునని గవాస్కర్ అన్నాడు. బ్యాటింగ్ ఆర్డర్లో ధ్రువ్ జురెల్ స్థానాన్ని ముందుకు జరిపే అవకాశం ఉందన్నాడు. టెస్ట్ మ్యాచ్లో ఈ స్థాయి ప్రదర్శన చూస్తుంటే జురెల్ సూపర్ స్టార్ కావచ్చని అన్నారు. కాగా ఆడిన రెండవ టెస్ట్ మ్యాచ్లోనే జురెల్ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. తొలి ఇన్నింగ్స్లో 90 పరుగులు, రెండవ ఇన్నింగ్స్లో 39 (నాటౌట్) పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇక అరంగేట్ర మ్యాచ్లో ఆకట్టుకున్న పేసర్ ఆకాష్ దీప్ కూడా ఈ ఏడాది ఐపీఎల్లో మరింత వెలుగులోకి రానున్నాడని గవాస్కర్ పేర్కొన్నారు. గత సీజన్లో ఆర్సీబీకి మైనస్గా ఉన్న డెత్ ఓవర్ స్పెషలిస్ట్ పాత్రను ఆకాశ్ దీప్ పోషించగలడని గవాస్కర్ విశ్లేషించారు.

ఇక హార్దిక్ పాండ్యాను కెప్టెన్గా నియమించడానికి ముంబై ఇండియన్స్ తీసుకున్న నిర్ణయాన్ని గవాస్కర్ మెచ్చుకున్నారు. రోహిత్ శర్మ జట్టును నడిపించే అదనపు బాధ్యతలు లేకుండా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయడానికి అవకాశం లభించిందని వ్యాఖ్యానించారు. కారు ప్రమాదానికి గురై కోలుకుంటున్న రిషబ్ పంత్ ఎంట్రీ విషయంలో తొందర అవసరం లేదని గవాస్కర్ వ్యాఖ్యానించారు. తాను కూడా పంత్ పెద్ద అభిమానినని, అతడు మునుపటిలా ఆరోగ్యంగా ఉండడం ముఖ్యమని, సంపూర్ణ ఫిట్నెస్తో ఉంటే మాత్రమే అలరించగలడని అన్నారు. మునుపటిలా బ్యాటింగ్ చేయడానికి పంత్కు కొంత సమయం పడుతుందని, ప్రాక్టీస్ ప్రారంభించడం మంచి పరిణామమని వ్యాఖ్యానించాడు.

## కొత్త ప్లాన్‌తో పంజాబ్ కింగ్స్..

మరికొన్ని రోజుల్లో ఐపీఎల్-2024 ప్రారంభం కానుంది. మార్చి 22 నుంచి మొదలుకానున్న ఈ 17వ సీజన్లో అయినా ట్రోఫీని ముద్దాడాలని పంజాబ్ కింగ్స్ కసితో ఉంది. దాని కోసం ఈ సారి కొత్త వ్యూహంతో బరిలోకి దిగుతోంది. అయితే ఆ ప్లాన్ ఎవరూ ఊహించనిది. సాధారణంగా ప్రణాళిక అంటే కోచ్, కెప్టెన్, తుదిజట్టులో మార్పులుగా అందరూ భావిస్తారు. కానీ పంజాబ్ కింగ్స్ ప్రత్యర్థిపై పైచేయి సాధించడానికి తమ హోమ్ గ్రౌండ్ను మార్చుకుంది. ముల్లాన్పూర్లోని మహారాజా యదవీంద్ర సింగ్ స్టేడియాన్ని తమ సొంతమైదానంగా ప్రకటించింది. అంతకుముందు మొహాలిలోని ఐఎస్ బింద్రా స్టేడియం హోమ్ గ్రౌండ్గా ఉండేది. గత 16 సీజన్లలో మరే జట్టు చేయనన్ని మార్పులను పంజాబ్ కింగ్స్ చేస్తోంది. కెప్టెన్లను మార్చింది. జెర్సీ, లోగోలను ఛేంజ్ చేసింది. అంతేగాక కలిసిరావాలని జట్టు పేరులో కూడా మార్పులు చేసింది. తాజాగా హోమ్ గ్రౌండ్ను మార్చింది. మరి, ఈ సారి అయినా ట్రోఫీని సాధిస్తుందో లేదో చూడాలి. ఇప్పటివరకు పంజాబ్ కేవలం రెండు సార్లు మాత్రమే ప్లేఆఫ్స్కు చేరింది. 2008లో సెమీస్కు చేరింది. 2014లో తమ అత్యుత్తమ ప్రదర్శన చేసింది. టేబుల్ టాప్లో నిలిచి టైటిల్కు ఫేవరేట్గా అంచనాలు నెలకొల్పింది. కానీ ఫైనల్లో ఓడి రన్నరప్తో సరిపెట్టు కుంది. ఆ తర్వాత ఇప్పటివరకు నాకౌట్ స్టేజ్కు పంజాబ్ చేరలేకపో యింది. కాగా, ఇటీవల జరిగిన వేలంలో పంజాబ్ ఆకట్టుకునే విధంగా ప్లేయర్ల ను కొను గోలు చేసింది. డెత్ బౌలింగ్లో మరింత పటిష్టంగా నిలిచేందుకు హర్షల్ పటేల్ కోసం అత్యధికంగా రూ.11.75 కోట్లు వెచ్చించింది. అలాగే బ్యాకప్ బ్యాటర్ కోసం రొసోకు రూ.8 కోట్లు కుమ్మరించింది. క్రిస్ వోక్స్కు రూ.4.20 కోట్లు, తనయ్ త్యాగరాజన్, విశ్వనాథ్, అశుతోష్, శశాంక్, ప్రిన్స్కు తలో రూ.20 లక్షలు ఖర్చు పెట్టింది. పంజాబ్ కింగ్స్: శిఖర్ ధావన్ (కెప్టెన్), జితేశ్ శర్మ, జానీ బెయిర్స్టో, ప్రభ్సిమ్రాన్ సింగ్, లివింగ్స్టోన్, మాథ్యూ షార్ట్, సామ్ కరన్, రోసో, సికందర్ రజా, అర్షదీప్ సింగ్, కగిసో రబాడ , నాథన్ ఎల్లిస్, రాహుల్ చాహర్, హర్షల్ పటేల్, క్రిస్ వోక్స్, హర్ప్రీత్ భాటియా, అథర్వ తైదే, రిషి ధావన్, శివమ్ సింగ్, హర్ప్రీత్ బ్రార్, గుర్నూర్ బ్రార్, విద్వాత్ కవేరప్ప, అశుతోష్ శర్మ, శశాంక్ సింగ్, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, తనయ్ త్యాగరాజన్, ప్రిన్స్ చౌదరి.

## హాకీ ఇండియాకు బిగ్ షాక్..






హాకీ ఇండియాకు మరో బిగ్ షాక్ తగిలింది. హాకీ ఇండియా సీఈఓ ఎలెనా నోర్మాన్ తన పదవికి రాజీనామా చేశారు. 13 ఏళ్ల పాటు సీఈఓగా హాకీ ఇండియాకు సేవలందించిన ఆమె.. ఉక్కిరిబిక్కిరి పని వాతావరణంలో పనిచేయలేనని తన బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఇటీవలే భారత మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ జన్నెకె స్కాప్మన్ తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. భారత్లో మహిళలకు తగిన గౌరవం లేదంటూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేసారు. ఈ క్రమంలోనే ఎలెనా నోర్మాన్ కూడా తన పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. హాకీ ఇండియాలో నెలకొన్న అంతర్గత వివాదాలతో తాను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఎలెనా నోర్మాన్ పేర్కొంది. 'ఇరు వర్గాల పోరులో నలిగిపోయాను. అక్కడి పనివాతావరణం అంతా ఉక్కిరిబిక్కిరిగా మారింది. హాకీ ఇండియా రెండు వర్గాలుగా చీలిపోయింది. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ, సెక్రటరీ భోలనాథ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీవాత్సవ, ట్రెజరర్ శేఖర్లు రెండు గ్రూప్లుగా చీలిపోయారు.

గత మూడు నెలలుగా నాకు జీతం ఇవ్వలేదు. ఒత్తిడితో పాటు ఆర్థిక సమస్యలు ఎక్కువ అవడంతో ఈ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను.'అని ఎలెనా నోర్మాన్ ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. హాకీ ఇండియా సీఈఓగా ఎలెనా హయాంలో భారత్ పలు అంతర్జాతీయ టోర్నీలకు ఆతిథ్యం ఇచ్చింది. ఎఫ్ఐఎహెచ్ పురుషుల వరల్డ్ కప్ 2018, 2023 టోర్నీలతో పాటు జూనియర్ పురుషుల ప్రపంచకప్ 2016, 2021 టోర్నీలు నిర్వహించింది. హాకీ ఇండియా లీగ్ ఐదు ఎడిషన్లను దిగ్విజయంగా పూర్తి చేసింది. భారత మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ జన్నెకె స్కాప్మన్ కూడా సంచలన ఆరోపణలు చేశారు. 'భారత మహిళల సీనియర్ హాకీ జట్టు జట్టు చీఫ్ కోచ్ పదవి నుంచి వైదొలుగుతున్నా. హాకీ ఇండియా, సాయ్లకు ఒక నెల ముందస్తు నోటీస్ పంపిస్తున్నా. మార్చి 23వ తేదీన నా పదవి ముగుస్తుంది. నాకు రావాల్సిన బకాయిలను త్వరగా చెల్లించాలని కోరుతున్నా. భారత జట్టుతో తాను కొనసాగిన సమయం ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అంటూ స్కాప్మన్ వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టు వరకు జన్నెకె స్కాప్మన్కు హాకీ ఇండియాతో కాంట్రాక్ట్ ఉంది. ప్యారిస్ ఒలింపిక్స్ తర్వాత 46 ఏండ్ల స్కాప్మన్ జట్టును వీడాల్సి ఉంది. కానీ హాకీ ఇండియాలోని అంతర్గత విభేదాల కారణంగా ఆమెకు సరిగ్గా వేతనం రాలేదు. దాంతో ఐదు నెలల ముందే ఆమె రాజీనామా చేశారు.

## చరిత్ర సృష్టించిన యువ క్రికెటర్
## 33 బంతుల్లో సెంచరీ



అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత వేగవంతమైన సెంచరీ నమోదైంది. నమీబియా బ్యాటర్ జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ 33 బంతుల్లోనే సెంచరీ బాది చరిత్ర సృష్టించాడు. ఇంటర్నేషనల్ మెన్స్ క్రికెట్లో ఫాస్టెస్ట్ సెంచరీ సాధించిన ప్లేయర్గా రికార్డు నెలకొల్పాడు. ట్రైనేషన్ టీ20 సిరీస్లో నేపాల్తో జరిగిన మ్యాచ్లో జాన్ నికోల్ లాఫ్టీ విధ్వంసం సృష్టించాడు. బౌండరీలు, సిక్సర్ల మోత మోగించాడు. ఈ ఎడమ చేతి వాటం బ్యాటర్ 11వ ఓవర్లో క్రీజులోకి వచ్చాడు. జట్టు స్కోరు 62/3 ఉన్నప్పుడు బాదే బాధ్యతలు అందుకున్నాడు. 11 ఫోర్లు, ఎనిమిది సిక్సర్లు బాదాడు. జాన్ నికోల్ ఊచకోతతో ప్రపంచ ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డులు బదలయ్యాయి. గతంలో అత్యంత వేగంవంతమైన సెంచరీ రికార్డు నేపాల్ బ్యాటర్ కుశాల్ పేరిట ఉండేది. గతేడాది ఏషియన్ గేమ్స్లో మంగోలియాపై కుశాల్ ఈ రికార్డు నెలకొల్పాడు. అంతకంటేముందు ఈ రికార్డు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, న్యూజిలాండ్ ప్లేయర్ డేవిడ్ మిల్లర్ పేరిట సంయుక్తంగా ఉండేది. వీరిద్దరు 35 బంతుల్లో మూడంకెల స్కోరును అందుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్లో జాన్ నికోల్ లాఫ్టీకి తొలి 50+ స్కోరు ఇదే కావడం విశేషం. లీగ్ క్రికెట్లతో కలిపి అతడికి ఇది రెండో స్కోరు. కాగా, 62/3 స్కోరు వద్ద క్రీజులోకి వచ్చిన నికోల్ అతడి దూకుడుతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 206 పరుగులు చేసింది. నికోల్ నాలుగో వికెట్కు 135 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆఖరి ఓవర్లో షాట్కు యత్నించి 36 బంతుల్లో 101 పరుగులు వద్ద వెనుదిరిగాడు.

అనంతరం నికోల్ లాఫ్టీ బంతితోనూ మెరిశాడు. మూడు ఓవర్లలో 29 పరుగులిచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో నేపాల్ 18.5 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌటైంది. ఆల్రౌండ్ షోతో విజయంలో కీలక పాత్ర పోషించిన నికోల్ లాఫ్టీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా, ట్రైనేషన్ టీ20 సిరీస్లో నేపాల్, నమీబియాతో పాటు నెదర్లాండ్స్ తలపడుతోంది.

## వాళ్లకు టీమిండియాలో నో ఛాన్స్




టెస్టు ఫార్మాట్ కంటే ఐపీఎల్పైనే ఆసక్తి చూపించే ఆటగాళ్లకు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పరోక్షంగా కఠినమైన సందేశాన్ని పంపాడు. టెస్టు క్రికెట్ ఆడాలనే కసి ఉన్న వారికే భారత జట్టులో అవకాశాలు వస్తాయని రోహిత్ చెప్పాడు. మానసిక అలసట కారణంగా జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్ను దృష్టిలో పెట్టుకొని రోహిత్ ఈ వ్యాఖ్యలు చేశాడని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. దక్షిణాఫ్రికా పర్యటన మధ్యలో ఇషాన్ కిషన్ జట్టు నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. అతడు తిరిగి భారత జట్టులోకి రావాలంటే దేశవాళీ క్రికెట్ ఆడాలని చెప్పినప్పటికీ ఇషాన్ లెక్కచేయలేదు. అంతేగాక టీమిండియాకు దూరంగా ఉన్న సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్లంతా రంజీ ట్రోఫీలో పాల్గొనాలని బీసీసీఐ ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ ఇషాన్ కిషన్ రంజీలో బరిలోకి దిగలేదు. మరోవైపు బీసీసీఐ ఆదేశాలతో రుతురాజ్ గైక్వాడ్ రంజీటఫీ ఆడాడు. కానీ దీపక్ చాహర్, శ్రేయస్ అయ్యర్ ఆడలేదు. తొలుత గాయాల సాకు చూపించి శ్రేయస్ అయ్యర్ తప్పించుకున్నాడు. కానీ ఆ తర్వాత శ్రేయస్ అడ్డంగా దొరికిపోయాడు. మ్యాచ్ ఆడలేని తీవ్ర గాయాలు శ్రేయస్కు లేవని బీసీసీఐకి ఎన్సీఏ నివేదిక పంపింది. ఐపీఎల్లో సత్తాచాటాలనే ఈ యువ క్రికెటర్లు రెడ్ బాల్ క్రికెట్పై ఆసక్తి చూపట్లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రోహిత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. "టెస్టు ఫార్మాట్ అత్యంత కఠినమైంది. టెస్టు క్రికెట్ ఆడాలంటే ఆటగాళ్లలో కసి ఉండాలి. అలా ఆకలితో ఉన్న వారికే అవకాశాలు వస్తాయి. లేని వాళ్లకు అవకాశాలు ఇవ్వడంలో అసలు అర్థమే లేదు. ప్రస్తుత భారత జట్టులోని ఆటగాళ్లలో సుదీర్ఘ ఫార్మాట్ పట్ల తపన కనిపిస్తోంది. అయితే టెస్టుల్లో అవకాశాలు తక్కువగానే వస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. విఫలమైన వాళ్లు బయటికి వెళ్లిపోవాల్సిందే" అని రోహిత్ చెప్పాడు.

### టీమిండియాకు బ్యాడ్ న్యూస్..
## టీ20 వరల్డ్ కప్‌కు స్టార్ ప్లేయర్ దూరం

టీమిండియాకు బిగ్ షాక్. చీలమండల గాయంతో జట్టుకు దూరమైన స్టార్ పేసర్ మహ్మద్ షమీ టీ20 ప్రపంచకప్కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. వన్డే వరల్డ్ కప్లో నొప్పిని భరిస్తూనే, ఇంజెక్షన్లు తీసుకుంటూ షమి భారత్ తరఫున గొప్పగా పోరాడిన సంగతి తెలిసిందే. 24 వికెట్లతో టోర్నీలో అత్యధిక వికెట్లు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. అనంతరం గాయం నుంచి కోలుకోవడానికి శ్రమించాడు. ఎన్సీఏలో చికిత్స తీసుకున్నాడు. అయినప్పటికీ గాయం తీవ్రత తగ్గకపోవడంతో నిన్న లండన్లో చీలమండ సర్జరీ చేయించుకున్నాడు. ఈ విషయాన్ని షమి సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. "చీలమండ శస్త్రచికిత్స విజయవతంగా జరిగింది. కోలుకోవడానికి సమయం పడుతుంది. తిరిగి మునపటిలా నా పాదాలను పొందడానికి ఎదురుచూస్తున్నా" అని షమి ట్వీట్ చేశాడు. అయితే సర్జరీ నుంచి కోలువడానికి షమికీ కనీసం రెండు నెలల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో అతడు ఐపీఎల్కు దూరమయ్యాడు. అయితే జూన్ నుంచి వెస్టిండీస్, అమెరికాలో ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్కు కూడా షమి అందుబాటులో ఉండడని తెలుస్తోంది. జూన్లోపు షమి పూర్తి ఫిట్నెస్ సాధించడం, తిరిగి లయను అందుకోవడం కష్టమేనని వార్తలు వస్తున్నాయి. ప్రపంచకప్లో స్టార్ పేసర్ షమి లేకపోవడం టీమిండియాకు ప్రతికూలమే. మరోవైపు షమి లేకపోవడంతో ఐపీఎల్లో గుజరాత్ టైటాన్స్ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. ఇప్పటికే మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్య ముంబయి ఇండియన్స్ గూటికి చేరాడు. దీంతో జట్టు పగ్గాలు శుభ్మన్ గిల్కు అప్పగించారు. ఇప్పుడు షమి కూడా జట్టులో లేకపోవడం గుజరాత్కు కష్టతరమైన విషయమే. గత సీజన్లో గుజరాత్ను ఫైనల్కు చేర్చడంలో షమి పాత్ర కీలకం. జట్టు తరఫున షమి అత్యధిక వికెట్లు తీశాడు. కాగా, మార్చి 22 నుంచి ఐపీఎల్ 17వ సీజన్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. తొలి మ్యాచ్లో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్తో రాయల్ ఛాలెంజర్స్ తలపడనుంది. గుజరాత్ టైటాన్స్ తమ తొలి మ్యాచ్ను మార్చి 24న ఆడనుంది. ముంబయి ఇండియన్స్తో పోటీపడనుంది.

సూర్య
cinema@suryaa.com
హైదరాబాద్
బుధవారం
28 ఫిబ్రవరి 2024


# సూర్య సినిమా

## చారి 111 మంచి ఫన్ ఫిల్మ్: నిర్మాత అదితి సోనీ

వెన్నెల కిశోర్ హీరోగా నటించిన సినిమా 'చారి 111'. 'మళ్ళీ మొదలైంది' ఫేమ్ టీజీ కీర్తి కుమార్ దర్శకత్వంలో బర్కత్ స్టూడియోస్ పతాకంపై అదితి సోనీ నిర్మించారు. సంయుక్తా విశ్వనాథన్ కథానాయికగా, మురళీ శర్మ ప్రధాన పాత్రలో నటించారు. ఈ మార్చి 1న థియేటర్లలో సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్లో చిత్ర బృందం విలేకరుల సమావేశం నిర్వహించారు.దర్శకుడు టీజీ కీర్తి కుమార్ మాట్లాడుతూ... "నేను తెలుగు వాడిని. బెంగళూరులో పదేళ్లు యాడ్ ఫిలిమ్స్ చేసి సినిమాల్లోకి వచ్చా. 'చారి 111'కి ముందు 'మళ్ళీ మొదలైంది'



సినిమా చేశా. అందులో వెన్నెల కిశోర్ గారు కమెడియన్ రోల్ చేశారు. ఆయనకు అప్పుడే ఈ సినిమా కథ చెప్పా. ఆయనకు నచ్చడంతో సినిమా స్టార్ట్ చేశాం. ఆయన ఫెంటాస్టిక్ కమెడియన్. ఆయనకు ఫ్యాన్ నేను. ఆయనకు టైలర్ మేడ్ క్యారెక్టర్ చారి. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్. కమర్షియల్ సినిమాలకు ఏమాత్రం తక్కువ కాకుండా ఉంటుంది. నేను రామ జోగయ్య శాస్త్రి గారి సాహిత్యానికి పెద్ద 'మళ్ళీ మొదలైంది' సినిమాలో పాటలు రాయించుకోవాలని అనుకున్నా. కానీ, కుదరలేదు. ఈ సినిమాతో కుదిరింది. థీమ్ సాంగ్ అద్భుతంగా రాశారు. మ్యూజిక్ డైరెక్టర్ సైమన్ కె కింగ్, నేను బీటెక్ బ్యాచ్మేట్స్. వెన్నెల కిశోర్ గారు బిజీ ఆర్టిస్ట్. వరుస షూటింగ్స్ ఉండటంతో ప్రెస్మీట్కి రాలేకపోయారు" అని అన్నారు. నిర్మాత అదితి సోనీ మాట్లాడుతూ... "నిర్మాతగా నా తొలి సినిమా ఇది. సంథింగ్ డిఫరెంట్, కొత్తగా ట్రై చేశాం. ఫెంటాస్టిక్ టీం కుదిరింది. సినిమాలో పాటకు రామజోగయ్య శాస్త్రి గారు అద్భుతమైన సాహిత్యం అందించారు. వెన్నెల కిశోర్ గారికి నేను పెద్ద ఫ్యాన్. ఆయనతో సినిమా చేయడం చాలా సంతోషంగా ఉంది. మార్చి 1న మా సినిమా విడుదల అవుతోంది. ప్రేక్షకులు అందరూ తప్పకుండా థియేటర్లకు వెళ్లి చూస్తారని ఆశిస్తున్నాను. మంచి ఫన్ ఫిల్మ్ ఇది. ఎంజాయ్ చేస్తారు" అని అన్నారు.

## ఓం భీమ్ బుష్ టీజర్ లాంచ్



బ్యాంగ్ బ్రదర్స్ శ్రీ విష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహించిన 'ఓం భీమ్ బుష్' అవుట్ అండ్ అవుట్- ఎంటర్టైనర్ ప్రీ-లుక్ గ్లింప్స్, ఫస్ట్-లుక్ పోస్టర్తో నవ్వులు పూయించారు. వి సెల్యులాయిడ్, సునీల్ బలుసు కలిసి ఈ ప్రాజెక్ట్ను నిర్మిస్తుండగా, యువి క్రియేషన్స్ సమర్పిస్తుంది. ఇప్పుడు బ్యాంగ్ బ్రదర్స్ ఎంటర్ టైన్మెంట్ వరల్డ్ ని ప్రజెంట్ చేస్తూ టీజర్ గ్రాండ్ గా లాంచ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో శ్రీ విష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ఆస్ట్రోనాట్స్ స్పేస్ సూట్ లో పాల్గొవడం అందరినీ విశేషంగా అలరించింది. ముగ్గురు శాస్త్రవేత్తలు ఒక యాడ్ స్కిప్ చేసి, క్లిష్టమైన స్థితిలో ఉన్న రోగిని పట్టించుకోకుండా యూట్యూబ్లో వీడియో చూడటానికి వేచి ఉండటంతో టీజర్ హిలేరియస్ గా ప్రారంభమవుతుంది. వారు తమ స్థావరాన్ని నగరం నుండి ఓ గ్రామానికి మార్చారు, అక్కడ వారు ఎ నుండి జెడ్ సొల్యూషన్లను ప్రారంభిస్తారు. అయితే, వారికి గ్రామంలోని నిధిని కనుగొనే మరో ఎజెండా ఉంది. ఈ క్రమంలో గ్రామంలో బ్లాక్ మ్యాజిక్ జరుగుతున్నట్లు గమనిస్తారు. దర్శకుడు ప్రతి విషయంలోనూ తనదైన మార్క్ చూపించాడు. ముందుగా, హారర్ అంశాలతో పాటు నిధిని కనుగొనే లక్ష్యంలో ఉన్న శాస్త్రవేత్తలుగా ప్రధాన ముగ్గురిని ప్రజంట్ చేయడం మంచి ఆలోచన. ఎ నుండి జెడ్ సొల్యూషన్స్, గ్రామస్థులతో సంభాషణలు అద్భుతమైన వినోదాన్ని అందించాయి. ముగ్గురూ బెడ్ పై మైండ్ లెస్ గా చర్చించుకునే చివరి ఎపిసోడ్ హిలేరియస్ గా వుంది. గొప్ప వినోదాన్ని అందించిన టీజర్ థియేటర్లలో నవ్వుల హంగామా కోసం ప్రేక్షకులని సిద్ధం చేసింది.

## భవానీ వార్డ్ ఫస్ట్ లుక్ లాంచ్

గాయత్రీ గుప్తా, గణేష్ రెడ్డి, పూజా కేంద్రే, సాయి సతీష్, జబర్దస్త్ అప్పారావు, ఈశ్వర్ బాబు ధూళిపూడి తదితరులు నటించిన హారర్, థ్రిల్లర్ మూవీ భవానీ వార్డ్. అవి క్రియేషన్స్, విభు ప్రొడక్షన్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీని కళ్యాణ్ చక్రవర్తి, చంద్రకాంత్ సోలంకి నిర్మిస్తున్నారు. ఈ మూవీకి జీడీ నరసింహా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ లాంచ్ ఈవెంట్ను సోమవారం నిర్వహించారు. ఈ ఈవెంట్లో దర్శకుడు నరసింహ మాట్లాడుతూ.. నేను చెప్పిన కథను ఒప్పుకుని నటించిన గాయత్రి గుప్తా గారికి థాంక్స్. ఆమె ఎంతగానో సహకరించారు. హీరో గారు అద్భు



తంగా నటించారు. నటీనటుల సహకారంతో ఈ సినిమాను బాగా తీశాను. నిర్మాత కళ్యాణ్, చంద్రకాంత్ గార్ల సహకారం ఎప్పటికీ మర్చిపోలేను. అందరికీ నచ్చేలా సినిమాను తీశాను. మరీ ముఖ్యంగా హారర్ సినిమాలను ఇష్టపడే వారికి ఎక్కువగా నచ్చుతుంది అని అన్నారు. నిర్మాత కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. నరసింహ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. చిన్న చిత్రాలకు సపోర్ట్ చేయాలనే ఉద్దేశంతోనే నేను ఈ చిత్రాన్ని నిర్మించాను. అందరూ మా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. హీరో గణేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఏ సినిమా అయినా మీడియా సహకారంతోనే ముందుకు వెళ్తుంది. మా సినిమాను ఇంతలా సపోర్ట్ చేసిన మీడియాకు థాంక్స్. పీఆర్వో సాయి సతీష్గారు ఈ చిత్రంలో ముఖ్య పాత్రను పోషించారు. నాకు ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్ అని అన్నారు.

## ఆపరేషన్ వాలెంటైన్ ఎమోషనల్గా కనెక్ట్ అవుతుంది

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ అవైటెడ్ ఎయిర్ ఫోర్స్ యాక్షనర్ 'ఆపరేషన్ వాలెంటైన్'. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మించారు. గాడ్ బ్లెస్ ఎంటర్టైన్మెంట్ (వకీల్ ఖాన్), నందకుమార్ అబ్బినేని సహ నిర్మాతలు. టీజర్, ట్రైలర్ ప్రమోషన్ కంటెంట్ ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకోవడంతో సినిమా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం మార్చి1న తెలుగు, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు. దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ 2020లో ఈ కథతో నన్ను సంప్రదించారు. నాకు కథ చాలా నచ్చింది. నేను సోనీ పిక్చర్స్ తో అంతకుముందు ఓ సినిమా చేయాలి. కానీ అది కొన్ని కారణాల వలన టేకాఫ్ కాలేదు. ఈ కథ వారికి పంపించినపుడు వారికీ నచ్చింది. వాళ్ళు కూడా అన్నీ వార్ బ్యాక్ డ్రాప్ సినిమాలు తీస్తున్నారు. నేషనల్ అప్పీల్ వున్న కంటెంట్ ఇది. చాలా గ్రాండ్ బడ్జెట్ తో పక్కాగా ప్లాన్ సినిమాని చేశారు. దర్శకుడు హిందీ అబ్బాయి అయినప్పటికీ సినిమాని తెలుగులో చేయాలనే ఉద్దేశం ఆయనలో ఉంది. సోనీ పిక్చర్స్ వచ్చిన తర్వాత హిందీలో కూడా చేయాలని నిర్ణయిం చాం.



ప్రతి సీన్ ని తెలుగు, హిందీ రెండు భాషల్లో షూట్ చేశాం. దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ లో చాలా పాషన్ వుంది. ఏదో ఒక సినిమా చేసేయాలనే ఆలోచన తనలో లేదు. ప్రత్యేకంగా ఈ కథనే నా ద్వారా చెప్పాలని అనుకున్నాడు. ఆ పాషన్, నమ్మకం తనలో కనిపించాయి. ఈ సినిమా కోసం చాలా రీసెర్చ్ చేశాడు. అంతకుముందు తను చేసిన షార్ట్ ఫిల్మ్ చాలా వైరల్ అయ్యింది. ఎయిర్ ఫోర్స్ అధికారులు కూడా అది చూసి ఆశ్చర్యపోయారు. దీనిపై సినిమా చేయాలనుకున్నపుడు ఇంకా కావాల్సిన సమాచారం ఇస్తామని వారు చెప్పారు. ఈ కథని చాలా పాషన్ తో చేశాడు. తనకి వీఎఫ్ఎక్స్ పై కూడా చాలా మంచి పట్టు వుంది. నటీనటుల నుంచి పెర్ఫార్మెన్స్ ని చాలా అద్భుతంగా రాబట్టుకునే నేర్పు తనలో వుంది. 2019, ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో 40మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీర మరణం పొందారు. దానికి కారణమైన శత్రువులపై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత వైమానిక దళం ఆపరేషన్ నిర్వహించింది. ఫిబ్రవరి 14న ఈ సర్జికల్ స్ట్రయిక్స్ చోటు చేసుకుంది. వాలెంటైన్ డే రోజు జరిగింది కాబట్టి శత్రువులకు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ గా ఈ ఎటాక్ ప్లాన్ చేయడం జరిగింది. ఈ సినిమాలో వాలెంటైన్ అంటే ప్రతి ఒక్కరికీ దేశం మీద వున్న ప్రేమ. ఎయిర్ ఫోర్స్ అధికారులకు ఈ సినిమా చూపించాం. పుల్వామా ఘటన పై ఇప్పటివరకూ వచ్చిన సినిమాల్లో 'ఆపరేషన్ వాలెంటైన్' ది బెస్ట్ అని వారు ప్రసంశించారు. ప్రతి భారతీయుడు ఎమోషనల్గా కనెక్ట్ అయ్యే సినిమా ఇది. అంతరిక్షం సినిమా సమయంలో తొలిసారి వీఎఫ్ఎక్స్ ని ఎక్స్ పీరియన్స్ చేశా. గ్రీన్ స్క్రీన్ చూపించి అక్కడే చంద్రుడు ఉన్నాడని చెబితే కాస్త ఇబ్బందిగా అనిపించింది(నవ్వుతూ). రానురాను అది అలవాటైయింది. ఈ సినిమా విషయానికి వస్తే అసలు ఫైటర్ ఫ్లైట్ ఎలా పని చేస్తుంది, ఎంత స్పీడ్ లో వెళుతుంది, ఎలా మలువుతిరుగుతుంది ఇవన్నీ ముందే ఒక పైలెట్ని అడిగి తెలుసుకున్నా. ఆయన చాలా ప్రోత్స హించారు. ఒక ఫ్లైట్ సిమ్యులేటర్లో కూర్చోబెట్టి రియల్ లైఫ్ ప్రొజెక్షన్ అనుభూతిని ఇచ్చేలా చేశారు. అందులో కూర్చుంటే రియల్గా ఫ్లయిట్ నడిపినట్లే వుంటుంది. ఆ అనుభవం చాలా ఉపయో గపడింది. ఇలాంటి పాత్రలు చేయడం ఒక ఛాలెంజ్. ముఖం మొత్తం ఆక్సిజన్ మాస్క్ తో కప్పబడి వుంటుంది. ఎమోషన్ ని కళ్ళతోనే పలికించాలి. ఇందులో రుద్ర పాత్రలో కనిపిస్తాను. కొందరు రియల్ ఎయిర్ ఫైటర్స్ స్ఫూర్తితో నా పాత్రని చాలా అద్భుతంగా డిజైన్ చేశాడు దర్శకుడు. రుద్ర పాత్రతో అందరూ చాలా ఎమోషనల్ గా కనెక్ట్ అవుతారు.

## లవ్ మీ కథ వినగానే ఫుల్ ఎగ్జైట్ అయ్యాను

యంగ్ హీరో ఆశిష్, వైష్ణవి చైతన్య నటించిన చిత్రాన్నిశిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ మీద హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. ఈ చిత్రానికి అరుణ్ భీమవరపు దర్శకత్వాన్ని వహించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ ప్రకటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సినిమాకు లవ్ మీ అనే టైటిల్ను ఫిక్స్ చేశారు. ఇఫ్ యూ డేర్ అనేది ఉప శీర్షిక. టైటిల్ ప్రకటించిన అనంతరం చిత్రయూనిట్ మీడియాతో ముచ్చటించారు.




హిట్ చిత్రాల నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. ఆశిష్ ప్రస్తుతం తిరుమలలో ఉన్నారు. అందుకే అతను ఇక్కడకు రాలేకపోయారు. లవ్ మీ ఇఫ్ యూ డేర్ అనేది మొదలవ్వడానికి నాగ, అరుణ్ కారణం. నాగ నాకు ఎప్పటి నుంచో పరిచయం. ఓ స్క్రిప్ట్ వినండి.. నా ఫ్రెండ్తో కలిసి చేశామని అన్నాడు. అప్పుడు అరుణ్తో నాకు పరిచయం ఏర్పడింది. ఆ స్క్రిప్ట్ విన్న క్షణమే ఓ ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లా. ఆర్య కథ విన్నప్పుడు ఎలా ఎగ్జైట్ అయ్యానో.. మళ్లీ అలా ఎగ్జైట్ అయ్యాను. ఇదొక న్యూ ఏజ్ ఫిల్మ్. ఆశిష్ హీరోగా కావాలని అడిగారు. అలానే హర్షిత్, హన్షిత్ను ఇవ్వండని నాగ అడిగారు. కథ చెప్పి నన్ను గెలిచారు. కొత్త వాళ్లతో బలగం తీశాం. కొత్త వాళ్లని ఎంకరేజ్ చేయాలని దిల్ రాజు ప్రొడక్షన్స్ పెట్టాం. ఈ కథను చాలా మందికి చెప్పాం. అందరూ ఎగ్జైట్ అయ్యారు. స్క్రిప్ట్ పూర్తయ్యాక.. టెక్నీషియన్స్ పేర్లు చెబితే భయం వేసింది. పీసీ శ్రీరామ్ గారికి స్క్రిప్ట్ వినమని చెప్పాను. ఆయన స్క్రిప్ట్ చదివి వెంటనే ఓకే చెప్పారు. మ్యూజిక్ విషయంలో కీరవాణి కావాలన్నారు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటివి చేస్తున్నారు.. ఆయన మీకు దొరుకుతాడా? అని అన్నారు. కీరవాణి గారిని అప్రోచ్ అయి స్క్రిప్ట్ వినిపించారు. ఆయన కూడా స్క్రిప్ట్ విని వెంటనే ఓకే చెప్పారు. హీరోయిన్ కోసం వెతుకుతున్న టైంలో బేబీ పెద్ద హిట్ అయింది. ఆఫీస్కు వచ్చి స్క్రిప్ట్ పూర్తిగా చదివి ఫుల్ ఎగ్జైట్ అయింది. ఇలా ఓ స్క్రిప్ట్ ఈ రేంజ్లో ఎగ్జైట్ చేయించడం చాలా అరుదుగా చూస్తాం. ఇక సినిమా విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రాబట్టుకుంటుందని నాకు నమ్మకంగా ఉంది. ఫిబ్రవరి 27న టైటిల్ ప్రకటించారు. ఏప్రిల్ 27న సినిమాను రిలీజ్ చేయబోతోన్నాం. బలగం తరువాత హర్షిత్, హన్షితలు వేరే ప్రాజెక్ట్ చేయాల్సింది ఈ సినిమా వచ్చింది. ఆశిష్ కూడా వేరే ప్రాజెక్ట్ చేయాల్సింది.. ఈ ప్రాజెక్ట్ రెడీ అయింది. నాకు ఆర్య విషయంలో ఏం జరిగిందో.. మీ అందరికీ అదే జరగబోతోందనే వైబ్స్ వస్తున్నాయి. సినిమా టీంకు ఆల్ ది బెస్ట్ అన్నారు.

## ఎమోషనల్ బ్లాక్ బస్టర్ సిద్ధార్థ్ రాయ్

పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్, యంగ్ హీరో దీపక్ సరోజ్ హీరోగా అరంగేట్రం చేసిన చిత్రం సిద్ధార్థ్ రాయ్. హరీష్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి పెద్ద దర్శకుల వద్ద పనిచేసిన వి యశస్వీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తన్వి నేగి కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ విహిన్ క్రియేషన్స్ పతాకాలపై ప్రొడక్షన్ నెం 1గా జయ అడపాక, ప్రదీప్ పూడి,



సుధాకర్ బోయినలు సంయుక్తంగా నిర్మించారు. ఫిబ్రవరి 23న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అందరినీ అలరించి యూత్ ఫుల్ ఎమోషనల్ బ్లాక్ బస్టర్ గా అలరిస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ ప్రెస్ మీట్ ని నిర్వహించింది. యూత్ ఫుల్ ఎమోషనల్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ లో దర్శకుడు వి యశస్వీ మాట్లాడుతూ.. సిద్ధార్థ్ రాయ్ సినిమా థియేటర్స్ లో ఆదరిస్తున్న ప్రేక్షకులకు, ముఖ్యంగా యూత్ కి మా యూనిట్ తరవున ధన్యవాదాలు. థియేటర్స్ లో మంచి ఫుట్ పాల్ వుంది. అన్ని ఏరియాల నుంచి డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబ్యూటర్స్ ఫోన్స్ చేసి ఈ వారం వచ్చిన సినిమాల్లో సిద్ధార్థ్ రాయ్ మంచి సినిమాగా రన్ అవుతుందని చెప్పడం అనందంగా వుంది. ఇంకాస్త మెరుగ్గా ఫుట్ ఫాల్ వుంది. ఈ వీకెండ్ మా సినిమా మరింత ప్రేక్షకుల ఆదరణ అందుకొని ముందుకు వెళ్తుందని భావిస్తున్నాం. సినిమాకి చాలా మంచి రెస్పాన్స్ వుంది. యువ ప్రేక్షకులు ఫస్ట్ హాఫ్ కి చాలా కనెక్ట్ అయ్యారు. సెకండ్ హాఫ్ కి పెద్దలు, ఫ్యామిలీస్ కనెక్ట్ అయ్యారు. ఒక యునిక్ బ్లెండ్ తో వుంది సినిమా. మేము అనుకున్నట్లే ఆడియన్స్ నుంచి రెస్పాన్స్ వుంది. దీపక్, తన్వి పెర్ఫార్మెన్స్ కి మెస్మరైజ్ అవుతున్నారు. పాటలని కూడా ఎంజాయ్ చేస్తున్నారు. మా సినిమా థియేటర్స్లో ఇంకా బాగా ఆడి మేము అనుకున్నట్లుగా కమర్షియల్ పే అఫ్ ఇస్తుందని నమ్ముతున్నాం. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు" తెలిపారు.

## చాందినీ చౌదరి యేవమ్ లోగో లాంచ్

కలర్ ఫోటో , గామి చిత్రాల ఫేమ్ చాందినీ చౌదరి, కేజీఫ్నారప్ప ఫేమ్ వశిష్ట, నూతన నటుడు భరత్ రాజ్, బిగ్ బాస్ ఫేమ్ అషు రెడ్డి ముఖ్యపాత్రలలో, ప్రకాష్ దంతులూరి దర్శ త్వంలో, నవదీప్ - పవన్ గోపరాజు స్థాపించిన - నిర్మాణంలో రూపొందించబడిన యేవమ్ సినీమా ప్రమోషన్స్ ఫిబ్రవరి 25 నుండి మొదలయ్యాయి. ప్రసిద్ధ చిత్రకారుడు లక్ష్మణ్ ఏలై చేత ప్రత్యేకంగా చేయించిన టైటిల్ లోగో సినీతారల ద్వారా కాకుండా చిత్రకారుడి చేత ఆవిష్కరించ బడటం ఒక వినూత్న ప్రయత్నం. మన ఇన్స్టా యూజర్స్ కూడా దీన్ని లైక్ చేసి షేర్ చేస్తూ సక్సెస్ చేస్తున్నారు. ఈ చిత్రం ఒక సైకలాజికల్ థ్రిల్లర్ అని, చాందినీ నటన హైలైట్ అని చిత్రకారులు చెప్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం నీలేష్ మండాలవు మరియు



కీర్తన శేష్, సినిమాటోగ్రఫర్ గా విశ్వేశ్వర్ , ఎడిటర్ గా సృజన అడుసుమిల్లి, ప్రొడక్షన్ డిజైనర్ గా లక్ష్మణ్ ఏలై గారు పని చేశారు.

## ఫ్యాన్స్కి సర్ప్రైజ్ ఇచ్చిన ఆలియా

హీరోయిన్లు నేచురల్ బ్యూటీతో కనిపించడం అన్నది చాలా రేర్. ఒకవేళ కనిపిస్తే ఎలా ఉంటుందో తెలిసిందే. మ్యాకప్ లో ఎంత అందంగా కనిపిస్తారో? మ్యాకప్ లేకపోతే అంతకు మించి ఆశ్చర్యానికి గురి చేసిన భామలెంతో మంది. అలాగని నేచుర్ బ్యూటీతో మెప్పించని భామలు లేరు? అని కాదు. సహజ అందంతోనూ అలరించిన భామలెంతో మంది. మరి బాలీవుడ్ యంగ్ బ్యూటీ అలియాభట్ కి ముఖానికి మ్యాకప్ అస వరమా? అంటే అవసరం అనేలాగే ఈ పిక్ ఆమె బ్యూటీని హైలైట్ చేస్తుంది. ఇదిగో ఇక్కడ కనిపిస్తోన్న పిక్ లో అలియాభట్ ఎలాంటి మ్యాకప్ వేసుకోలేదు. నేచురల్ అందంతో ఆఫోటోని లీక్ చేసింది. అందులో అలియాభట్ ఫేస్ అంతా రెడీష్ గా కనిపిస్తుంది. ముఖమంతా కందిపో యినట్లు ఫోకస్ అవుతుంది. ఇది పూర్తిగా మ్యాకప్ లెస్ స్టిల్ కావడం విశేషం. ఆ పక్కనే మ్యాకప్ తో మరో ఫోటో ఉంది. అందులో అలియా ఎంత అందంగా ఉందో కనిపిస్తోంది. ఈ రెండు ఫోటోల మధ్య వ్యత్యాసం చూపించడం కోసమే ఇలా ఈ ఫోటో లీకైనట్లు ఉంది. నిత్యం మ్యాకప్ వేసుకోవడంతోనే కొందరు హీరోయిన్ల ముఖాలు పాడవుతుంటాయి. ఆ రంగులు..క్రములకు అలవాటైన క్రమంలో ఫేస్ లో మార్పులు వస్తుంటాయి. అలియా ముఖంలో ఆ మార్పులు స్పష్టంగా కనిపి స్తున్నాయి. గతంలోనూ అలియా మ్యాకప్ లెస్ ఫోజులు కొన్ని వైరల్ అయ్యాయి. ముఖ్యంగా గర్భవతిగా ఉన్నప్పుడు ఆమె ఫోటోలు కొన్ని వైరల్ అయ్యాయి. అయితే గర్భం దాల్చిన సమయంలో శరీరం మొత్తం సహా ముఖంలో ఎన్నో మార్పులు వస్తుంటాయి. ప్రసవం తర్వాత ఆ మార్పులు స్పష్టంగా గమనించవచ్చు. అలియాకి చెందిన అలాంటి ఫోటోలు కొన్ని నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజా ఫోటో కూడా వైరల్ అవ్వడంతో నెటి జనులు ఆసక్తికర కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఫిల్టర్ వేయకపోతే అచ్చంగా తండ్రి మహేష్ భట్ లా ఉందంటూ ఓ యూజర్ పోస్ట్ చేసాడు.





PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.